# III. ఇస్లాం యొక్క రెండవ మూల స్థంభం - నమాజ్

ఇస్లాం అనే కట్టడానికి మూల స్థంభాలు ఐదు (5). అవి:

**01. తౌహీద్ మరియు రిసాలత్,** అనగా ఏక దైవారాధన మరియు దైవ దౌత్యం.
**ఏక దైవారాధన** అనగా అల్లాహ్ తప్ప వేరు ఆరాధింప తగినవాడు లేడు.
**దైవ దౌత్యం** అనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు దైవ సందేశహరులు అని మనస్ఫూర్తిగా విశ్వసించుట.

**02. నమాజ్‌ను స్థిరపరచుట,** అనగా క్రమం తప్పకుండా నమాజ్‌ను ఆచరించుట.

**03. రోజ,** అనగా రమజాను మాసంలో ఉపవాసముండుట.

**04. జకాత్,** అనగా పేదలకు, వారి ఆర్థిక హక్కును చెల్లించుట.

**05. హజ్,** అనగా స్తోమత కల్గినవారు అల్లాహ్ ప్రీతి కొరకు మక్కాయాత్ర చేయుట.

## 01. నమాజ్ యొక్క విశిష్టత మరియు శ్రేయో శుభాలు

ఒక ప్రత్యేక పద్ధతిలో దాసుడు తన ప్రభువైన అల్లాహ్ యెడల తన భక్తి శ్రద్ధలు, వినయ విధేయతలు ప్రదర్శిస్తూ చేసే ఆరాధననే "సలాత్" లేక "నమాజ్" అని అంటారు. (దీనియాత్ 1బిజి, స. 71)

సర్వోన్నతుడైన అల్లాహ్ ఇచ్చిన ఆదేశాలలో అన్నింటి కంటే ముఖ్యమైనది మరియు ఘనత కలిగిన ఆజ్ఞ - నమాజ్. మనిషి శరీరంలో తల ఎలాంటి ప్రాముఖ్యాన్ని కలిగి ఉందో, ఇస్లాంలో నమాజ్ అంతటి ప్రాముఖ్యాన్ని కలిగి యున్నది.

ఇస్లాంలో అల్లాహ్ మరియు అల్లాహ్ సందేశహరులు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పై సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించి, ఏక దైవారాధన మరియు దైవదౌత్యం అనగా సద్వచనం (కలిమయె తయ్యిబ) పఠించిన తరువాత, మొట్టమొదటిది మరియు విధి(ఫర్జ్) గా పాటించ వలసిన ఆజ్ఞ - "నమాజ్".

దాసులు తమ ప్రభువైన అల్లాహు తఆలాను ఆరాధించుటకు ప్రత్యేకించ బడినది - నమాజ్. ప్రతి రోజు ఐదు వేళలలో ఆచరించ వలసినదిగా విధి

గావింపబడి యున్నది. అల్లాహ్ గ్రంథమైన పవిత్ర ఖుర్ఆన్‌లో 50కి పైచిలుకు ఆయత్‌ల (సూక్తుల) లోను, మరియు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి నూటికి పైచిలుకు హదీసులలోను, నమాజ్ యొక్క విశిష్టతను గురించి మరియు క్రమం తప్పకుండా నమాజ్ ఆచరించ వలసిన ఆవశ్యకతను గురించి గట్టిగా హెచ్చరించడ మైనది. నమాజ్ ను ఇస్లామ్ యొక్క మూల స్థంభం గాను మరియు ఇస్లామ్ యొక్క పునాది గాను పేర్కొనబడినది. (ఇస్లాం క్యా హై? స.18)

**నమాజ్ యొక్క విశిష్టత ఏమనగా** సక్రమమైన పద్ధతిలో అల్లాహ్ ఎదురుగా యున్నాడని, మనలను చూస్తున్నాడనే భావనతో, ఏకాగ్రత కలిగి, పూర్తి భక్తి శ్రద్ధలతో వినయ విధేయతలతో నిష్టగా నమాజ్‌ను ఆచరించినచో, విశ్వాసి మనసు పరిశుద్ధమౌతుంది, అతని ఇహలోక జీవితం పావన మౌతుంది, అతని లోని దుర్గుణాలు నశిస్తాయి. పుణ్యకార్యాలయెడల ఆసక్తి కలుగుతుంది. సత్యాన్ని ప్రేమిస్తాడు. అతని మనసులో అల్లాహు తఆలా యెడల ప్రేమ, భయ భక్తులు జనిస్తాయి. (ఇస్లాం క్యా హై ? స.18)

ఇందువల్లనే, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఇస్లాం స్వీకరించడానికి తన వద్దకు వచ్చిన వారికి సద్వచనం (కలిమయె తయ్యిబ) అనగా ఏక దైవారాధన మరియు దైవదౌత్యాల గురించి బోధించిన తరువాత నమాజ్‌ను గురించి ఆజ్ఞా పించేవారు. వాస్తవానికి సద్వచనం (కలిమయె తయ్యిబ) తరువాత నమాజే ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది. (ఇస్లాం క్యా హై ? స.18)

నమాజ్ యొక్క **ఇంకొక విశిష్టత** ఏమనగా నమాజ్ ఆచరించే సమయంలో నమాజ్ చదువుతున్న వ్యక్తి యొక్క **మనసుతో పాటు శరీరం కూడా ఆరాధనలో నిమగ్నమై పోతుంది.** సమస్త అవయవాలు అనగా చేతులు కాళ్ళు, తల, నడుం, ముక్కు, కండ్లు, నాలుక మొదలగు అవయవాల నన్నింటినీ అవసరానుసారం నమాజ్‌లో ఉపయోగిస్తాడు. ప్రతీ అవయవం అల్లాహ్ ఆజ్ఞానుసారం ఉపయోగింప బడుతుంది.

నమాజ్‌ను సక్రమమైన పద్ధతిలో ఆచరించువాని బాహ్య జీవితం కూడా చెడు గుణాలకు దూరమై పరిశుద్ధమౌతుంది. అందు వలననే పవిత్ర గ్రంథమైన ఖుర్ఆన్‌లో "నిశ్చయంగా నమాజ్ సిగ్గుమాలిన మరియు చెడు కార్యాల నుండి కాపాడుతుంది" అని చెప్పబడినది. (సూరయె అన్‌కబూత్, వా.45)

ఒక హదీసులో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఇట్లు తెలిపిరి: **"సర్వోన్నతుడైన అల్లాహు తఆలా విశ్వాసుల కొరకు ప్రతిరోజు ఐదు (5) పూటల నమాజ్‌ను విధి (ఫర్జ్) గా నిర్ణయించాడు. ఎవరైతే సక్రమంగా, చక్కగా వుజూ చేసి, నిర్దేశించిన సమయాలలో ఆయా నమాజ్‌లను ఆచరిస్తాడో, రుకూ, సజ్ద మొదలగునవి సక్రమంగా అమలు పరుస్తాడో - అట్టివారిని క్షమించి అనుగ్రహిస్తానని అల్లాహు తఆలా వాగ్దానం చేసియున్నాడు. ఎవరైతే సరియైన పద్ధతి ప్రకారం నమాజ్ ఆచరించరో, అటువంటివారి కొరకు ఎటువంటి వాగ్దానం లేదు. అల్లాహు తఆలా తలచుకుంటే వారిని అనుగ్రహించ వచ్చును లేదంటే కఠినంగా శిక్షించనూ వచ్చును".** (అబుదావూద్)

**"ఎవరైతే నమాజ్ వేళ కాగానే, సక్రమమైన పద్ధతిలో రుకూ, సజ్దాలు చేస్తూ, నమాజ్‌ను చక్కగా ఆచరిస్తాడో, అటువంటివాని పూర్వపు పాపము లన్నియు క్షమించ బడును".** (ముస్లిమ్, 1/121)

నమాజ్ మోక్షానికి, సాఫల్యానికి మార్గదర్శి అవుతుంది. హజ్రత్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఒకసారి నమాజ్‌ను గురించి చర్చిస్తూ ఇలా సెలవిచ్చారు: **"ఎవరైతే క్రమం తప్పకుండా నమాజ్‌ను ఆచరిస్తాడో, ఆ వ్యక్తి కొరకు ప్రళయ దినాన నమాజ్ దివ్య జ్యోతి (నూర్) యగును. అతని విశ్వాసానికి, రుజు ప్రవర్తనకు సాక్ష్యమగును. అతని సాఫల్యానికి కారణమగును".**

ఎవరైతే నమాజ్‌ను నిర్లక్ష్య పరుస్తాడో, లేక సక్రమంగా ఆచరించడో - అట్టి వారి కొరకు నమాజ్ జ్యోతిగా గానీ, విశ్వాసానికి రుజువుగా గానీ యుండదు, సాఫల్యానికి సాధనంగా కూడా ఉపయోగ పడదు. మరియు ప్రళయ దినం నాడు ఆ వ్యక్తి ఖారూన్, ఫిరౌన్, ఫిరౌన్ యొక్క మంత్రి హామాన్ మరియు ముష్రికుల సర్దార్‌గా అపఖ్యాతి గాంచిన "ఉబై ఇబ్నె ఖల్ఫ్" లతో పాటుగా నరకంలో ఉంటాడు.

కాబట్టి ప్రతి ముస్లిమ్ "నమాజ్"ను శ్రద్ధా భక్తులతో ఆచరించి, తద్వారా ప్రళయ దినం నాడు అవిశ్వాసుల సరసన చేరకుండా కాపాడుకోవాలి. నమాజ్ ముస్లిమ్‌ల గుర్తింపు (ఐడెంటిటి) అయి ఉన్నది. ముస్లిమ్‌లను కాఫిర్‌ల (అవిశ్వాసుల) నుండి వేరు పరచునది నమాజ్ మాత్రమే. (ముస్లిమ్ ఖవాతీన్ కే లియే 20 సబఖ్)

**నమాజ్ యొక్క శ్రేయోశుభాలు, అనుగ్రహాలు (బరకతేం) అపారం.** ఏ దాసుడైతే ఐదు పూటల నమాజ్ సక్రమంగా ఆచరిస్తాడో, అతడు అల్లాహు తఆలా యొక్క ప్రత్యేకమైన ప్రేమకు, కరుణకు, అనుగ్రహానికి అర్హుడ (హక్కుదారుడ) వుతాడు. ప్రతి పూట నమాజ్ చేయుటచే అతని పాపాలు క్షమింప బడతాయి. అతడి హృదయంలో జ్ఞానజ్యోతి అంకురిస్తుంది. అతని జీవితం పాపాల మురికి కూపం నుండి బయటపడి పరిశుద్ధమౌతుంది. అతనికి మోక్షం లభిస్తుంది. (ఇస్లాం క్యాహై? స.21)

**ప్రళయదినం (తీర్పుదినం) అన్నింటి కంటే ముందు నమాజ్ యొక్క లెఖ్ఖ తీసుకో బడుతుంది. "నిస్సందేహంగా ప్రళయదినం నాడు అన్నింటి కంటే ముందు ప్రతి మనిషి యొక్క "నమాజ్ లెఖ్ఖ" చూడబడును. అది సక్రమంగా యుండినచో అతడు సఫలుడగును. ఏ కొరత లేనివాడుగా పరిగణింప బడును. నమాజ్ యొక్క లెఖ్ఖ సరిగా లేనియెడల అతడు స్వర్గపు సౌభాగ్యాలకు, అనుగ్రహాలకు దూరమగును. మరియు కష్టాలలో, నష్టాలలో మునిగి పోవునని"** హజ్రత్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు తెలిపిరి. (ము ఖ కే లి 20 సబఖ్/10)

**నమాజ్ యొక్క** విలువను గూర్చి ప్రస్తావిస్తూ **"ఎవరైనా ఒక్కపూట నమాజ్ చేయనిచో కలుగు నష్టం, ఆ వ్యక్తి యొక్క సమస్త కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, సమస్త సంపద కోల్పోయిన ఎంతటి నష్టం మరియు బాధ కలుగునో, దానితో సమానం"** అని హజ్రత్ రసులుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు తెలిపిరి.

తమ భార్యా పిల్లల పోషణ కొరకు ఉద్యోగాలు, వ్యాపారాలలో మునిగిపోయి నమాజ్ ఆచరించుట యందు నిర్లక్ష్యం వహించే ముస్లిము లందరు పై హదీసులను గుర్తుంచుకోవడం ఎంతైనా అవసరమై యున్నది. ఎటువంటి పరిస్థితులలోను నమాజ్‌ను విడిచి పెట్టరాదు. (ముస్లిమ్ ఖవాతీన్ కే లియే 20 సబఖ్)

ప్రముఖ హదీసుల ద్వారా తెలియునదేమంటే, రసూల్లుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు, నమాజ్ ఆచరించక పోవటాన్ని అవిశ్వాసు (కాఫిర్) ల లక్షణం గాను, "కాఫిర్‌ల అలవాటు" గాను పేర్కొనటం జరిగింది. ఏ వ్యక్తి నమాజ్ ను ఆచరించడో, అతడు "ఇస్లామ్" లో భాగస్వామి కానేరడని రసూల్లుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు స్పష్టంగా పలికిరి.

ముస్లిమ్ సోదరులారా! మనమందరం పై విషయాలను నిశితంగా ఆలోచించ వలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మనం సక్రమంగాను, నిష్టగాను నమాజ్ ఆచరించక పోతే, ప్రళయ దినం అన్నింటి కంటే ముందు భరించలేని కఠినమైన శిక్షలకు, అవమానాలకు, నిందలకు గురి కావలసి యుంటుంది. నమాజ్ ను ఆచరించకుండ ముస్లిమ్ అని చెప్పుకోవడం నిరాధార మైన విషయం. నమాజ్ ఆచరించడమనేది కేవలం ఇస్లామ్ కు మాత్రమే ప్రత్యేకించ బడిన ఒక మహత్తర ఆచరణ(అమల్). ఈ ఆచరణే సర్వోన్నతుడైన అల్లాహు తఆలా తో మన సంబంధాన్ని కలిపి ఉంచుతుంది. మరియు అపారమైన ఆయన కరుణా కటాక్షాలకు మనలను అర్హులుగా, హక్కుదారులుగా చేస్తుంది. (ఇస్లామ్ క్యాహై?,స. 19)

## 2. ధ్యానం మరియు ఏకాగ్రత (ఖుషూ వ ఖుజూ)

ధ్యానం మరియు ఏకాగ్రతతో నమాజ్ ఆచరించడం అంటే "అల్లాహు తఆలా నా ఎదుట యున్నాడు, నన్ను చూస్తున్నాడు అనే భావన మనసు నందు కలిగి, అల్లాహ్ యెడల సంపూర్ణ ప్రేమ కలిగి, ఆయన ఔన్నత్యాలను స్మరించు కుంటూ, ఆయన అనుగ్రహాలను స్మరించి కృతజ్ఞతా భావాన్ని మనసునందు కలిగి, అత్యంత శ్రద్ధ కలిగి, భయ భక్తులతో మనసును అల్లాహ్ ఆరాధనలో లీనం చేయడం" అని అర్థం.

ఏ విధంగా ఒక నేరస్థుడు, రాజు లేక చక్రవర్తి ముందు భయంతో ఒదిగి నిలబడి యుంటాడో, అంత కన్నా అనేక రెట్లు వినయ విధేయతలతో నిలబడి నమాజ్ ను ఆచరించాలి.

నమాజ్ కొరకు నిలబడి నప్పుడు "నేను నా సృష్టికర్త, నా ప్రభువు, నా పోషకుడు, నా పాలకుడు అయిన అల్లాహ్ ముందు నిలబడి ఉన్నాను" అనే భావన మనసు నందు కలిగి యుండాలి.

ఇదే విధంగా సజ్దా చేస్తున్నప్పుడు "మనం చేసిన పాప కార్యాలను, పొరబాట్లను తలంచుకొని, మిక్కిలి బాధా తప్త హృదయులై, మన తక్కువ తనాన్ని, అసహాయతను తలంచుకొని, నీవే శరణు, నీవు తప్ప మమ్ముల కాపాడేవారు వేరెవ్వరూ లేరు, మమ్ముల కాపాడమని, క్షమించమని వేడుకుంటున్నాను" అన్న తలంపు కల్గియుండాలి.

నమాజ్ కొరకు నిలబడి యునప్పుడు పఠించు ఖుర్ఆన్ ఆయత్‌ల భావాన్ని, రుకూ, సజ్దాలలో మనం పఠించు తస్‌బీహ్‌లు, మరియు దుఆల భావాన్ని గుర్తు చేసుకుంటూ యుండాలి. అప్పుడే నమాజ్‌లో నిజమైన అభిరుచి కల్గుతుంది. ఏకాగ్రతతో మనస్సు నందు అల్లాహ్ ధ్యానమును మాత్రమే కల్గియుండుటయే నమాజ్ యొక్క ఆత్మ మరియు దాని జీవం. అల్లాహు తఆలా యొక్క దాసులు ఇటువంటి నమాజ్ చదివినచో, పాపాల నుండి విముక్తి పొంది పరలోక సాఫల్యాన్ని తప్పక పొందుదురు. (ఇస్లామ్ క్యా హై?, స. 24)

## 3. నమాజ్ కొరకు అవసరమైన ముఖ్య విషయాలు

ఇస్లామ్ ధర్మము సమగ్ర జీవిత విధానం. జీవితంలో ఆరాధనలు చాలా ముఖ్య మైనవి. ఆ ఆరాధనలను ఆచరించే సరియైన పద్ధతులు, జరిగే పొరబాట్లను తెలియ జేయు విషయాలను సిద్ధాంతాలు (మసాయిల్) అంటారు. నమాజ్ సక్రమంగా ఆచరించాలి అంటే, ప్రతి ముస్లిమ్ వీటికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కలిగి ఉండడం చాలా అవసరం. అందువల్ల ఆ విషయాల గురించి ఇక్కడ క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. వీటిని తెలుసుకోవడం వల్ల ప్రతి ఒక్కరికీ ఎనలేని మేలు జరుగుతుంది, ఇన్‌షా అల్లాహ్.

## 3.1. ఇస్లామ్ ధర్మశాస్త్ర పారిభాషిక పదాలు (షరీఅత్‌కే ఇస్తిలాహే)

కొన్ని పదాలు కేవలం ఇస్లామీయ ధర్మశాస్త్రంలో ప్రత్యేకమైన అర్థాలలో వాడబడతాయి. వాటిని ఇస్లామ్ ధర్మశాస్త్ర పారిభాషిక పదాలు అంటారు. ధర్మశాస్త్ర ఆదేశాలను, సిద్ధాంతాలను అర్థం చేసుకోవడానికి ఈ పదాలను గురించి తెలుసు కోవటం చాలా అవసరం.

### 3.1.1. ఫర్జ్

**ఫర్జ్ అనగా అల్లాహ్ యొక్క ఆజ్ఞ.** అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం గారి సుస్పష్టమైన ఆదేశాలు, ప్రత్యామ్నాయం లేనివి (అనగా వాటికి బదులు వేరే ఆచరించుటకు వీలులేనివి), యై ప్రతి ముస్లిమ్ విధిగా పాటించ వలసినవిగా నిర్ణయించబడి యున్న ఆదేశాలను ఫర్జ్ అంటారు. వీటిని నిరాకరించినవాడు (అంగీకరించనివాడు) అవిశ్వాసి (కాఫిర్)

అగును. ఏ కారణం లేకుండా వీటిని ఆచరించనివాడు అపరాధి (ఫాసిఖ్) అవుతాడు.
**గమనిక:** "ఫర్జ్" అనునది సరియైన ఉచ్చారణ. దానిని మనము 'ఫరజ్' అని ఉచ్చరించు చున్నాము. సరియైన ఉచ్చారణను అలవరచుకోవలెనని మనవి చేయు చున్నాను.

ఈ ఫర్జ్ రెండు విధాలు. 1. ఫర్జె ఐన్, 2. ఫర్జె కిఫాయా.

**1. ఫర్జె ఐన్:** ప్రతి ముస్లిమ్ తప్పని సరిగా ఆచరించ వలసిన విధి (ఫర్జ్) ని ఫర్జె ఐన్ అంటారు. ఈ విధిని పాటించని వ్యక్తి ఘోరమైన అపరాధి అవుతాడు, శిక్షార్హుడవుతాడు. ఉదా: ఐదు వేళల నమాజ్ సలుపుట, రమజాన్ మాసంలో ఉపవాసాలు ఉండుట, స్తోమతగలవారు జకాత్ చెల్లించుట, హజ్ మొదలగునవి.

**2. ఫర్జె కిఫాయా:** సామూహికంగా ముస్లిమ్‌లు ఆచరించ వలసిన 'విధి' (ఫర్జ్) ని 'ఫర్జెకిఫాయా' అంటారు. దీనిని ప్రతి ముస్లిమ్ తప్పని సరిగా ఆచరించ వలసిన నియమము లేదు. ఈ విధిని కొందరు ఆచరించినను, అందరు ఈ విధిని నెరవేర్చినట్లు అవుతుంది. కానీ ముస్లిమ్‌లలో ఏ ఒక్కరూ దీనిని ఆచరించకపోయినచో, ముస్లిములందరూ అపరాధులై పోతారు. ఉదా: జనాజా నమాజ్, అంత్యక్రియలు, ఇస్లామ్ ధర్మశాస్త్రాన్ని అభ్యసించడం మొదలగునవి.

## 3.1.2. వాజిబ్

వాజిబ్ అనగా స్థిరమైనది, ముఖ్యమైనది అని అర్థం. అల్లాహ్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం గారు ఫర్జ్ వలె స్పష్టంగా కాకుండ ఆదేశించిన కొన్ని ముఖ్య విషయాలను వాజిబ్ అంటారు. దీని స్థాయి ఫర్జ్ కన్నా తక్కువ గాను, సున్నతె ముఅక్కద కన్నా ఎక్కువగాను ఉండును. దీనిని నిరాకరించినవాడు (అంగీకరించనివాడు) అవిశ్వాసి (కాఫిర్) గా పరిగణింప బడడు, కానీ అకారణంగా పాటించనివాడు దోషి (ఫాసిఖ్) గా పరిగణింప బడుతాడు, మరియు కఠిన శిక్షకు పాత్రుడౌతాడు.

## 3.1.3. సున్నత్

సున్నత్ అనగా ఆచారం, సంప్రదాయం అని అర్థం. ధర్మశాస్త్ర పరిభాషలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆచరణలు, పనులను సున్నత్ అంటారు. ఇవి రెండు విధాలు. **1.** సున్నతె ముఅక్కద, **2.** సున్నతె గైర్ ముఅక్కద.

**1. సున్నతె ముఅక్కద:** రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం క్రమం తప్పకుండ చేసిన పనులను, మరియు చేయవలసినదిగా ఆజ్ఞాపించిన పనులను, సరియైన కారణం లేకుండ ఏనాడూ విడనాడని పనులను సున్నతె ముఅక్కద అంటారు. ఉదాహరణకు ఫజ్ర్ నమాజ్‌లో ఫర్జ్‌కు ముందు ఆచరించు 2 రకాతుల సున్నత్, ఇషా నమాజ్‌లో ఫర్జ్ తరువాత ఆచరించు 2 రకాతుల సున్నత్ మొదలగునవి. అప్పుడప్పుడు వీటిని ఆచరించక పోయిన, శిక్ష యుండదు. కానీ ఆచరించక పోవడం అలవాటు చేసుకొనిన, అపరాధిగా పరిగణింప బడుతాడు, మరియు కఠిన శిక్షార్హుడౌతాడు.

**2. సున్నతె గైర్ ముఅక్కద:** రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు తరచుగా చేసిన పనులు, లేక చేయ వలసినదిగా ఆజ్ఞాపించిన పనులు - సరియైన కారణం లేకుండ కూడా విడనాడిన పనులను సున్నతె గైర్ ముఅక్కద అంటారు. ఉదా: అస్ర్ నమాజ్ లో ఫర్జ్‌కు ముందు ఆచరించు 4 రకాత్‌ల సున్నత్ మొదలగునవి. వీటిని ఆచరించక పోయిన, పాపం గానీ, శిక్ష గానీ యుండదు. ఆచరించినచో అధిక పుణ్యఫలం లభించును.

## 3.1.4. నఫిల్ (ముస్తహబ్)

అదనంగా చేసే పనిని నఫిల్ అంటారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు అప్పుడప్పుడు చేసిన పనులను ధర్మశాస్త్ర పరిభాషలో నఫిల్ అంటారు. ఉదా: ఇష్రాఖ్ (సూర్యోదయం తరువాత చేయు) నమాజ్, రమజాను మాసంలో కాకుండ మిగిలిన రోజులలో ఉండే ఉపవాసాలు మొదలగునవి. వీటిని ఆచరించిన పుణ్యం లభిస్తుంది, ఆచరించనిచో ఎటువంటి పాపం కలుగదు. దీనిని ముస్తహబ్ అని కూడా అంటారు.

## 3.1.5. ముబాహ్

చేయడం వల్ల పుణ్యం గానీ, చేయక పోవడం వల్ల పాపం గానీ లేని ప్రతి ధర్మసమ్మతమైన పనిని ముబాహ్ అంటారు. ఉదా: షికారుకు వెళ్ళడం మొదలగునవి.

## 3.1.6. మక్రూహ్

అవాంఛనీయమైన, ఏహ్యమైన పనిని మక్రూహ్ అంటారు. ఇది రెండు

విధాలు. 1. మక్రూహె తహ్రీమీ, 2. మక్రూహె తన్‌జీహీ.

**1. మక్రూహె తహ్రీమీ:** హరాంకు సమీపంగా ఉన్న చెడు ఆచరణలను మక్రూహె తహ్రీమీ అంటారు. ఉదా: పురుషులు వస్త్రాలను మడమ క్రిందికి వ్రేలాడుతూ ధరించడం. దీనిని నిరాకరించినవాడు (అంగీకరించనివాడు) అవిశ్వాసి (కాఫిర్) కాడు, కానీ సరియైన కారణం లేకుండా ఆచరించువాడు అపరాధి (ఫాసిఖ్) గా పరిగణింప బడుతాడు. శిక్షార్హుడౌతాడు.

**2. మక్రూహె తన్‌జీహీ:** ధర్మశాస్త్ర పరిధిలో అసమ్మతమైన కార్యాన్ని మక్రూహె తన్‌జీహీ అంటారు. ఉదా: నమాజ్‌లో కండ్లు మూసుకొనుట మొదలగునవి. వీటిని విడిచి పెట్టుట మంచిది. లేనిచో, నమాజ్ పవిత్రతకు భంగం వాటిల్లుతుంది.

### 3.1.7. హరామ్

హరామ్ అంటే నిషిద్ధం, ధర్మ సమ్మతం కానిది అని అర్థం. ధర్మశాస్త్రం ఏ పనులను చేయరాదని ఆదేశిస్తుందో వాటిని “హరాం” అని అంటారు. ఉదా: అబద్ధం పలుకుట, దొంగతనం చేయుట, వ్యభిచారం చేయుట, మద్యపానం మొదలగునవి.

ప్రతి ముస్లిమ్ వీటికి దూరంగా యుండాలి. వీటిని నిరాకరించువాడు (అంగీకరించనివాడు) అవిశ్వాసి (కాఫిర్) అవుతాడు. షరీఅత్ పరమైన కారణమేదియు లేకుండా ఈ నిషిద్ధ కార్యానికి పాల్పడినవాడు, అపరాధి (ఫాసిఖ్) గా పరిగణింప బడుతాడు. శిక్షార్హుడౌతాడు.

## 3.2. నమాజ్ యొక్క కలిమాలు

### 3.2.1. తఅవ్వుజ్

**అఊజు బిల్లాహి మిన ష్షైత్వా నిర్రజీమ్** (నేను అపవిత్రుడైన షైతాను బారి నుండి (రక్షణకొరకు) అల్లాహ్ శరణు వేడుచున్నాను)

### 3.2.2. తస్మియహ్

**బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్:** (అత్యంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభించు చున్నాను)

### 3.2.3. తక్‌బీరె తహ్రీమ

**అల్లాహు అక్బర్:** (అల్లాహ్ చాలా ఉన్నతుడు/గొప్పవాడు)

## 3.2.4. రుకూ లో చదువు తస్‌బీహ్

**సుబ్‌హాన రబ్బియల్ అజీమ్:** (నేను మహిమాన్వితుడైన అల్లాహ్ యొక్క పవిత్రతను కొనియాదు చున్నాను)

## 3.2.5. తస్‌మీత్

(రుకూనుండి లేచి నిలబడుతునప్పుడు పఠించ వలసినది)

**సమి అల్లాహు లిమన్ హమిదహ్** (తన దాసుని స్తుతిని అల్లాహుతఆలా ఆలకించాడు/విన్నాడు)

## 3.2.6. తహ్‌మీద్

(రుకూ నుండి లేచి నిలబడిన తరువాత పఠించ వలసినది)

**రబ్బనా లకల్ హమ్‌ద్ :** (ఓ అల్లాహ్: సమస్త స్తోత్రములు నీకే చెల్లును)

## 3.2.7. సజ్దలో పఠించే తస్‌బీహ్

**సుబ్‌హాన రబ్బియల్‌అత్‌లా:** (నేను శ్రేష్టుడైన అల్లాహ్ యొక్క పవిత్రతను కొనియాదు చున్నాను)

## 3.2.8. తస్‌లీమ్ (సలామ్)

**అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్ :**(మీకు అల్లాహు తఆలా నుండి శుభము, కరుణ లభించుగాక)

## 3.2.9. ఇన్నీవజ్జహ్‌తు

**ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్ అర్‌జ హనీఫం వ్వ మా అన మినల్ ముష్రికీన్.** (నేను ఏకోన్ముఖుడనై నా ముఖాన్ని, భూమి ఆకాశాలను సృష్ఠించినవాని (అల్లాహ్) వైపునకు మరల్చు చున్నాను. నేను ఆయనను మాత్రమే ఆరాధిస్తాను. నేను ముష్రిక్‌ను కాను అనగా ఎవ్వరినీ అల్లాహ్‌కు సహవర్తులుగా చేయువాడిని కాను. (సాటికల్పించు వారిలో లేను)

## 3.2.10. సనా

**సుబ్‌హాన కల్లాహుమ్మ వ బిహమ్‌దిక వ తబారకస్ముక వతఆలా జద్దుక వ లాయిలాహ గైరుక్.** (ఓ అల్లాహ్! నీవు అత్యంత పరిశుద్ధుడవు, సకల ప్రశంసలకు, స్తోత్రములకు నీవే అర్హుడవు, నీ నామం శుభప్రదమైనది, నీ ఘనత ఉన్నతమైనది, నీవు తప్ప వేరు ఆరాధ్యుడే లేడు)

## 3.2.11. తషహ్హుద్ (అత్తహియ్యాత్)

**అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యి బాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వరహ్మతుల్లాహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహి స్సాలిహీన, అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్.** (బుఖారీ) (సమస్త స్తుతులు (వాక్కులు), శారీరక ఆరాధనలు, ధనపరమైన ఆరాధనలు సమస్తం కేవలం అల్లాహు తఆలాకే తగును. ఓ ప్రవక్తా సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ! మీకు అల్లాహ్ నుండి శాంతి, కారుణ్యం, శుభం కలుగుగాక. మాపైన, మరియు సజ్జనులైన సకల అల్లాహ్ దాసుల పైన కూడ శాంతి కలుగుగాక. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్యమిచ్చు చున్నాను, మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ఆయన దాసులని, మరియు ప్రవక్త అని నేను సాక్ష్యమిచ్చు చున్నాను)

## 3.2.12. దరూదె షరీఫ్

**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిం వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమాసల్లైత అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహ్మదిం వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్.** (ఓ అల్లాహ్! ఇబ్రాహీమ్ అలైహి స్సలామ్ పై, ఆయన ఆప్తులపై, మరియు ఆయన సంబంధీకులపై ఎలా కారుణ్యం కురిపించావో, అలాగే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ పై, ఆయన ఆప్తులపై మరియు ఆయన సంబంధీకులపై కూడా కారుణ్యం కురిపించు. నిస్సందేహంగా నీవే స్తుతించ తగినవాడవు, మరియు మహోన్నతుడవు. ఓ అల్లాహ్! ఇబ్రాహీమ్ అలైహి స్సలామ్పై, ఆయన ఆప్తులపై, మరియు ఆయన సంబంధీకులపై ఎలా శ్రేయోశుభాలు కురిపించావో, అలాగే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై, ఆయన ఆప్తులపై మరియు ఆయన సంబంధీకులపై కూడా శ్రేయోశుభాలు కురిపించు. నిస్సందేహంగా నీవే స్తుతించ తగినవాడవు, మరియు మహోన్నతుడవు.)

## 3.2.13. దుఆయె మాసూర

**అల్లాహుమ్మ ఇన్నీ జలమ్తు నఫ్సీ జుల్మన్ కసీరంవ్ వలాయగ్ఫిరు జ్జునూబ ఇల్లా అన్త, ఫగ్ఫిర్లీ మగ్ఫిరత మ్మిన్ ఇన్దిక వర్హమ్నీ ఇన్నక**

**అన్‌తల్ గఫూరు ర్రహీమ్** (ముస్లిమ్, బుఖారీ) (ఓ అల్లాహ్! నేను నా ఆత్మపై అత్యధిక దౌర్జన్యం / అన్యాయం చేసినాను. నీవు తప్ప మరెవ్వరూ నా పాపాలను క్షమించలేరు. కనుక నీవు నీ ప్రత్యేకమైన క్షమాగుణంతో నన్ను క్షమించు మరియు నాపై కరుణించుము. నిస్సందేహంగా నీవే క్షమించే వాడవు, కరుణించు వాడవు,

## 3.2.14. నమాజ్ తరువాత చేసే దుఆలు

**"అల్లాహు అక్బర్"**(ఒకసారి), తరువాత **"అస్తగ్ ఫిరుల్లాహ్"**(మూడుసార్లు) (నేను అల్లాహ్‌ను క్షమించమని కోరుచున్నాను), తరువాత **"అల్లాహుమ్మ అన్‌త స్సలాము వ మిన్‌క స్సలాము తబారక్త యా జల్‌జలాలి వల్ ఇక్రామ్"**(మూడుసార్లు) (ఓ అల్లాహ్! నీవు సర్వదా శాంతియుతుడవు, శాంతి ప్రదాతవు కూడా నీవే, నీవు అపార శ్రేయోశుభాలు కలవాడవు, ఓ మహిమాన్వితుడా! మహోపకారీ!) (ముస్లిం) **"అల్లాహుమ్మ అయిన్నీ అలా జిక్రిక వ షుక్రిక వ హుస్ని ఇబాదతిక్."** (రియాజుస్సాలిహీన్) (ఓ అల్లాహ్! నిన్ను స్మరించుట యందును, నీకు కృతజ్ఞత తెలుపుట యందును, నిన్ను ఉత్తమరీతిలో ఆరాధించుట యందును మాకు సహాయ పడుము.)

## 3.2.15. దుఆయె ఖునూత్

**"అల్లాహుమ్మ ఇన్నా నస్‌తఈనుక వ నస్‌తగ్‌ఫిరుక వనుత్‌మినుబిక వనతవక్కలు అలైక వనుస్‌నీ అలైకల్‌ఖైర్, వనష్‌కురుక వలా నక్‌ఫురుక వనఖ్‌లవు వనత్రుకు మంయ్యఫ్‌జురుక్. అల్లాహుమ్మ ఇయ్యాక నఅ్‌బుదు వలకనుసల్లీ వనస్‌జుదు వ ఇలైక నస్‌ఆ వ నహ్‌ఫిదు వ నర్‌జూ రహ్‌మతక వనఖ్‌షా అజాబక ఇన్న అజాబక బిల్ కుఫ్ఫారిముల్ హిఖ్."** (బిహిష్తీ జేవర్,స.28, దీనియాత్5బిజి స.100) (ఓ అల్లాహ్! మేము నీ సహాయాన్ని వేడుకొను చున్నాము, క్షమించమని నిన్నే వేడుకొను చున్నాము, నిన్నే విశ్వసించు చున్నాము, మరియు నిన్నే నమ్ముకొని ఉన్నాము, నిన్నే అధికంగా పొగడు చున్నాము, నీకు కృతజ్ఞతలు తెలుపు చున్నాము, నీకు కృతఘ్నులు కాము, నీకు కృతఘ్నులైన (నీ ఆజ్ఞలను తిరస్కరించిన) వారి నుండి వేరవు చున్నాము, వారిని విడిచిపెట్టు చున్నాము. ఓ అల్లాహ్! మేము నిన్నే ఆరాధిస్తున్నాము (నీ కొరకే నమాజ్ చదువు చున్నాము), నీకే సాష్టాంగ పడు (సజ్దచేయు) చున్నాము, నీవైపే పరుగిడు చున్నాము(నీ ఆజ్ఞను శిరసావహించు చున్నాము) నీ కరుణా కటాక్షాల పైనే ఆశలు పెట్టుకొని యున్నాము, నీ శిక్షకు భయపడు చున్నాము, నిస్సందేహంగా నీ శిక్ష అవిశ్వాసులకు లభించి తీరును)

## 3.3. నమాజ్ వేళలు (అవ్‌ఖాతె నమాజ్)

నమాజ్ ఆచరించుటకు నిర్ణయింప బడిన నియమాలలో సమయపాలన కుడా ఒకటి. ఏయే నమాజ్‌ల కొరకు ఏయే సమయం నిర్ణయించ బడినదో, ఆయా నమాజ్‌లను, ఆయా సమయాలలోనే, ఆచరించ వలసి యుంటుంది. ఆ సమయానికి ముందు ఆచరించిన, ఆ నమాజ్ నెరవేరదు, ఆ సమయం దాటిన తరువాత ఆచరించిన, అది ఖజా (తప్పిపోయిన నమాజ్) అవుతుంది.

ప్రతి ముస్లింపై, ప్రతిరోజు ఐదు నమాజ్‌లు ఫర్జ్ (విధి) కావింపబడి యున్నవి. ఆ నమాజ్‌లను ఆచరించ వలసిన సమయాలు కూడా నిర్ణయించబడి యున్నవి. వాటినే "అవ్‌ఖాతె నమాజ్" అంటారు. ప్రపంచమంతటా ఈ వేళలనే అనుసరించ వలసి యుంటుంది.

**01. ఫజ్ర్ నమాజ్ వేళ:** ఉషోదయం నుండి సూర్యోదయం ముందు వరకు.

**02. జొహర్ నమాజ్ వేళ:** సూర్యుడు నడినెత్తి నుండి వాలినప్పటి నుండి ప్రతి వస్తువు నీడ దాని అసలు నీడ కాకుండ రెట్టింపు పొడవు (దోమిసల్) అయ్యేంత వరకు.

**03. అస్ర్ నమాజ్ వేళ:** ప్రతి వస్తువు నీడ దాని అసలు నీడ కాకుండ రెట్టింపు పొడవు (దోమిసల్) అయినప్పటి నుండి సూర్యాస్తమయం వరకు.

**04. మగ్రిబ్ నమాజ్ వేళ:** సూరాస్తమయం అయిన తరువాత నుండి పశ్చిమ దిగ్మండలంపై ఎరుపు కాంతి అదృశ్యమయ్యే (అంతమయ్యే) వరకు.

**05. ఇషా నమాజ్ వేళ:** ఆకాశములో పడమర వైపు ఎరుపు కాంతి అదృశ్యమైనప్పటి నుండి ఉషోదయం (సుబహ్‌సాదిఖ్) వరకు.

**06. జుముఅ నమాజ్ వేళ:** జొహర్ నమాజ్ వేళే వర్తిస్తుంది. (బిహిష్తీ జేవర్, 2/10)

## 3.4. నిషిద్ధ వేళలు (మక్రూఅవ్‌ఖాత్)

మూడు వేళలలో నమాజ్ ఆచరించడం నిషేధించ బడియున్నది. ఈ వేళలలో ఏ నమాజ్ కూడ ఆచరించ కూడదు. వీటినే "మక్రూ అవ్‌ఖాత్" అంటారు. అవి: **01.** సూర్యుడు ఉదయిస్తున్నప్పటి నుండి సూర్యుని లోని ఎరుపుదనం అంతమై తెల్లని కాంతి కనిపించే వరకు. సుమారు 20 నిమిషాలు.

**02.** మిట్టమధ్యాహ్నం వేళ సూర్యుడు నడినెత్తిన ఉన్నప్పుడు. సుమారు 5 నిమిషాలు

**03.** సూర్యుడు అస్తమించే వేళ, సూర్యుడు ఎర్రబడి నప్పటి నుండి సూర్యాస్తమయం అయ్యే వరకు.

ఇవికాక, వేరు రెండు సమయాలలో నఫిల్ **నమాజ్ చదవడం మక్రూ** అవుతుంది. కేవలం ఫర్జ్ నమాజ్‌లు మాత్రమే ఆచరించ వచ్చును. అవి:

**01.** సుబహ్ సాదిఖ్ తరువాత అనగా ఉషోదయం నుండి సూర్యుడు ఉదయించే వరకు. అనగా ఉషోదయం (సుబహ్ సాదిఖ్ ) తరువాత సూర్యుడు ఉదయించే వరకు కేవలం ఫజ్ర్ నమాజ్ యొక్క రెండు రకాతుల సున్నత్ మాత్రం పఠింప వచ్చును)

**02.** అస్ర్ నమాజ్ తరువాత సూర్యుడు ఎర్రబడే వరకు. (బిహిష్తీ జేవర్, 2/12)

## 3.5. నమాజ్ యొక్క రకాతులు

| నమాజ్ | సున్నతె ముఅక్కద | సున్నతె గైర్‌ముఅక్కద | ఫరజ్ | సున్నత్ ముఅక్కద | నఫిల్ | అవ్వాబీన్ | వాజిబ్ | నఫిల్ | ముకమ్మల్ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఫజర్ | 2 | - | 2 | - | - | - | - | - | 4 |
| జొహర్ | 4 | - | 4 | 2 | 2 | - | - | - | 12 |
| అసర్ | - | 4 | 4 | - | - | - | - | - | 8 |
| మగ్‌రిబ్ | - | - | 3 | 2 | 2 | 6 | - | - | 13 |
| ఇషా | - | 4 | 4 | 2 | 2 | - | 3 | 2 | 17 |
| జుముఆ | 4 | - | 2 | 4 + 2 | 2 | - | - | - | 14 |

## 3.6. నమాజ్ యొక్క నియమాలు (షరాయితె నమాజ్)

నమాజ్ సరిగా నెరవేరేందుకు, సక్రమంగా నెరవేర్చుటకు నమాజ్ ప్రారంభించుటకు ముందు 7 విషయాలను తప్పని సరిగా పాటించ వలసి యుంటుంది. వీటినే "షరాయితె నమాజ్" (నమాజ్ యొక్క నియమాలు) అంటారు. ఈ నియమాలలో ఏ ఒక్కదానిని పాటించక పోయినా నమాజ్ నెరవేరదు. అవి:

**01. శరీర శుభ్రత:** నజాసతె హఖీఖీ (బయటికి కనబడే అశుద్ధత), నజాసతె హుక్మీ (బయటికి కనబడని అశుద్ధత) అనే రెండు అశుద్ధతలనుండి శరీరాన్ని శుభ్రంగా ఉంచాలి.

**02. దుస్తుల శుభ్రత:** మనం ధరించిన దుస్తులు కూడా ఎటువంటి మాలిన్యం లేకుండా శుభ్రంగా యుండాలి.

**03. సత్ర్ కప్పిపుచ్చుట:** ఏయే అవయవాలను కప్పిపుచ్చడం విధి (ఫర్జ్) కావింప బడినదో వాటిని తప్పని సరిగా వస్త్రంతో కప్పి వుంచాలి. పురుషులకైతే నాభి నుండి మోకాళ్ళ క్రింది వరకు, స్త్రీలకైతే కాళ్ళు, ముంజేతులు, ముఖం తప్ప మిగత శరీర భాగమంత (సత్ర్) కప్పిపుచ్చడం.

**04. స్థలశుభ్రత:** నమాజ్ ఆచరించే ప్రదేశం, దానిమీద పరచుకొనే జాయె నమాజ్, వస్త్రం, చాప మొదలగునవి పరిశుభ్రంగా యుండాలి.

**05. నమాజ్ వేళ:** నమాజ్ కొరకు నిర్ణయింప బడిన వేళలోనే ఆచరించాలి.

**06. ఖిబ్లా:** తప్పనిసరిగా ఖిబ్లా వైపుకు అభిముఖమై నమాజ్ ఆచరించాలి.

**07. నియ్యత్ (సంకల్పం):** ఏ నమాజ్ ఆచరించు చున్నామో, ఆ నమాజ్ కొరకు మనసులో సంకల్పం చెయ్యాలి. ((బిహిష్తీ జేవర్,2/13, దీనియాత్ 1 యం. స. 87)

## 4. నమాజ్‌లో ఫర్జ్‌లు (అర్కానె నమాజ్)

నమాజ్ సరిగా నెరవేరేందుకు, ఎలాంటి లోపం లేకుండా ఉండేందుకు నమాజ్‌లో (ప్రారంభించిన తరువాత) 7 విషయాలను తప్పని సరిగా పాటించ వలసి యుంటుంది. వీటినే అర్కానె నమాజ్ (ఫరాయిజె నమాజ్) అంటారు. వీటినే నమాజ్ యొక్క మూలస్థంభాలు అని కూడ అంటారు. వీటిలో ఏ ఒక్కదానిని పాటించక పోయినా నమాజ్ నెరవేరదు. అవి:

### 4.1. తక్బీరె తహ్రీమా

నమాజ్ ప్రారంభించేటప్పుడు **"అల్లాహు అక్బర్"** అనే వచనాన్ని పలకడాన్ని 'తక్బీరె తహ్రీమా' అంటారు. దీనిని ఉచ్చరించిన తక్షణమే నమాజ్ మొదలౌతుంది. పలికిన వ్యక్తి నమాజ్ స్థితి లోనికి ప్రవేశిస్తాడు. ఆ స్థితిలో తినడం, త్రాగడం, మాట్లాడడం మొదలగు హలాల్ విషయాలు కూడా నిషిద్ధం (హరామ్) అవుతాయి. కావుననే దీనికా పేరు వచ్చినది.

### 4.2. ఖియాం

ఒక పెద్ద ఆయత్‌ను గానీ లేక మూడు చిన్న ఆయత్‌లను గానీ పఠించ గలిగేటంత సేపు నమాజ్ స్థితిలో నిటారుగ నిలబడటాన్ని "ఖియాం" అంటారు.

(ఖియాం కేవలం ఫర్జ్ మరియు వాజిబ్ నమాజ్‌లలో మాత్రమే విధి (ఫర్జ్) అన్న విషయం గమనించాలి)

## 4.3. ఖిరాఅత్

దివ్య ఖుర్‌ఆన్ లోని ఒక పెద్ద ఆయత్‌ను గానీ లేక మూడు చిన్న ఆయత్‌లను గానీ నమాజ్‌లో పారాయణం చేయడాన్ని "ఖిరాఅత్" అంటారు. ఫర్జ్ నమాజుల్లో కేవలం మొదటి రెండు రకాఅత్‌లలో మాత్రమే ఖిరాఅత్ చేయడం ఫర్జ్ (విధి). మిగిలిన నమాజ్‌లలో అనగా విత్ర్, సున్నత్, నఫిల్ నమాజ్‌లలో అన్ని రకాఅత్‌లలో ఖిరాఅత్ చేయడం ఫర్జ్ (విధి) అవుతుంది.

**గమనిక:** "ఖిరాఅత్", "రకఅత్" "జమాఅత్" అనునవి సరియైనవి. 'ఖిరాత్, రకాత్' 'జమాత్' అని మనము అలవాటు పడి యున్నాము. వీనిని సరిచేసుకో వలెనని మనవి చేయుచున్నాను.

## 4.4. రుకూ

రుకూ అంటే వంగుట అని అర్థం. నమాజ్ యొక్క ప్రతి రకాఅత్ లోను రుకూ చేయుట(వంగి చేతులతో మోకాళ్ళను పట్టుకొనుట) ఫర్జ్ (విధి).

## 4.5. సజ్‌దా

సజ్‌దా అనగా సాష్టాంగ ప్రణామం. ప్రతి రకఅత్ లోను రెండు సార్లు సజ్‌దా చేయడం ఫర్జ్ (విధి).

## 4.6. ఖాయిదయె ఆఖీర

నమాజ్ యొక్క చివరి రకఅత్‌లో "తషహ్హుద్" పఠించగలిగేటంత సేపు కూర్చోవడాన్ని "ఖాయిదయె ఆఖీర" అంటారు. (దీనియాత్ 1 యం. స. 87)

# 5. నమాజ్‌లో వాజిబ్‌లు (తప్పనిసరి విషయాలు)

వాజిబాతె నమాజ్ అనగా నమాజ్‌లో తప్పనిసరిగా ఆచరించ వలసిన ముఖ్య విషయాలు. పొరపాటున (మరచిపోయి) వీటిలో ఏ ఒక్క విషయం వదిలివేసినను నమాజ్ నెరవేరదు. కానీ "సహూసజ్దా" చేస్తే సరిపోతుంది. వీటిలో ఏదైనా ఒక విషయాన్ని కావాలని వదిలిపెట్టితే, లేదా పొరపాటున వదిలి పెట్టిన

తరువాత “సహూసజ్దా” చేయకపోతే, నమాజ్ నెరవేరదు. ఆ నమాజ్‌ను తప్పని సరిగా మరల ఆచరించ వలసి యుంటుంది. అవి:

**01.** “ఫర్జ్ నమాజ్” లోని మొదటి రెండు రకఅత్‌లలో ఖిరాఅత్ అనగా ఖుర్‌ఆన్ పారాయణం తప్పనిసరిగా చేయడం.

**02.** “సూరయె ఫాతిహా” పఠించడం. ఫర్జ్ నమాజ్‌లలోని మొదటి రెండు రకఅత్‌ల లోను మిగతా సున్నత్, నఫిల్ మొదలగు నమాజ్‌లలో అన్ని రకఅత్‌లలోను సూరయె ఫాతిహా చదవడం.

**03.** సూరయె ఫాతిహా చదివిన తరువాత ఒక పెద్ద ఆయత్ గానీ లేక 3 చిన్న ఆయత్‌లు గానీ చదవడం.

**04.** సూరయె ఫాతిహా చదివిన తరువాత వేరొక సూరహ్ చదవడం.

**05.** ఖిరాఅత్ తరువాత రుకూ, రుకూ తరువాత సజ్దా వరుస క్రమంలో చేయడం.

**06.** ఖౌమ. అనగా రుకూ స్థితి నుంచి లేచి నిటారుగా నిలబడడం.

**07.** జల్సా. అనగా రెండు సజ్దాల మధ్య (మొదటి సజ్దా చేసిన తరువాత) స్థిమితంగా కూర్చోవడం.

**08.** “తాదీలె అర్కాన్” అనగా నమాజ్‌లో రుకూ, సజ్దా మొదలగునవి అన్నియు స్థిమితంగా (తగిన విధంగా) చేయడం.

**09.** “ఖాయిదాయె ఊలా” లో కూర్చోవడం. అనగా మూడు లేక నాలుగు రకఅత్‌ల నమాజ్‌లలో రెండవ రకఅత్ చివరిలో ‘తషహ్హుద్’ చదవ గలిగినంత సేపు కూర్చోవడం.

**10.** రెండు ఖాయిదాలలోను “అత్తహియ్యాత్” ఒక్కొక్కసారి పఠించడం.

**11.** ఇమామ్ గారు, జహ్రీ నమాజ్‌లలో అనగా ఖుర్‌ఆన్ బిగ్గరగా పఠించే నమాజ్‌లలో (ఫజ్ర్, మగ్రిబ్, ఇషా, జుముఅ, ఈద్ నమాజ్‌లు, తరావీహ్ నమాజ్, రమజాన్ నెల విత్ర్ నమాజ్‌లు) ఖుర్‌ఆన్‌ను బిగ్గరగా పఠించడం.

**గమనిక:** “జుముఅ” అనునది సరియైన ఉచ్చారణ. ‘జుమా, జుమ్మా’ మొదలగునవి మనము అలవాటు పడియున్నాము. దీనిని సరిచేసుకోమని మనవి చేయు చున్నాను.

**12.** సిర్రి నమాజ్‌లలో అనగా ఖుర్‌ఆన్ నిశ్శబ్దంగా పఠించే నమాజ్‌లలో (జొహ్ర్,

అస్ర్ నమాజ్‌లు) నిశ్శబ్దంగా పఠించడం.

**13.** "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి" అను పలుకులతో నమాజ్‌ను ముగించడం.

**14.** విత్ర్ నమాజ్‌లో "ఖునూత్ దుఆ" పఠించుట కొరకు తక్బీర్ 'అల్లాహు అక్బర్' చెప్పడం, మరియు 'ఖునూత్ దుఆ' పఠించడం.

**గమనిక:** "విత్ర్" అనునది సరియైన ఉచ్చారణ. 'వితర్' అని మనము అలవాటు పడియున్నాము. దీనిని సరిచేసుకోమని మనవి చేయు చున్నాను.

**15.** రెండు ఈద్ నమాజ్‌లలోను "6 అదనపు తక్‌బీర్‌లు" పలకడం.

## 6. నమాజ్‌లోని సున్నత్‌లు (51)

నమాజ్‌లో కొన్ని విషయాలు పాటించినట్లు ఆధారాలున్నాయి. కానీ వాటికి ఫర్జ్ (విధి), వాజిబ్ (తప్పనిసరి) లకు ఇచ్చినంత తాకీదు (ప్రోద్బలం/ ఒత్తిడి) చేయలేదు. వాటినే నమాజ్ యొక్క సున్నత్‌లు అందురు.

ఈ సున్నత్‌లలో ఏదో ఒక సున్నత్‌ను ఉద్దేశపూర్వకంగా వదలివేసినా లేక పొరబాటున వదిలివేసినా నమాజ్‌కు భంగం వాటిల్లదు. సజ్దయె సహు చేయవలసిన అవసరము కూడా లేదు. కానీ నమాజ్ యొక్క ఔన్నత్యము (హుస్న్) నకు భంగం వాటిల్లుతుంది. పుణ్యంలో నష్టం కల్గుతుంది. వీటిని తెలిసి కూడా వదలి వేసిన అపరాధమౌతుంది. కాబట్టి వీటినన్నింటినీ సక్రమంగా ఆచరించే అలవాటు చేసుకోవాలి. మన ప్రవక్త హ్రజత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఆచరించిన ఈ సున్నత్‌ల ప్రకారం నమాజ్ ఆచరిస్తే అధిక పుణ్యం లభిస్తుంది.

### 6.1. ఖియామ్ లోని సున్నత్‌లు -11

**01.** తక్బీరె తహ్రీమా పలికేటప్పుడు నిటారుగా తలను వంచకుండా నిలబడుట.

**02.** రెండు పాదముల మధ్య కనీసం నాలుగు అంగుళాల ఖాళీ ఉంచుట, మరియు కాలి వ్రేళ్ళు ఖిబ్లా వైపు ఉంచుట.

**03.** ఇమాంగారు తక్బీరె తహ్రీమా పలికిన వెంటనే ముఖ్తదీ తక్బీరె తహ్రీమా పలుకుట.

**04.** తక్బీరె తహ్రీమా పలుకు నప్పుడు రెండు చేతుల్ని చెవుల వరకు ఎత్తుట.

**05.** అరచేతుల్ని ఖిబ్లా వైపుకు ఉంచుట.

**06.** వ్రేళ్ళను వాటి యధార్థ స్థితి యందు ఉంచుట. అనగా వ్రేళ్ళ మధ్య ఎక్కువ ఖాళీ ఉంచుట గానీ మిక్కిలి దగ్గరగా ఉంచుట గానీ యుండరాదు.

**07.** కుడి చేతి అరచేయి ఎడమ చేతి అరచేయి పైభాగంపై ఉంచుట.

**08.** కుడి చేతి బొటన చిటికిన వ్రేళ్ళతో ఎడమ చేతి మణికట్టు పైభాగాన్ని చుట్టి పట్టుకొనుట.

**09.** మిగిలిన మూడు వ్రేళ్ళను ఎడమ చేతిపై ఉంచుట.

**10.** పైవిధంగా చేతుల్ని బొడ్డుపై కట్టుకొనుట.

**11.** సనా చదువుట. (రసూల్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ కి సున్నతేం, స.16)

## గమనిక

**01.** ఖియామ్ స్థితిలో దృష్టిని (చూపులను) సజ్దా చేయు ప్రదేశంలో నిలపాలి. వంగి నిలబడరాదు.

**02.** తక్బీరె తహ్రీమా పలుకు నప్పుడు రెండు చేతులు చెవుల వరకు ఎత్తుటయే సున్నత్ అయి యున్నది. చెవులను తాకినను పర్వాలేదు, తాకక పోయినను పర్వా లేదు. చెవుల వరకు తప్పక ఎత్తవలెను.

## 6.2. ఖిరాఅత్‌లో పాటించ వలసిన సున్నత్‌లు - 7

**01.** సనా చదివిన తరువాత తఅవ్వుజ్ అనగా **అఊజు బిల్లాహి మినష్షైతా నిర్రజీమ్** చదువుట.

**02.** తరువాత తస్మియ అనగా **బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్** చదువుట.

**03.** మెల్లగా “ఆమీన్” పలుకుట.

**04.** ఫజ్ర్ మరియు జొహర్ నమాజ్‌లలో “తివాలె ముఫస్సల్” అనగా “సూరయె హుజ్‌రాత్” నుండి “సూరయె బురూజ్” వరకు, అస్ర్ మరియు ఇషా నమాజ్‌లలో “ఔసాతె ముఫస్సల్” అనగా “సూరయె బురూజ్” నుండి “సూరయె లమ్‌యకున్” వరకు మరియు మగ్రిబ్ నమాజ్‌లో “ఖిసారె ముఫస్సల్” అనగా “సూరయె లమ్‌యకున్” నుండి “సూరయె నాస్” వరకు ఉన్న సూరాలు పఠించుట.

**05.** ఫజ్ర్ నమాజ్‌లో మొదటి రకఅత్‌ను పొడిగించటం (తవీల్)

**06.** నమాజ్‌లో ఖుర్‌ఆన్ పఠనం మిక్కిలి వేగంగా గానీ లేక మిక్కిలి నిదానంగా గానీ కాకుండ మధ్యస్థంగా పఠించుట.

**07.** ఫరజ్ నమాజ్‌ల లోని మూడు, నాలుగు రకాతులలో సూరయె ఫాతిహా మాత్రమే పఠించుట.

హెచ్చరిక

ఇమామ్ వెనుక నమాజ్ ఆచరించుచున్న ముఖ్తదీలు, ఖిరాఅత్ చేయకుండ ఇమామ్ యొక్క ఖిరాఅత్‌ను శ్రద్ధగా వినాలి.

## 6.3. రుకూ లోని సున్నత్‌లు - 8

**01.** రుకూ యొక్క తక్బీర్ - **"సుబ్‌హాన రబ్బియల్ అజీమ్"** పలుకుట.

**02.** రుకూలో రెండు చేతులతో మోకాలి చిప్పలను పట్టుకొనుట.

**03.** మోకాలి చిప్పలను పట్టుకొను నప్పుడు చేతివ్రేళ్ళను పరచి ఉంచటం.

**04.** కాళ్లను నిటారుగా ఉంచుట.

**05.** వీపు సమంగా ఉంచుట.

**06.** తల మరియు నడుమును సమానంగా ఉంచుట.

**07.** రుకూలో కనీసం మూడు సార్లు **"సుబ్‌హాన రబ్బియల్ అజీమ్"** పలుకుట.

**08.** రుకూ నుండి లేచునపుడు ఇమామ్ **"సమిఅల్లాహు లిమన్ హమిదహ్"** అని, ముఖ్‌తదీ (ఇమాం వెనుక నమాజ్ చేయు అతను) **"రబ్బనా లకల్ హమ్‌ద్"** అని, మున్‌ఫరిద్ (ఒంటరిగా నమాజ్ చేయు అతను) పై రెండు తస్‌బీహ్‌లు పలుకుట. (రసూల్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ కీ సున్నతేఁ, స.18)

హెచ్చరిక

**01.** రుకూలో చూపు పాదాలపై ఉంచాలి.

**02.** రుకూ నుండి లేచి నిటారుగా నిలబడటాన్ని **"ఖౌమహ్"** అంటారు. (దీనియాత్ 1 యం, స.90)

## 6.4. సజ్ద లోని సున్నత్‌లు - 12

**01.** సజ్ద యొక్క తక్‌బీర్ **"సుబ్‌హాన రబ్బియల్ ఆలా"** పలుకుట.

**02.** సజ్ద లోకి వెళ్ళు నప్పుడు ముందు మోకాళ్ళను భూమిపై ఆన్చుట.

**03.** తరువాత రెండు చేతులను ఆన్చుట.

**04.** తరువాత ముక్కు ఆన్చుట.

**05.** తరువాత నుదురు ఆన్చుట.

**06.** రెండు ముంజేతుల మధ్య సజ్ద చేయుట.

**07.** సజ్దలో పొట్ట (కడుపు) ను, తొడల నుండి వేరుగా ఉంచుట.

**08.** చేతులను పక్కటెముకులకు తగలకుండ ఉంచుట.

**09.** మోచేతులను భూమిపై ఆన్చకుండా వేరుగా ఉంచుట.

**10.** సజ్ద లో కనీసం మూడు సార్లు **"సుబ్హాన రబ్బియల్ ఆలా"** పలుకుట.

**11.** సజ్ద నుండి లేచునపుడు తక్బీర్ "అల్లాహు అక్బర్" పలుకుట.

**12.** సజ్ద నుండి లేచునపుడు ముందు నుదురు, తరువాత ముక్కు, తరువాత రెండు చేతులను, తరువాత రెండు మోకాళ్ళను లేపుట. (రసూల్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ కీ సున్నతేం, స.19)

## హెచ్చరిక

**01.** రెండు సజ్దల మధ్య కొంత సేపు కూర్చొనుటను జల్సా అంటారు.

**02.** సజ్ద నుండి లేచునప్పుడు తలను మరియు ఛాతీని వంచరాదు. నిటారుగా ఉంచాలి.

## 6.5. ఖత్దహ్ లోని సున్నత్‌లు -12

**01.** ఖత్దహ్‌లో కూర్చున్నప్పుడు కుడికాలు పాదాన్ని నిటారుగా లేపి ఉంచి, ఎడమకాలు పాదాన్ని నేలపై ఆన్చి, దానిపై కూర్చొనుట మరియు రెండు పాదాల వ్రేళ్ళు ఖిబ్లా వైపుకు ఉంచుట.

**02.** రెండు చేతుల్ని తొడలపై ఉంచుట, చేతి వ్రేళ్ళు ఖిబ్లా వైపుకు ఉంచుట.

**03.** తషహ్హుద్ పఠించే సమయాన **"అష్హదు అల్లా ఇలాహ"** దగ్గర కుడిచేతి చూపుడు వ్రేలిని కొద్దిగా పైకి, ఖిబ్లా వైపుకు లేపుట, మరల **"ఇల్లల్లాహు"** దగ్గర దించి వేయుట.

**04.** అత్తహియ్యాత్ తరువాత దరూదె షరీఫ్ పఠించుట.

**05.** దరూదె షరీఫ్ పఠించిన తరువాత దుఆయె మాసూర పఠించుట.

**06.** రెండు వైపులా సలామ్ చేయుట.

07. సలామ్ మొదట కుడివైపు చేయుట.

08. సలామ్ చేయునప్పుడు ఇమామ్ – తన వెనుక నమాజ్ సలుపు ముఖ్తదీలకు, ఫరిష్తాలకు, సన్మార్గులైన జిన్నాత్‌లకు సలామ్ చెప్పుతున్నానన్న భావన మనసులో కలిగియుండుట. ముఖ్తదీ – ఇమామ్‌కు, ఫరిష్తాలకు మరియు సన్మార్గులైన జిన్నాత్‌లకు, తనకు కుడివైపు, ఎడమవైపు ఉన్న ముఖ్తదీలకు సలామ్ చెప్పుతున్నానన్న భావన మనసులో కలిగి యుండుట.

09. మున్‌ఫరిద్ అనగా ఒంటరిగా నమాజ్ చేయు అతను కేవలం ఫరిష్తాల కోసం తన సలాంను ఉద్దేశించుట.

10. ముఖ్తదీ అనగా ఇమామ్ వెనుక నమాజ్ ఆచరించు వ్యక్తి, ఇమామ్ సలామ్ పల్కిన వెంటనే సలాం పల్కుట.

11. రెండవసారి పలికే సలాం, మొదటి సలాం కన్నా మెల్లగా పలుకుట.

12. మస్‌బూఖ్ అనగా కొన్ని రకఅత్‌లు అయిన తరువాత జమాఅత్‌లో చేరిన వ్యక్తి, ఇమామ్‌గారు నమాజ్ పూర్తి చేసే(సలాం చెప్పే) వరకు వేచి యుండి తరువాత లేచి నిలబడి తన తప్పిపోయిన రకాత్‌లను పూర్తిచేయుట. (రసూల్ స.అ.స.కిసున్నతేం/.20)

### హెచ్చరిక

01. ఖాత్‌దహ్‌లో చూపులు ఒడి యందు ఉంచాలి.

02. సలాం చెప్పు నప్పుడు మన వెనుక నమాజ్ ఆచరించే వారికి మన చెంప కనబడేంతగా మెడను త్రిప్పాలి. (దీనియాత్ 1 యం, స.91)

## 7. నమాజ్ ను భంగ పరిచే విషయాలు - 11

ఈ దిగువ విషయాల వల్ల నమాజ్ భంగమై పోతుంది:

01. నమాజ్ స్థితిలో **మాట్లాడడం.** అనగా నమాజ్ చేస్తున్నప్పుడు తెలిసి గానీ మరచిపోయి గానీ, కొద్దిగా గానీ ఎక్కువగా గానీ మాట్లాడుట.

02. నమాజ్ స్థితిలో లేని వారెవరైన దుఆ చేస్తున్నప్పుడు **"ఆమీన్" పలుకుట.**

03. నమాజ్ స్థితిలో ఏదైనా నొప్పి లేదా బాధ వలన **మూలుగుట లేదా అహ్, ఉహ్, ఉఫ్ మొదలగునవి అనుట.**

04. నమాజ్ స్థితిలో **ఖుర్ఆనె షరీఫ్‌ను చూసి చదువుట.**

**05.** నమాజ్ స్థితిలో **ఖుర్ఆన్ పఠనంలో, సూక్తి అర్థం మారిపోయేంత పొరబాటు చేయుట.**

**06.** చూసిన వాళ్ళు ఇతను **నమాజ్ చేయడం లేదని భావించే పనిని నమాజ్ స్థితిలో చేయుట** వల్ల.

**07.** నమాజ్ స్థితిలో **ఏదైనా తినుట.**

**08.** అకారణంగా **ఖిబ్లా వైపు నుండి ఛాతీ** త్రిప్పుట.

**09. అపరిశుభ్రమైన** ప్రదేశంలో **సజ్దా** చేయుట.

**10. ఇమామ్ కన్నా ముందు నిలబడుట.**

**11.** నమాజ్‌లో ఏదైనా **ఫర్జ్ విడిచి పెట్టుట.** (బిహిష్తీ జేవర్, స. 22, దీనియాత్ 1 యం, 89)

## 8. రెండు విధాలైన సజ్దాలు(సజ్దయెసహూ & సజ్దయెతిలావత్)

నమాజ్ స్థితిలో మామూలుగా ఆచరించే సజ్దాలు కాక, మరో రెండు ప్రత్యేక సందార్భలలో, నమాజ్ స్థితిలో సజ్దాలు ఆచరించుట వాజిబ్ (తప్పనిసరి) చేయడమైనది. అవి: **01.** సజ్దయె సహూ **02.** సజ్దయె తిలావత్.

### 8.1. సజ్దయె సహూ

సహూ అంటే మరచిపోవుట అని అర్థం. నమాజ్ స్థితిలో మరచిపోయి గానీ లేక పొరబాటున గానీ హెచ్చు తగ్గులు (పొరబాటు) సంభవిస్తే, ఆ పొరబాటును సరిదిద్దు కోవటానికి చివరి రకఅత్‌లో తషహ్హుద్ (అత్తహియ్యాత్) పఠించిన తరువాత కుడివైపుకు సలాం చేసి, రెండు సజ్దాలు చేయవలసి యుంటుంది. వీటినే “సజ్దయె సహూ” అంటారు. (దీనియాత్ 1 యం స. 88)

### 8.1.1. సజ్దయె సహూ వాజిబ్ (అనివార్యం) అయ్యే సందర్భాలు

ఈ క్రింద పేర్కొనిన సందర్భాలలో సజ్దయెసహూ వాజిబ్ అవుతుంది.

**01.** నమాజ్‌లో ఏదైనా **వాజిబ్ పొరబాటున తప్పిపోయి నప్పుడు.**

**02.** మరచిపోయి **ఒక రుక్న్ (భాగం) తరువాత రెండవ రుక్న్ చేయుటలో ఆలస్యం జరిగి నప్పుడు.** ఉదా: రుకూ నుంచి లేచి నిలబడిన తరువాత ఒక రుక్న్ (అనగా మూడు సార్లు “సుబ్‌హానల్లాహ్” అనుటకు పట్టే సమయం) కన్నా ఎక్కువ సమయం అలాగే నిలబడి యుండి, ఆలస్యంగా సజ్దాలోకి వెళ్ళుట.

**03.** ఏదైనా **రుక్న్ (భాగం) ఆచరించుటలో మరచిపోయి ముందు వెనుక అయి నప్పుడు.** ఉదా: ముందు ఏదైనా సూరహ్ చదివిన తరువాత సూరయె ఫాతిహా చదువుట మొదలగునవి. (దీనియాత్ 1 యం స. 88)

## హెచ్చరిక

**01.** నమాజ్‌లో జరిగిన ఈ తప్పులు కేవలం మరచిపోయి లేక పొరబాటున జరిగి నప్పుడు మాత్రమే "సజ్‌దయె సహూ" చేయడం వల్ల ఆ పొరబాట్లు సరిదిద్దుకో వచ్చును. కావాలని పొరబాట్లు చేసి, సహూ సజ్దా చేసిన కుదరదు. మరల నమాజ్‌ను ఆచరించ వలసి యుంటుంది.

**02.** ఒకవేళ ఒకే నమాజ్‌లో ఇట్టి తప్పులు పొరబాటున అనేకం సంభవించినా ఒక్కసారే "సజ్దయె సహూ" వాజిబ్ అవుతుంది. కావున ఒక్కసారి "సజ్దయె సహూ" చేస్తే సరిపోతుంది.

**03.** సజ్దయెసహూ యొక్క ఆదేశాలు అన్ని నమాజ్‌లలో అనగా ఫర్జ్ గానీ సున్నత్ గానీ నఫిల్‌గానీ విత్ర్‌గానీ ఒకేవిధంగా యున్నాయి. (దీనియాత్1 యంస.89)

## 8.1.2. సజ్దయె సహూ యొక్క ఆచరణా విధానం

చివరి రకఅత్‌లో ఖత్‌దలో కూర్చొని తషహ్హుద్ (అత్తహియ్యాత్) పఠించి, కుడివైపుకు ఒక సలాం చేసిన తరువాత, రెండు సజ్దాలు చేయవలసి యుంటుంది. తరువాత మరల తషహ్హుద్ (అత్తహియ్యాత్), దరూదె ఇబ్రాహీం, మరియు "దుఆయె మాసూరా" పఠించి యథావిధిగా కుడివైపు తరువాత ఎడమ వైపు "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్" అని సలాం చేసి నమాజ్‌ను పూర్తి చేయాలి.

ఎవరైనా ఒకవైపు గూడ సలాం చేయకుండానే "సజ్దయె సహూ" చేసినను, సజ్దయె సహూ పూర్తి అవుతుంది. ఒకవేళ మరచిపోయి, రెండు వైపుల సలాం చేసిన వెంటనే "సజ్దయె సహూ" గుర్తు వచ్చినచో, ఎవరితోను మాట్లాడక యుండి, తన వక్షాన్ని (ఛాతీని) ఖిబ్లా వైపు నుండి మరల్చ కుండా యుండి, ఒక రుక్న్ (అనగా మూడు సార్లు "సుబ్‌హానల్లాహ్" అనుటకు పట్టే సమయం) కన్నా ఎక్కువ ఆలస్యం కాకుండ యుండినచో, "సజ్దయె సహూ" చేసి నమాజ్‌ను పూర్తి చేసినచో, నమాజ్ సక్రమంగా పూర్తి అయినట్లు భావింప బడుతుంది. (బిహిష్తీ జేవర్, స. 36, దీనియాత్ 1 యం స. 89)

## 8.2. సజ్ద యె తిలావత్

పవిత్ర ఖుర్ఆన్‌లో 14 సూక్తులు ఉన్నాయి. వాటిని చదువుచున్నవారు, వింటున్నవారు సజ్ద చేయడం వాజిబ్ (తప్పనిసరి) అవుతుంది. దీనినే "సజ్దయె తిలావత్" అని అంటారు. (దీనియాత్ 1 యం స. 104)

### 8.2.1. సజ్‌ద యె తిలావత్ చేయు పద్ధతి

ఒకవేళ నమాజ్ ఆచరిస్తున్నప్పుడు "సజ్దయె తిలావత్" యొక్క ఆయత్ (సూక్తి) పఠించినచో, వెంటనే "సజ్దయె తిలావత్" చేయవలసి యుంటుంది. ఆ సూక్తి పఠించిన వెంటనే "అల్లాహు అక్బర్" అని పలుకుచూ సజ్దాలోకెళ్ళి, సజ్దా (సాష్టాంగ నమస్కారం) చేయాలి. సజ్ద లోని తస్బీహ్ "సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా" 3/5/7 పర్యాయాలు పఠించిన తరువాత "అల్లాహు అక్బర్" అని తస్బీహ్ పలుకుచూ, లేచి నిలబడి నమాజ్‌ను పూర్తి చేయాలి. (బిహిష్తీ జేవర్, స. 36)

ఒకవేళ నమాజ్‌లో కాకుండా, వేరే సమయాలలో అనగా ఖుర్ఆన్ పారాయణం చేయునపుడు, లేదా ఇతరులు ఖుర్ఆన్ పారాయణం చేస్తునప్పుడు విన్ననూ వెంటనే లేచి నిలబడి, "అల్లాహు అక్బర్" అని పలుకుచూ సజ్దాలోకెళ్ళి, సజ్దా (సాష్టాంగ నమస్కారం) చేయాలి. సజ్దలోని తస్బీహ్ "సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా" 3/5/7 పర్యాయాలు పఠించిన తరువాత "అల్లాహు అక్బర్" అని తస్బీహ్ పలుకుచూ, లేచి నిలబడాలి. ఒకవేళ నిలబడకుండ, కూర్చొని సజ్దా చేసిననూ సరిపోతుంది.

### మస్అల(సిద్ధాంతం)

ఒకవేళ నమాజ్ ఆచరిస్తున్నప్పుడు "సజ్దయె తిలావత్" సూక్తి పఠించినచో, వెంటనే రుకూ చేసి, రుకూలోనే సజ్దయె తిలావత్ నియ్యత్ (సంకల్పం) చేసుకొని, సజ్ద చేసినచో, సజ్దయె తిలావత్ పూర్తవుతుంది. సజ్దయె తిలావత్ సూక్తులు పఠించిన పిమ్మట రెండు మూడు సూక్తులు పఠించిన తరువాత రుకూ చేసి సజ్దా చేసినచో, సజ్దయె తిలావత్ నెరవేరదు. వేరుగా సజ్దయె తిలావత్ చేయ వలసి యుంటుంది. (బిహిష్తీ జేవర్, స. 36, దీనియాత్ 1 యం, 105)

### 8.2.2. సజ్‌ద యె తిలావత్ యొక్క షరతులు (నియమాలు)

సజ్‌దయె తిలావత్ కొరకు షరతులు (నియమాలు) ఇవి:

**01.** శరీరము, దుస్తులు, మరియు ప్రదేశము శుభ్రంగా యుండాలి.

**02.** సత్ర్ కప్పబడి యుండాలి.

**03.** ఖిబ్లాకు అభిముఖంగా యుండాలి.

**04.** సజ్దయె తిలావత్ యొక్క సంకల్పం చేసుకోవాలి. (దీనియాత్ 1 యం స. 105)

**హెచ్చరిక :** ఏయే కారణాలవల్ల నమాజ్ భంగమై పోతుందో, ఆ కారణాల మూలంగా సజ్దయె తిలావత్ కూడా భంగమై పోతుంది. (దీనియాత్ 1యం స. 105)

## మసాయిల్ (సిద్ధాంతాలు)

**01.** సజ్దయె తిలావత్ చేయ వలసిన, ఒకే సూక్తి, ఒకే స్థలంలో, మరల మరల పఠించినను లేక వినినను, సజ్దయె తిలావత్ ఒక్కసారే వాజిబ్ అవుతుంది. కానీ స్థలం మారినచో, (అనగా మొదటిసారి వరండాలో, తరువాత ఇంటి లోపల, తరువాత ఇంకొక చోట) ఎన్ని స్థలాలలో పఠించిన లేక వినిన, అన్ని సార్లు సజ్దయె తిలావత్ వాజిబ్ అవుతుంది. అన్నిసార్లు చేయవలసి యుంటుంది.

**02.** సజ్దయె తిలావత్ చేయ వలసిన వేర్వేరు సూక్తులు పఠించుట లేక వినుట సంభవించినచో, ఎన్ని సూక్తులు పఠించి/విని యుంటే అన్ని సార్లు సజ్దయె తిలావత్ చేయవలసి యుంటుంది, ఒకే ప్రదేశంలో విని యుండినా కూడా.

(బిహిష్తీ జేవర్, స. 36, దీనియాత్ 1 యం)

# 9. అజాన్ మరియు ఇఖామత్

## 9.1. అజాన్

అజాన్ అనగా పిలుచుట, ఆహ్వానించుట అని అర్థం. షరీఅత్ పరిభాషలో సామూహిక (జమాఅత్) నమాజ్ కొరకు ప్రజలను సమీకరించడానికి, ఒక వ్యక్తి (ముఅజ్జిన్) గంభీరమైన స్వరంతో కొన్ని ప్రత్యేక పలుకుల ద్వారా అల్లాహు తఆలా యొక్క ఔన్నత్యాన్ని చాటుచూ, అల్లాహు తఆలాను ప్రశంసిస్తూ, నమాజ్ కొరకు ఆహ్వానించడాన్ని "అజాన్" అంటారు. ఐదు వేళల ఫర్జ్ నమాజ్‌ల కొరకు మరియు నమాజె జుముఅ (శుక్రవారం యొక్క నమాజ్) కొరకు అజాన్ పలుకబడును. (దీనియాత్ 1 బిజి)

## 9.1.1. అజాన్ యొక్క పలుకులు

**అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్,** (అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు)

**అష్హదు అల్లాఇలాహ ఇల్లల్లాహ్, అష్హదు అల్లాఇలాహ ఇల్లల్లాహ్,** (అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేదని నేను సాక్ష్యమిచ్చుచున్నాను)

**అష్హదు అన్న ముహమ్మద రసూలుల్లాహ్, అష్హదు అన్న ముహమ్మద రసూలుల్లాహ్,** (హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం దైవ సందేశహరులని నేను సాక్ష్యమిచ్చుచున్నాను)

**హయ్య అలస్సలాహ్, హయ్య అలస్సలాహ్,** (నమాజ్ కొరకు రండి) (ముఖం కుడి వైపుకు తిప్పి పలకాలి)

**హయ్య అలల్‌ఫలాహ్, హయ్య అలల్ ఫలాహ్,** (సాఫల్యం పొందడానికి రండి) (ముఖం ఎడమ వైపుకు తిప్పి పలకాలి)

**అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్.** (అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు)

**లా ఇలాహ ఇల్లల్లాహ్.** (అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేదు) (ముస్లిం, దీనియాత్ 1 బిజి/45)

### తంబీహ్ (హెచ్చరిక)

**01.** ఫజ్ర్ నమాజ్ యొక్క అజాన్‌లో **హయ్య అలల్ ఫలాహ్** రెండుసార్లు పలికిన తరువాత **"అస్సలాతు ఖైరుమ్మినన్నౌమ్"** (నిద్ర కంటే నమాజ్ శ్రేష్ఠమైనది) అని అధికంగా పలకాలి.

**02.** అజాన్ విన్న తరువాత వెంటనే నమాజ్ కొరకు వెళ్ళడం వాజిబ్ (తప్పనిసరి). జుముఅ నమాజ్ (శుక్రవారపు నమాజ్) యొక్క మొదటి అజాన్ విన్న తరువాత పనులన్నీ విడిచిపెట్టి నమాజ్ కొరకు జామిత్ మసీదుకు వెళ్ళడం వాజిబ్ (తప్పనిసరి). (బిహిష్తీ సమర్, హిస్స అవ్వల్, స.48)

## 9.1.2. అజాన్ కు బదులు పలుకుట

అజాన్ విన్న ప్రతి ఒక్కరు, పురుషుడు గానీ, స్త్రీ గానీ, పరిశుద్ధంగా ఉన్నా లేక పోయినా, అజాన్ పలుకులకు జవాబిచ్చుట ముస్తహబ్. అనగా చేయుట పుణ్య ప్రదం. కొందరు వాజిబ్ (తప్పనిసరి) అని కూడా తెలిపి ఉన్నారు.

అజాన్ కొరకు బదులు చెప్పువారు, అవే పలుకులను బదులుగా పలకాలి. కానీ **అష్హదు అన్న ముహమ్మదరసూల్లుల్లాహ్** అనేపలుకులు విన్నప్పుడు

**"సల్లల్లాహు అలైహి వ సల్లమ్"** అని బదులు పలకాలి. **హయ్య అలస్సలాహ్, హయ్య అలల్‌ఫలాహ్** కు బదులు పలుకు నపుడు **లా హౌల వ లాఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్ అజీమ్** (పాప కార్యాల నుండి రక్షణ పొందు) శక్తి (పుణ్యకార్యాలు ఆచరించే) సామర్థ్యం అల్లాహ్ యొక్క అనుగ్రహంతోనే సంభవం, ఆయన మహోన్నతుడు, మహోజ్వలుడు) అని పలకాలి. ఫజ్ర్ నమాజ్ కొరకు ఇచ్చే అజాన్‌లో **అస్సలాతు ఖైరు మ్మిన న్నౌమ్** కు బదులుగా **సదఖ్‌త వ బరర్‌త** (సత్యం పలికావు, మంచి మాటలు పలికావు) అని పలకాలి. (బిహిష్తీ సమర్,1/48)

### 9.1.3. అజాన్ తరువాత దుఆ

అజాన్ తరువాత దరూదె షరీఫ్ పఠించి ఈ దుఆ చేయాలి:

**అల్లాహుమ్మ రబ్బ హాజిహి ద్దావతి త్తామ్మతి వ స్సలాతిల్ ఖాఇమతి ఆతి ముహమ్మదనిల్ వసీలత వల్ ఫజీలత వబ్‌అస్‌హు మఖామమ్ మహ్మూద నిల్లజీ వ అత్తహూ ఇన్నక లా తుఖ్లిఫుల్ మీఆద్.** (దీనియాత్ 1 యం స. 44)

**అర్థం:** ఓ అల్లాహ్! ఈ పరిపూర్ణ పిలుపుకు అధిపతీ! ఇపుడు ప్రారంభంకాబోయే నమాజ్‌కు ప్రభూ! నీవు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారికి వశీలత (విశిష్టహోద), ఫజీలత్ (ప్రత్యేక శ్రేష్ఠత) ప్రసాదించు. నీవు వాగ్దానం చేసిన "మఖామె మహ్మూద్" (అల్లాహ్ ఆదరాభిమానాలకు సంబంధించిన అత్యంత ఉన్నత స్థానం) పై అధిష్టింప చెయ్యి. నీవు వాగ్దానానికి భిన్నంగా చేయవు.

### 9.2. ఇఖామత్

ఇఖామత్ అంటే నిలబెట్టుట అని అర్థం. షరీఅత్ పరిభాషలో సామూహిక నమాజ్ (జమాఅత్ కీ నమాజ్) ప్రారంభించే ముందు అజాన్ పలుకుల్ని తొందర తొందరగా పలుకుచు జమాఅత్ నిలబడిందని, నమాజ్ ప్రారంభం కాబోతున్నదని ప్రకటించడాన్ని ఇఖామత్ అంటారు. అజాన్‌లో పలికే పలుకులే ఇఖామత్ పలుకులు కూడా. కానీ **హయ్య అలస్సలాహ్, హయ్య అలల్ ఫలాహ్** తరువాత **ఖద్‌ఖామతి స్సలాహ్, ఖద్‌ఖామతి స్సలాహ్** (నమాజ్ కొరకు జమాఅత్ నిలబడింది) అను పలుకులు అధికంగా ఉచ్చరించడం జరుగుతుంది.

### 9.2.1. ఇఖామత్‌కు బదులు పలుకుట

అజాన్ కొరకు ఎలా జవాబు ఇస్తారో, అలాగే ఇఖామత్‌కు కూడా

జవాబు ఇవ్వాలి. కానీ **ఖద్‌ఖామతి స్సలాహ్** పలికి నప్పుడు **"అఖామహల్లాహు వ అదామహా"** (అల్లాహ్ యే దీనిని స్థాపించుగాక, చిరస్థాయిగా యుంచుగాక) అని జవాబు పలకాలి. (దీనియాత్1 బి జి 45)

## 10. సామూహిక (జమాఅత్) నమాజ్

కొంతమంది ముస్లిమ్‌లు కలిసి సామూహికంగా నమాజ్‌ను ఆచరిస్తారు. ఆ సమూహంలో ఒకరు నాయకత్వం (ఇమామత్) వహిస్తారు. మిగిలిన వారు ఆయన వెనుక నిలబడి, ఆయనను అనుసరిస్తూ నమాజ్ ను ఆచరిస్తారు. దీనినే "సామూహిక నమాజ్" (జమాఅత్ కీ నమాజ్) అంటారు. జమాఅత్ తో నమాజ్ ఆచరించడం "సున్నతె ముఅక్కద", అనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ మరియు వారి అనుచరులు క్రమం తప్పకుండా చేసిన ఆచరణ. (దీనియాత్ 5 బిజి, స.98)

సామూహిక నమాజ్ చేయవలెనని ఖుర్ఆన్ మరియు హదీసులలో పలు చోట్ల నొక్కి చెప్పడం జరిగింది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి హదీసుల ద్వారా "నమాజ్ యొక్క సంపూర్ణ అనుగ్రహాలు, శ్రేయోశుభాలు పొందాలంటే జమాఅత్ తో నమాజ్ ఆచరించ వలసిన నియమం (షరతు) కూడ ఉంది" అని తెలియు చున్నది.

### 10.1. సామూహిక నమాజ్ వలన ప్రయోజనాలు & అనుగ్రహాలు

**జమాఅత్ తో ఆచరించిన నమాజ్ ఒంటరిగా (వ్యక్తిగతంగా) ఆచరించిన నమాజ్ కంటే 27 రెట్లు శ్రేష్టమైనది.** (బుఖారీ, ముస్లిమ్)

సరియైన కారణం లేకుండా జమాఅత్ తో కాకుండా, ఒంటరిగా చేసే నమాజ్ అల్లాహ్‌కు మరియు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి అయిష్టమైనది. **"ఏ వ్యక్తి అయితే అజాన్ విన్న తరువాత తగిన కారణం లేకుండా జమాఅత్ తో నమాజ్ ఆచరించడానికి మసీదుకు వెళ్లడో, అతడు వ్యకిగతంగా నమాజ్ ఆచరించినప్పటికీ, అది అంగీకరించ బడదని"** రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు సెలవిచ్చిరి:

జమాఅత్‌తో నమాజ్ ఆచరించక పోవడానికి తగిన కారణం అంటే

"ప్రాణాపాయం కలుగుతుందనే భయం ఉన్నప్పుడు, మరియు వ్యాధికి గురైనప్పుడు" అని అర్థం. (అబూదావూద్, దీనియాత్ 5 బిజి, స.98)

జమాఅత్ తో నమాజ్ ఆచరించే వ్యక్తిలో "సమయపాలన" అనే మంచి అలవాటు అలవడుతుంది. నిష్టతో నమాజ్ సలపడం జరుగు తుంది. జమాఅత్ తో నమాజ్ సలుపుటచే క్రమశిక్షణ, కట్టుబాటు వంటి సద్గుణాలు అలవడుతాయి. జమాఅత్‌తో నమాజ్ సలుపని వ్యక్తుల నమాజ్ తరచుగా ఖజా అగును. అనగా నిర్దేశించిన సమయానికి నమాజ్ ఆచరించడం జరుగదు. (ఇస్లామ్ క్యాహై?, స.23)

## 10.2. ముఖ్తదీ

జమాఅత్‌కు నాయకత్వం వహించి నమాజ్ చదివించేవారిని **ఇమామ్** అంటారు. ఇమామ్‌ను అనుసరించి నమాజ్ చేసే వారిని **ముఖ్తదీ** అంటారు. ముఖ్తదీలలో 4 రకాలు. 01. ముద్రిక్, 02. మస్‌బూఖ్, 03. లాహిఖ్, 04. మస్‌బూఖ్ లాహిఖ్

**01. ముద్రిక్:** నమాజ్ ప్రారంభం అయినప్పటి నుండి చివరి వరకు ఇమామ్ సారధ్యంలోనే (అనుసరించి) నమాజ్ సలిపిన వారిని ముద్రిక్ అంటారు.

**02. మస్‌బూఖ్:** ఒకటి రెండు రకాతుల నమాజ్ అయిపోయిన తరువాత, జమాఅత్ లో చేరి చివరి వరకు ఇమాం సారధ్యంలోనే యుండి నమాజ్‌ను పూర్తి చేసిన వ్యక్తిని మస్‌బూఖ్ అంటారు.

**03. లాహిఖ్:** నమాజ్ ప్రారంభమైనప్పటి నుండి జమాఅత్‌లో యుండి మధ్యలో అనివార్య కారణాల వల్ల జమాఅత్‌ను విడిచిన వ్యక్తిని లాహిఖ్ అంటారు.

**04. మస్‌బూఖ్ లాహిఖ్:** ఒకటి రెండు రకాతుల నమాజ్ అయిపోయిన తరువాత, జమాఅత్ లో చేరి, మధ్యలో అనివార్య కారణాల వల్ల ఒకటి రెండు రకాతులు జమాఅత్‌ను విడిచిన వ్యక్తిని మస్‌బూఖ్ లాహిఖ్ అంటారు.

### సిధ్ధాంతము

మస్‌బూఖ్ లాహిఖ్, ఇమామ్ నమాజ్‌ను ముగించు సమయాన ఇమామ్ సారధ్యంలో తప్పని సరిగా యుండాలి. (ముకమ్మల్ నమాజ్, స.104)

## 10.3. లాహిఖ్‌కు సంబంధించిన సిధ్ధాంతాలు

ముఖ్తదీ, ఇమామ్ సారధ్యంలో నమాజ్‌ను ప్రారంభించిన తరువాత

అనివారణ కారణాల వల్ల ఉదా:– వుజూ భంగమై పోయింది, వుజూ చేయుటకు వెళ్ళెను. వుజూ చేసుకొని వచ్చేసరికి ఇమామ్‌గారు ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ రకాతులు పూర్తిచేసి యుండెను. ఈ లోపు ముఖ్తదీ కావాలని నమాజ్‌ను భంగ పరిచే కార్యాలు ఆచరించకుండ యున్నచో, అతని ఇఖ్‌తిదా (ఇమామ్‌ను అనుసరించడం) ఇంకనూ చేయవలసి యున్నది. కాబట్టి ఇతను వుజూ చేసి వచ్చిన తరువాత, జమాఅత్‌తో కాకుండా వేరుగా నిలబడి, ముందుగా తన తప్పిపోయిన రకాతులను పూర్తి చెయ్యాలి. తరువాత జమాఅత్ నమాజ్ చేస్తూఉంటే, జమాఅత్‌లో కలిసిపోయి ఇతర ముఖ్తదీల వలె ఇతను కూడ ఇమామ్‌ను అనుసరించి నమాజ్‌ను పూర్తి చేయాలి.

ఒకవేళ ఇమామ్ నమాజ్‌ను ముగించి యుంటే, అప్పుడు కూడ తన నమాజ్‌ను, ఇమామ్ వెనుక ఎలా పూర్తి చేస్తాడో, ఆ విధంగానే పూర్తి చేయాలి. ఒక వేళ ఇమామ్ సహూ సజ్దా చేయవలసిన పరిస్థితి ఏర్పడి యుంటే, లాహిఖ్ కూడ సహూ సజ్ద చేయాలి.

అన్ని విషయాలలో కూడా, ముఖ్తదీ ఎలా ఇమామ్‌ను అనుసరిస్తాడో, అలాగే లాహిఖ్ గూడ ఇమామ్‌ను అనుసరించాలి. ముఖ్తదీపై ఇమామ్‌ను అనుసరించుట (ఇత్తిబా) వాజిబ్ ఆవుతుంది. అలాగే లాహిఖ్ కూడా ఇమామ్‌ను అనుసరించుట (ఇత్తిబా) వాజిబ్ అవుతుంది.

తన తప్పిపోయిన నమాజ్‌లు కూడా ముఖ్తదీ లాగానే పూర్తి చేయాలి. అనగా ముఖ్తదీ ఖిరాత్ చేయడు, కావున లాహిఖ్ కూడా ఖిరాత్ చేయకుండా నిశ్శబ్దంగా యుండాలి. ముఖ్తదీ వల్ల ఏదైన పొరబాటు జరిగి సహూ సజ్ద చేయవలిసి యున్నను, ఇమామ్ వెనుక నమాజ్ ఆచరించే సమయంలో ఎలాగైతే సహూ సజ్ద చేయడో, అలాగే లాహిఖ్ గూడ సహూ సజ్ద చేయడు. ఇదే విధంగా మిగిలినవి గ్రహించ వలయును. (ఇల్‌ముల్ ఫిఖహ్, స. 255).

ఒకవేళ లాహిఖ్, తప్పిపోయిన తన నమాజ్‌ను పూర్తి చేయకుండానే, ఇమామ్‌ను అనుసరించి, ఇమామ్ నమాజ్ ముగించిన తరువాత తప్పిపోయిన నమాజ్‌ను పూర్తి చేసినను, నమాజ్ పూర్తవుతుంది, కానీ సాంప్రదాయ పద్ధతిని ఉల్లంఘించిన వాడగుటచే, సజ్దయె సహూ తప్పనిసరి అవుతుంది. (ముకమ్మల్ నమాజ/104)

## 10.4. మస్‌బూఖ్‌కు సంబంధించిన సిద్ధాంతాలు

కొన్ని రకాతులు నమాజ్ అయిపోయిన తరువాత, జమాఅత్ లో చేరి చివరి వరకు ఇమాం సారధ్యంలోనే యుండి నమాజ్‌ను పూర్తి చేసిన వ్యక్తిని మస్‌బూఖ్ అంటారు.

ఇమామ్ చివరి ఖత్‌దాలో కూర్చున్నప్పుడు, మస్‌బూఖ్ కూడా ఇమామ్‌తో పాటు ఖత్‌దాలో కూర్చొని కేవలం అత్తహియ్యాత్ మాత్రమే పఠించాలి. దరూదె షరీఫ్, మరియు దుఆయె మాసూర పఠించరాదు. ఇమామ్ ఒకవేళ సజ్దయె సహూ చేస్తే మస్‌బూఖ్ కూడా అతనితోబాటు సజ్దయె సహూ చేయాలి. ఇమామ్ రెండవ వైపు సలాం పలికిన తరువాత మస్‌బూఖ్ సలాం పలుక కుండా, లేచి నిలబడి తన తప్పిపోయిన రకాతులను పూర్తి చేసి నమాజ్‌ను ముగించాలి. ఒంటరి వ్యక్తి ఎలాగైతే నమాజ్ చేస్తాడో, అలాగే మస్‌బూఖ్ గూడ తన నమాజ్‌ను పూర్తి చేయాలి. అనగా, "సనా, తఅవ్వుజ్, తస్మియ, సురయె ఫాతిహా, మరియు అదనపు సూర (దమ్‌సూర) కూడ పఠించ వలసి యుంటుంది.

మస్‌బూఖ్, రెండు రకాతుల కన్నా ఎక్కువ అయిన తరువాత జమాఅత్‌లో కలిసి యుంటే, ఇమామ్ గారు సలాంచేసి నమాజ్‌ను పూర్తి చేసిన తరువాత, తప్పిపోయిన రకాతులను ఆచరించు నప్పుడు మొదటి రెండు రకాతులలో సూరయె ఫాతిహా పఠించిన తరువాత ఇంకొక సూర పఠించ వలసి యుంటుంది.
మిగిలిన రకాతులలో కేవలం సూరయె ఫాతిహా మాత్రమే పఠించాలి.

మస్‌బూఖ్, నాలుగు రకాతుల నమాజ్‌లో, మూడు రకాతుల తరువాత జమాఅత్‌లో కలిసి యుంటే, అనగా చివరి రకాతు మాత్రమే జమాఅత్‌తో ఆచరించి యుంటే, ఇమామ్ గారు సలాంచేసి నమాజ్‌ను పూర్తి చేసిన తరువాత, తప్పిపోయిన మూడు రకాతులను ఆచరించు నప్పుడు మొదటి రకాతు తరువాత ఖత్‌ద లో కూర్చొని, అత్తహియ్యాతు చదివి, మరల నిలబడి మిగిలిన రెండు రకాతులను పూర్తి చేయాలి.

మస్‌బూఖ్ తప్పిపోయిన రకాతులను ఆచరించే సమయంలో ఏదైన సహూచేయ వలసిన పొరబాటు జరిగితే, సహూ సజ్దా చేయవలసి యుంటుంది.

ఒకవేళ మస్‌బూఖ్ మరచిపోయి, ఇమామ్‌తో బాటు సలామ్ ఆచరించిన తరువాత తను ఆచరించ వలసిన రకాతులు గుర్తుకు వచ్చిన, వెంటనే లేచి

నిలబడి వాటిని పూర్తిచేసి, చివరలో సజ్దయె సహూ ఆచరించి నమాజ్‌ను పూర్తి చేయాలి. (దీనియాత్ 5 బిజి 88)

ఇమామ్ ఖత్‌దయె ఊలా లో ఉన్నప్పుదు (అనగా రెండవ రకాత్ చివరలో అత్తహియ్యాత్ చదువుతున్నప్పుడు) మస్‌బూఖ్ జమాఅత్ లో కలిసి ఖాత్‌దలో కూర్చునిన వెంటనే ఇమామ్ మూడవ రకాత్ కొరకు లేచి నిలబడినచో, మస్‌బూఖ్ అత్తహియ్యాత్ పూర్తి చేసిన తరువాతనే లేచి నిలబడాలి. అత్తహియ్యాతు పూర్తిగా చదవకుండా మూడవ రకాత్ కొరకు నిలబడ కూడదు. అట్లు నిలబడినచో నమాజ్ మక్రూహె తహ్రీమీ అగును. ఇది ఫర్జ్ నమాజ్, తరావీహ్ అన్నింటికీ వర్తిస్తుంది. (షామి, భా.1, స. 496)

ఇమామ్ ఖత్‌దయె ఆఖీర్ లో ఉన్నప్పుదు (అనగా చివరి రకాత్ చివరలో అత్తహియ్యాత్ చదువుతున్నప్పుడు) మస్‌బూఖ్ జమాఅత్ లో కలిసి ఖాత్‌దలో కూర్చునిన వెంటనే ఇమామ్ సలాం పలికి నమాజ్ పూర్తి చేసినచో, మస్‌బూఖ్ అత్తహియ్యాత్ పూర్తి చేసిన తరువాతనే లేచి నిలబడాలి. అత్తహియ్యాతు పూర్తిగా చదవకుండా నిలబడకూడదు. అట్లు నిలబడినచో నమాజ్ మక్రూహె తహ్రీమీ అగును. ఇది ఫర్జ్ నమాజ్, తరావీహ్ అన్నింటికీ వర్తిస్తుంది. (షామి, భా1, స. 496)

## 11. ఇమామ్ లేక ఒంటరి వ్యక్తి నమాజ్ ఆచరించే పద్ధతి

చక్కగా వుజూ చేసుకొని నమాజ్ కొరకు ఖిబ్లాకు అభిముఖముగా నిలబడినపుడు "మన అంత రంగమును, బాహ్య రంగమును, గోప్యముగా ఉంచిన వాటిని, బహిర్గతము చేసినవాటిని ఎరుంగువాడు, ఆరాధింప తగినవాడు అయిన అల్లాహు తఆలా ఎదుట, పాపాత్ముడైన నేను నిలబడి యున్నాము. ప్రళయ దినమందు కూడా అతని ఎదుట హాజరు కావలసి యున్నది" అనే ఆలోచనను మనసు నందు కలిగి యుండాలి.

చూపు సజ్దా చేయు స్థలముపై కేంద్రీకరించాలి. నిగిడి నిల్చోవడం గాని, మరీ ముందుకు వంగి గానీ నిలబడ కూడదు. సహజ స్థితిలోనే నిలబడాలి. రెండు కాళ్ళ మధ్య కనీసము 4 అంగుళముల స్థలము ఉండాలి.

తరువాత తనను తాను అల్లాహు తఆలాకు సమర్పించు కొనుచు

ఏకాగ్రతను పొందడానికి **"ఇన్నీవజ్జహ్తు"** పఠించాలి.

**ఇన్నీ వజ్జహ్తు వజ్హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్ అర్జ హనీఫం వ్వ మా అన మినల్ ముష్రికీన్.** (నేను ఏకోన్ముఖుడనై, నా ముఖాన్ని భూమాకాశాలను సృష్టించినవాని (అల్లాహ్) వైపునకు మరల్చు చున్నాను. నేను ఆయనను మాత్రమే ఆరాధిస్తాను. నేను ముష్రికలలో లేను అనగా ఎవ్వరినీ అల్లాహ్కు సహవర్తులుగా చేసిన వారిలో లేను)

తరువాత ఏ సమయపు నమాజ్ చదువ దలచుకున్నామో, ఆ సమయపు **సంకల్పం (నియ్యత్)** చేసుకోవాలి. నోటితో ఉచ్చరించాలనే నియమమేమియు లేదు. (జొహర్ సమయమైతే) "నేను జొహర్ యొక్క ఫరజ్ నమాజ్ ఆచరించు చున్నాను" అని మనసులో సంకల్పము చేసుకొనిన సరిపోతుంది.

ఆ సంకల్పాన్ని మాటల ద్వారా నోటితో కూడ ఉచ్చరించ వచ్చును. ఒకవేళ నోటితోనే ఉచ్చరించ దలచుకుంటే, "నేను జొహర్ యొక్క ఫరజ్ నమాజ్ చేయుటకు సంకల్పించినాను" అని పలికిన సరిపోతుంది. జొహర్ యొక్క ఫరజ్ నమాజ్ 4 రకాతులు, కాబతుల్లాహ్కు అభిముఖముగా మొదలగునవి చెప్పవలసిన అవసరము లేదు. చెప్పదలచుకున్న చెప్పవచ్చును, లేనిచో వదిలివేయ వచ్చును. (బిహిష్తీజేవర్, స.88)

ఒకవేళ ఇవి అన్నియు చెప్పదలచుకున్న యెడల "నేను జొహర్ యొక్క ఫరజ్ నమాజ్, 4రకాతులు, అల్లాహ్ను ప్రసన్నము చేయుట కొరకు, ఖిబ్లాకు అభిముఖమై, (ఈ ఇమామ్ సారధ్యంలో) (జమాత్తో సామూహికముగా నమాజ్ ఆచరించేట్లు అయితే) ఆచరించు చున్నాను" అని సంకల్పము చేసుకోవాలి.

తరువాత తక్బీరె తహ్రీమా – **"అల్లాహు అక్బర్"** (అల్లాహ్ చాలా ఉన్నతుడు/ గొప్పవాడు) అని పలుకుచు రెండు చేతులను చెవుల వరకు లేపాలి. అప్పుడు అరచేతులు ఖిబ్లా వైపుకు యుంచాలి, వ్రేళ్ళు మిక్కిలి తెరచుకొని గానీ మిక్కిలి బిగించుకొని గానీ కాక వాటి సహజ స్థితిలోనే యుంచాలి.

ఇట్లు పైకి లేపిన చేతులను క్రిందికి దించి, బొడ్డు క్రింది భాగంలో ఎడమ చేతి మణికట్టుపై కుడి చేయి పెట్టి బొటన వ్రేలు మరియు చిటికిన వ్రేలితో ఎడమ చేతి మణికట్టును చుట్టి పట్టుకోవాలి. మిగిలిన మూడు వ్రేళ్ళు ఎడమ మోచేతి వైపుకు అభిముఖమై యుంచాలి.

తరువాత **"సనా"** చదవాలి.

**"సుబ్‌హాన కల్లాహుమ్మ వ బిహందిక వ తబారకస్‌ముక వతఆలా జద్దుక వ లాఇలాహ గైరుక్".** (ఓ అల్లాహ్! నీవు అత్యంత పరిశుద్ధుడవు, సకల ప్రశంసలకు, స్తోత్రములకు నీవే అర్హుడవు, నీ నామం శుభప్రదమైనది, నీ జాతి ఉన్నతమైనది, నీవు తప్ప వేరు ఆరాధ్యుడే లేడు)

తరువాత **"అఊజు బిల్లాహి మినష్షైత్వా నిర్రజీమ్** (నేను అపవిత్రుడైన షైతాను బారి నుండి (రక్షణకొరకు) అల్లాహ్ శరణు వేడుచున్నాను)**, బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్**"(అత్యంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభించు చున్నాను) చదవాలి. అటు తరువాత **సూరయె ఫాతిహా** (అల్‌హమ్ సూరా) చదవాలి. తరువాత బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ చదివి, ఏదైనా ఇంకొక సూరా గానీ సూరాలో కొంత భాగాన్ని మూడు ఆయత్‌లకు తగ్గకుండా చదవాలి.

**సామూహిక నమాజ్‌లో ఇమామ్ వెనుక నమాజ్ ఆచరించు సమయాన ముఖ్తదీ "సనా" తరువాత ఇమామ్ చేస్తున్న ఖిరాత్‌ని మౌనంగా వినాలి. తాను ఏమియు చదువరాదు.**

పిమ్మట అల్లాహు తఆలా యొక్క ఔన్నత్యాన్ని, గొప్పతన్నాన్ని మనస్సులో తలచుకుంటు, "అల్లాహు అక్బర్" అని పలుకుతూ "రుకూ" లోకి వెళ్ళాలి.

రుకూలో రెండు చేతుల వ్రేళ్ళను బాగుగా తెరచి మోకాలి చిప్పలను గట్టిగా పట్టుకోవాలి. వీపు, తల, నడుములను సమానంగా ఉంచాలి. కాళ్ళను, చేతులను ఏమాత్రం వంచకుండ నిటారుగా ఉంచాలి. చూపులను రెండు కాళ్ళ మధ్య నేలమీద ఉంచాలి.

తరువాత రుకూ యొక్క తస్‌బీహ్ – **సుబ్‌హాన రబ్బియల్ అజీమ్** (నేను మహిమాన్వితుడైన అల్లాహ్ యొక్క పవిత్రతను కొనియాడు చున్నాను) చదవాలి. దీని అర్థాన్ని గుర్తుచేసుకుంటూ మూడు సార్లు పలకాలి. ఇంతకన్న ఎక్కువ పఠించ దలచుకుంటే, ఐదు, ఏడు, తొమ్మిది లేక ఇంతకన్నా ఎక్కువ సార్లు బేసి సంఖ్యలో పఠించవచ్చును.

రుకూలో అల్లాహు తఆలా యొక్క పవిత్రతను, మరియు ఔన్నత్యాన్ని కొనియాడు నపుడు మనసునందు కూడ అల్లాహు తఆలా యొక్క పవిత్రతను, మరియు ఔన్నత్యాన్ని స్మరించుకుంటూ ఉండాలి.

తరువాత **"సమి అల్లాహు లిమన్ హమిదహ్"** (తన దాసుని స్తుతిని అల్లాహుతఆలా ఆలకించాడు) అని పలుకుతూ నెమ్మదిగా లేచి నిటారుగా నిలబడాలి. అట్లు నిలబడిన తరువాత **"రబ్బనా లకల్ హమ్ద్"** (ఓ అల్లాహ్: సమస్త స్తోత్రములు నీకే చెల్లును) అని పలకాలి.

తరువాత అల్లాహ్ గొప్పతన్నాన్ని మనస్సులో తలచుకుంటు, **"అల్లాహు అక్బర్"** అని పలుకుచూ సర్వోన్నతుడైన అల్లాహు తఆలా ఎదుట అత్యంత విధేయతతో సజ్దా (సాష్టాంగ ప్రణామము) చేయాలి.

సజ్దా లోనికి వెళ్ళు నపుడు ముందు మోకాళ్ళను, తరువాత ముక్కును, తరువాత నుదురును నేలపై వుంచాలి. సజ్దాలో పొట్ట, తొడలు, చేతులను విడివిడిగా ఉంచాలి. మోచేతులు పక్కటెముకలకు ఆనకుండ ఎడంగా ఉంచాలి. పొట్ట తొడలకు ఆనకుండ విడిగా ఉంచాలి. చేతి వ్రేళ్ళను కలిపి ఉంచాలి, విడి విడిగా యుంచరాదు. మోచేతులను భూమిపై ఆన్చకుండా పైకి లేపి ఉంచాలి. కాలిముని వ్రేళ్ళను ఖిబ్లా వైపుకు త్రిప్పి భూమిపై ఆన్చి పాదాలను పైకెత్తి ఉంచాలి.

సజ్దాలో అల్లాహు తఆలాను మనసునందు స్మరించుకుంటూ, అల్లాహు తఆలా మన ఎదుట యున్నాడని, మనలను చూస్తున్నాడని భావిస్తూ, సజ్దా యొక్క తస్బీహ్ **"సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా"** (నేను శ్రేష్ఠమైన అల్లాహ్ యొక్క పవిత్రతను కొనియాడు చున్నాను) అని పలుకుచు, దాని భావాన్ని మనస్సులో గుర్తు చేసుకుంటూ యుండాలి. ఇలా కనీసం మూడు సార్లు పలకాలి.

మరల **"అల్లాహు అక్బర్"** అని పలుకుచు లేచి స్థిమితంగా కూర్చోవాలి. కుడికాలి పాదాన్ని ఉన్నది ఉన్నట్లుగా నేలమీద పైకి లేపి ఉంచి, ఎడమకాలి పాదాన్ని చాపి, దాని మీద పిరుదులను మోపి నిటారుగా కూర్చోవాలి. రెండు చేతులను మోకాలుకు సమీపంలో తొడలపై ఉంచాలి. ఇలా కుర్చోవడాన్ని జల్సా అంటారు. ఇట్లు కూర్చొని **"రబ్బిగ్ ఫిర్‌లీ"** (ఓ అల్లాహ్! నన్ను క్షమించు) మూడు సార్లు పఠించాలి.

మరల **"అల్లాహు అక్బర్"** అని పలుకుచు రెండవసారి సజ్దా చేయాలి. సజ్దాలో తస్బీహ్ **"సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా"** అని పలుకుచు, దాని భావాన్ని మనస్సులో గుర్తు చేసుకుంటూ యుండాలి. ఇలా కనీసం మూడు సార్లు పలకాలి.

సజ్దాలో ఈ తస్‌బీహ్ పలుకు నపుడు మన అల్పత్వాన్ని, దీనత్వాన్ని,

అల్లాహు తఆలా యొక్క పవిత్రతను, ఔన్నత్యాన్ని, మనస్సునందు స్మరించు కుంటూ యుండాలి. ఇదియే నమాజ్ యొక్క ఆత్మ. కాబట్టి ఈ భావన మన మనస్సులో ఎంత అధికంగా, ఎంత గాఢంగా నాటుకుంటుందో, మన నమాజ్ అంత విలువైనదిగా పరిగణించ బడుతుంది. (ఇస్లామ్ క్యా హై? స.29)

ఇంత వరకు ఒక రకాతు నమాజ్ పుర్తయినది. మరల **"అల్లాహు అక్బర్"** అని పలుకుచు, రెండవ రకాతు కొరకు లేచి నిటారుగా నిలబడాలి. అటు తరువాత **సూరయె ఫాతిహా** (అల్‌హమ్ సూరా) చదవాలి. తరువాత బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ చదివి, ఏదైనా ఇంకొక సూరా గానీ, సూరాలో కొంత భాగాన్ని మూడు ఆయత్‌లకు తగ్గకుండా చదవాలి.

తరువాత మొదటి రకాత్‌లో వలెనే ఇక్కడ కూడా రుకూ, రెండు సజ్దాలు చేసి, పైన తెలిపిన విధంగానే ఇక్కడ కూడా కూర్చోవాలి. కూర్చున్న తరువాత **అత్తహియ్యాత్** చదవాలి.

**అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వరహ్మతుల్లాహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహి స్సాలిహీన, అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహూ వ రసూలుహ్.** (బుఖారీ) (సమస్త స్తుతులు (వాక్కులు), శారీరక ఆరాధనలు, ధనపరమైన ఆరాధనలు సమస్తం కేవలం అల్లాహు తఆలాకే తగును. ఓ ప్రవక్తా సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ! మీకు అల్లాహ్ నుండి శాంతి, కారుణ్యం, శుభం కలుగుగాక. మాపైన, మరియు సజ్జనులైన సకల అల్లాహ్ దాసుల పైన కూడ శాంతి కలుగుగాక. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్యమిచ్చు చున్నాను, మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ఆయన దాసులని, మరియు ప్రవక్త అని నేను సాక్ష్యమిచ్చు చున్నాను)

అత్తహియ్యాతు పఠించు నపుడు, "లా ఇలాహ...." అంటూ కుడిచేతి బొటన వ్రేలిని, చివరి మూడు వ్రేళ్ళను మడిచి, చూపుడు వ్రేలిని పైకి లేపి ఖిబ్లా వైపుకు సంజ్ఞ చేయాలి. తరువాత "ఇల్లల్లాహు..." అంటూ చూపుడు వ్రేలిని దించివేయాలి. ఖాయిదాలో కూర్చున్నంత సేపు వ్రేళ్ళను అలాగే ఉంచాలి.

తరువాత **దరూదె ఇబ్రాహీమ్** చదవాలి.

**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిఁవ్వ అలా ఆలి ముహమ్మదిన్**

**కమాసల్లైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహ్మదింవ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదు మ్మజీద్.**

(ఓ అల్లాహ్! ఇబ్రాహీమ్ అలైహి స్సలామ్ పై, ఆయన ఆప్తులపై, మరియు ఆయన సంబంధీకులపై ఎలా కారుణ్యం కురిపించావో, అలాగే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ పై, ఆయన ఆప్తులపై మరియు ఆయన సంబంధీకులపై కూడా కారుణ్యం కురిపించు. నిస్సందేహంగా నీవే స్తుతించ తగినవాడవు, మరియు మహోన్నతుడవు. ఓ అల్లాహ్! ఇబ్రాహీమ్ అలైహి స్సలామ్‌పై, ఆయన ఆప్తులపై, మరియు ఆయన సంబంధీకులపై ఎలా శ్రేయోశుభాలు కురిపించావో, అలాగే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లంపై, ఆయన ఆప్తులపై మరియు ఆయన సంబంధీకులపై కూడా శ్రేయోశుభాలు కురిపించు. నిస్సందేహంగా నీవే స్తుతించ తగినవాడవు, మరియు మహోన్నతుడవు.)

ఈ **దరూదె షరీఫ్** ప్రత్యేకంగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్, వారి కుటుంబీకులు, మరియు వారితో మత సంబంధ బాంధవ్యాలు కలిగిన సహాబాల (అనుచరుల) కొరకు, అల్లాహు తఆలా యొక్క కరుణా కటాక్షాలు, శ్రేయో శుభాల కొరకు చేసే దుఆ (ప్రార్థన).

మనకు ఇస్లామ్ అనే సౌభాగ్యం, నమాజ్ అనే అపారమైన సంపద హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్, గారి ద్వారానే లభించాయి. ఈ ఉపకారానికి బదులుగా కృతజ్ఞతలు తెలుపుకోవసిన బాధ్యత అల్లాహు తఆలా మనపై ఉంచాడు. నమాజ్ ఆచరించిన ప్రతిసారీ, చివరిలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్, గారి కొరకు, వారి కుటుంబీకుల కొరకు, వారితో మత సంబంధముగల సహాబాల కొరకు కరుణా కటాక్షాలు, శ్రేయో శుభాల కొరకు దుఆ (ప్రార్థన) చేయడం ఆవశ్యకమై యున్నది.

కాబట్టి ప్రతి నమాజ్ చివరిలో "అత్తహియ్యాత్" పఠించిన తరువాత హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ మనకు చేసిన ఉపకారాలను జ్ఞప్తికి తెచ్చుకొని, వారికి కృతజ్ఞతలు తెలుపుటకుగాను, మనస్ఫూర్తిగా వారి కొరకు ఈ దరూదె షరీఫ్ పఠించి, వారికి అల్లాహ్ యొక్క కరుణా కటాక్షాలు, శాంతి శ్రేయోశుభాలు లభించేందుకు దుఆ (ప్రార్థన) చేయాలి. (ఇస్లామ్ క్యా హై?)

తరువాత **"దుఆ యె మాసూర"** చదవాలి.

**అల్లాహుమ్మ ఇన్నీ జలమ్‌తు నఫ్‌సీ జుల్‌మన్ కసీరంవ్వ లాయగ్‌ఫిరు జ్జునూబ ఇల్లా అన్‌త, ఫగ్‌ఫిర్‌లీ మగ్‌ఫిరత మ్మిన్ ఇన్‌దిక వర్‌హమ్‌నీ ఇన్నక అన్‌తల్ గఫూరు ర్రహీమ్** (ముస్లిమ్, బుఖారీ) (ఓ అల్లాహ్! నేను నాఆత్మపై అత్యధిక దౌర్జన్యం/ అన్యాయం చేసినాను. నీవు తప్ప మరెవ్వరూ నా పాపాలను క్షమించలేరు. కనుక నీవు నీప్రత్యేకమైన క్షమాగుణంతో నన్ను క్షమించు మరియు నాపై కరుణించుము. నిస్సందేహంగా నీవే క్షమించే వాడవు, కరుణించు వాడవు)

దుఆయె మాసూర అనునది మనం తెలిసి తెలియక చేసిన పాపాలను, పొరపాట్లను, తప్పులను మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ, పశ్చాత్తాపంతో కరుణా మయుడైన అల్లాహు తఆలాను పాప ప్రక్షాళన కొరకు, పాపాల నుండి విముక్తి కొరకు క్షమాపణ కోరుతూ చేసే ప్రార్థన.

వాస్తవానికి ప్రతి దాసుడు నమాజ్ లాంటి శ్రేష్ఠమైన ఆరాధనను ఆచరించియు, తన పొరపాట్లను, తప్పులును అంగీకరించి, తనను తాను పాపాత్ముడని అంగీకరించాలి. అల్లాహు తఆలా యొక్క కరుణా కటాక్షాలు, ఆయన క్షమాగుణమే తనకు ఆధారమని భావించాలి. తన ఆరాధన వలన ఎటువంటి గర్వము కలుగ కూడదు. ఎందువలనంటే, ఆరాధనలు ఎలా ఆచరించాలో, అట్లు మనం ఆచరించలేము గనుక. (ఇస్లామ్ క్యా హై ?స. 32)

దుఆ యె మాసూర చదివిన తరువాత నమాజ్‌ను ముగించుట కొరకు ముందు కుడివైపుకు తలను త్రిప్పుచూ **"అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్"**, అని పఠించాలి. మరల ఎడమ వైపుకు తలను త్రిప్పుచూ **"అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్"** (మీకు అల్లాహు తఆలా నుండి శుభము, కరుణ లభించుగాక) అని పలుకుచు **సలామ్** చేయాలి. ఈ పలుకులు పలుకు నప్పుడు "శాంతి, కారుణ్యాల నా ఈ 'దుఆ' నమాజ్‌లో పాల్గొన్న తోటి ముస్లిం ల కొరకు, అల్లాహ్ దూతల కొరకు చేస్తున్నాను" అనే భావన మనసులో మెదలాలి.

దీని తరువాత దుఆ చేసుకోవాలి. మన అవసరాలను తీర్చమని అల్లాహు తఆలాను వేడుకోవాలి.

ఇంత వరకు రెండు రకాత్‌ల నమాజ్ ఆచరించు పద్ధతి పూర్తయినది.

**ఒకవేళ 3 రకాత్‌ల నమాజ్ చదవ వలసియుంటే** రెండవ రకఅత్

చివరలో కూర్చొని అత్తహియ్యాత్ చదివిన వెంటనే లేచి నిలబడాలి. మూడవ రకఅత్ పైవిధముగా చదివి, రెండు సజ్దాలు చేసిన తరువాత కూర్చొని అత్తహియ్యాత్, దరూదె ఇబ్రాహీం, దుఆయె మాసూర పఠించి రెండు వైపుల సలాం చేయాలి.

**ఒకవేళ 4 రకాత్‌ల నమాజ్ చదవ వలసియుంటే** రెండవ రకఅత్ చివరలో కూర్చొని అత్తహియ్యాత్ చదివిన వెంటనే లేచి నిలబడాలి. మూడవ, నాల్గవ రకఅత్‌లు పైవిధముగా చదివి, రెండు సజ్దాలు చేసిన తరువాత కూర్చొని అత్తహియ్యాత్, దరూదె ఇబ్రాహీం, దుఆయె మాసూర పఠించి రెండు వైపుల సలాం చేయాలి.

నమాజ్ సర్వ శ్రేష్ఠమైన ఆరాధన. ప్రతి విషయాన్ని అర్థం చేసుకొని, ఆరాధన యందే మనసును నిమగ్నం చేసి, నిలకడగా, ఏకాగ్రతతో ఆచరించినచో, మానవుణ్ణి "ఆచరణలలోను, సౌశీల్యములోను" అల్లాహు తఆలా యొక్క దూతల (ఫరిష్తాల) తో సమానంగా చేస్తుంది. (ఇస్లామ్ క్యా హై ?, స.33)

### గమనిక

**01.** ఫర్జ్ నమాజ్ లలో మూడు మరియు నాల్గవ రకాతులలో సురయె ఫాతిహా తరువాత రెండవ సూరహ్ పఠించరాదు. ఫర్జ్ కాకుండ ఇతర నమాజ్‌లలో ప్రతి రకాతులోను సూరయె ఫాతిహా తరువాత రెండవ సూర కూడ పఠించాలి.

**02.** ఎట్లయితే రమజాన్ రోజాలు, ఖుర్బానీ మొదలగునవి, వాటి నిర్ణీత సమయానికి ముందు ఆచరించడం, ఖుర్‌ఆన్ మరియు హదీసుల ఆధారముగా ధర్మసమ్మతము కాదో, అట్లే ఫర్జ్ నమాజ్‌లు వాని నిర్ణీత సమయమునకు ముందుగా చేయడం ధర్మసమ్మతము కాదు. అవి అంగీకరింప బడవు.

## 12. నమాజ్ కు సంబంధించి కొన్ని ముఖ్య విషయాలు

నమాజ్, ఇస్లామ్ యొక్క మూల స్థంభం. దీనిని సక్రమంగా, సాంప్రదాయ బద్ధంగా ఆచరించుట ప్రతి ముస్లిమ్ బాధ్యత అయి వున్నది. మనం అశ్రద్ధతో, మన ఇష్టానుసారం ఆచరిస్తున్నాము. మనం కొంత శ్రద్ధ వహించి, సక్రమమైన పద్ధతిని నేర్చుకొని, దానిని అలవరచుకొని, ఆచరించిన, మనం నమాజ్‌ను ఆచరించుటకు వెచ్చించు సమయంలోనే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి

వ సల్లం గారి సాంప్రదాయం (సున్నత్) ప్రకారం ఆచరించ గలము. దీని మూలంగా పుణ్యము, శ్రేయోశుభాలు అనేక రెట్లు అధికంగా లభిస్తాయి.

కాబట్టి మనం ఆచరించే నమాజ్‌ను సాంప్రదాయ నియమానుసారం తీర్చిదిద్దటానికి షేఖుల్ ఇస్లామ్ (ఇస్లామ్ మతగురువు) హజ్రత్ మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహబ్ (పాకిస్తానీ) గారి పుస్తకం నుండి సేకరించిన కొన్ని ముఖ్యమైన విషయాలను తెలియజేయు చున్నాను. శ్రద్ధగా చదివి, అర్థం చేసుకొని, ఆచరించినచో, ఇన్షా అల్లాహ్ సాఫల్యం పొందగలము.

## 12.1. నమాజ్ ప్రారంభించుటకు పూర్వం

ఈ క్రింది విషయాలను గుర్తుంచుకొని, ఆచరించుట యందు శ్రద్ధ వహించ వలెను.

**01.** **ఖిబ్లాకు అభిముఖంగా** తప్పనిసరిగా నిలబడాలి.

**02.** **నిటారుగా నిలబడాలి.** దృష్టి (చూపులు) సజ్దా చేసే ప్రదేశంపై కేంద్రీకరించాలి. మెడను వంచి గడ్డం వక్ష స్థలానికి ఆనించి నిలబడుట మక్రూ అవుతుంది. సరియైన కారణం లేకుండా, అనవసరంగా వక్ష స్థలాన్ని వంచి నిలబడుట తగదు.

**03.** **రెండు పాదాలు, వాటి వ్రేళ్ళు ఖిబ్లాకు అభిముఖంగా యుండాలి**. వాటి మధ్య కనీసం నాలుగు (4) అంగుళముల ఖాళీ ఉండాలి. పాదాలు కుడి ఎడమ వైపుకు వంకరగా యుంచుట సాంప్రదాయానికి విరుద్ధం.

**04.** జమాత్‌తో (సాముహికంగా) నమాజ్ ఆచరించే సమయంలో **పంక్తి నేరుగా ఉండాలి.** పంక్తిని నేరుగా యుంచుట కొరకు ప్రతి ఒక్కరు తమ తమ మడమల చివరలను పంక్తి పై సరిగ్గా ఉంచాలి.

**05.** జమాత్‌తో నమాజ్ కొరకు నిలబడు సమయాన నిలబడిన వాని భుజంతో మీ భుజం కలిసి యుండేట్లు సరిచేసుకో వలెను. **మధ్యలో ఖాళీ లేకుండ యుండ వలెను.**

**06.** **క్రింది వస్త్రం అంచు గిలక (మడమ) పైకి యుండేట్లు జాగ్రత్త వహించాలి.** క్రింది వస్త్రం (పైజామ, ప్యాంటు, లుంగీ మొదలగునవి) చివర కాలి గిలక (మడమ) కు క్రిందికి వ్రేలాడుచుండుట ఎట్టి పరిస్థితిలోను తగదు. నమాజ్‌లో

దాని చెడు మరీ అధికమగును. కాబట్టి జాగ్రత్త వహించ వలెను.

07. **చేతులు పూర్తిగా కప్పబడి యుండాలి.** కేవలం అరచేతులు మాత్రమే తెరచి యుంచ వలెను. కొంత మంది చొక్కా చేతులు పైకి మడచిపెట్టి నమాజ్ ఆచరింతురు. ఇది తగిన పద్ధతి కాదు.

08. ఎటువంటి దుస్తులు ధరించి ఇతరుల చెంతకు వెళ్ళుటకు ఇష్టపడరో, అటువంటి దుస్తులు ధరించి నమాజ్ ఆచరించుట మక్రూ అగును.

## 12.2. నమాజ్ ప్రారంభించే సమయాన

01. నేను ఫలాని నమాజ్ ఆచరించు చున్నాను అని మనసులో **నియ్యత్ (సంకల్పం) చేసుకోవాలి.** నోటితో పలకడం తప్పనిసరి కాదు..

02. అల్లాహు అక్బర్ అని పలుకుచు రెండు చేతులు పైకి ఎత్తునప్పుడు **అరచేతులు ఖిబ్లా వైపుకు ఉండాలి, బొటన వ్రేళ్ళ చివరలు చెవుల క్రింది భాగానికి తగలాలి,** లేదా దానితో సమానంగానైనా యుంచాలి. మిగిలిన వ్రేళ్ళు నేరుగా పైకి యుండాలి. కొంత మంది తమ అరచేతులను ఖిబ్లా వైపుకు కాకుండ, చెవుల వైపుకు త్రిప్పి ఉంచెదరు, కొందరు చెవులను మూసుకొనెదరు. కొందరు చేతులు పైకి ఎత్తకనే కేవలం సైగ చేసి దించేస్తారు. కొంత మంది చెవుల చివరలను పట్టుకుంటారు. ఈ పద్ధతులన్నియు సరియైనవి కావు, ఇవి యన్నియు సాంప్రదాయానికి విరుద్ధమైనవి. వీటిని విడిచిపెట్ట వలెను.

03. పైన పేర్కొన్న పద్ధతి ప్రకారం చేతులు పైకెత్తుచూ "అల్లాహు అక్బర్" అని పలకాలి. తరువాత చేతులు క్రిందికి దించి, **కుడిచేతి బొటన వ్రేలు మరియు చిటికిన వ్రేలితో ఎడమచేతి మణికట్టును చుట్టి పట్టుకోవాలి. మిగిలిన మూడు వ్రేళ్ళు ఎడమ చేతిపై చాచి మోచేతి వైపుకు అభిముఖమై యుండేట్లు యుంచాలి.**

04. పైన పేర్కొన్న పద్ధతి ప్రకారం **రెండు చేతులను నాభికి కొద్దిగా క్రింద కట్టుకోవాలి.**

## 12.3. నిలబడిన సమయమున

01. ఒంటరిగా నమాజ్ ఆచరించు చున్నను, లేక జమాత్‌కు సారథ్యం వహించు చున్నను (ఇమామ్ అయితే) ముందుగా **"సనా"** అనగా **సుబ్‌హాన కల్లాహుమ్మ**

**......**తరువాత **సూరయె ఫాతిహా,** తరువాత **వేరే ఏదైన సూరహ్** చదవాలి. ఒకవేళ ఇమామ్ వెనుక జమాత్‌లో నిలబడి యుంటే, కేవలం **సనా** అనగా **సుబ్‌హాన కల్లాహుమ్మ .... పూర్తిగా చదివి నిశ్శబ్దముగా ఇమామ్‌గారు చదువు ఖిరాత్‌ను శ్రద్ధగా వినాలి.** ఒకవేళ **ఇమామ్‌గారు బిగ్గరగా కాకుండ మెల్లగా పఠించు చుండినచో, పెదవులు కదల్చకుండ మనసులోనే సూరయె ఫాతిహాను స్మరించు కుంటూ యుండాలి.**

**02.** ఖిరాత్‌లో **సూరయె ఫాతిహా చదివే సమయమందు ప్రతి ఆయత్ (సూక్తి) చివర ఆగి మరల రెండవ ఆయత్ చదవడం శ్రేష్ఠము.** అనేక ఆయత్‌లు ఒక్క శ్వాసలో చదవరాదు. ఉదాహరణకు "అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్" పలికి శ్వాసను వదిలి వేయాలి. మరల శ్వాసను పీల్చుకొని, "అర్రహ్మా నిర్రహీమ్" వద్ద ఆగాలి. మరల "మాలికియౌమిద్దీన్" వద్ద ఆగాలి. ఈవిధముగా సూరయెఫాతిహా చదవాలి. కాని దీనితరువాతి ఖిరాత్ (సూరహ్)లో ఒకటి కంటే ఎక్కువ ఆయత్‌లను ఏకబిగిన పఠించినను పరవాలేదు.

**03. అనవసరంగా శరీర అవయవాలను కదల్చరాదు.** ఎంత ప్రశాంతంగా, నిశ్చలంగా నిలబడి నమాజ్‌ను ఆచరించిన అంత మంచిది. ఒకవేళ దురద మొదలగునవి కలిగినప్పుడు, మరీ అవసరమనుకుంటే, ఒక చేతిని మాత్రమే ఉపయోగించాలి.

**04.** నిలబడినపుడు **శరీరపు బరువును రెండు పాదాలపై సమంగా యుంచాలి.** బరువును ఒక కాలిపై మోపినను, రెండవ కాలు వదులుగా (వంకరగా) యుంచరాదు. శరీరపు బరువునంత ఒక కాలిపై మోపి రెండవ కాలిని వదులుగా (వంకరగా) ఉంచుట తగదు. ఇది నమాజ్ సాంప్రదాయానికి విరుద్ధము. కావున దీనిని విడిచి పెట్ట వలెను.

**05.** ఆవలింత వచ్చినచో, దానిని ఆపుటకు ప్రయత్నించాలి.

**06.** నిలబడి యున్నప్పుడు **దృష్టి (చూపు) సజ్దా చేసే ప్రదేశంపై కేంద్రీకరించాలి.** ఇటూ అటూ లేదా ముందుకు చూడరాదు.

## 12.4. రుకూ లో

రుకూలో ఈక్రింది విషయాలను గుర్తుంచుకొన వలెను.

**01.** రుకూలో **తల, వీపు, నడుము సమానంగా ఉంచాలి.** దీనికన్నా ఎక్కువగా వంగుట గానీ, తక్కువగా వంగుట గానీ చేయరాదు.

**02.** రుకూలో **మెడను వక్షస్థలాన్ని తాకేట్లు క్రిందికి వంచరాదు**. మరియు మెడను నడుము కన్నా పైకి యుండేట్లు పైకి ఎత్తరాదు. నడుము, మెడ సమానంగా యుంచాలి.

**03.** రుకూలో **కాళ్ళను నిటారుగా ఉంచాలి**. వంకర రాకూడదు.

**04.** **చేతుల వ్రేళ్ళను బాగుగా తెరచియుంచి** కుడి చేతితో కుడి మోకాలిని, ఎడమ చేతితో ఎడమ మోకాలిని **పట్టుకో వలెను.** అనగా వ్రేళ్ళమధ్య ఖాళీ యుండ వలెను.

**05.** రుకూలో **చేతులు, మనికట్లు నేరుగా ఉంచాలి.** వంకరగా ఉంచరాదు. **పక్కటెముకలకు తగలకుండ విడిగా ఉంచాలి.**

**06**. కనీసం **మూడు సార్లు "సుబ్‌హాన రబ్బియల్ అజీమ్" ఓపికగా చదివే సమయం వరకైనా రుకూలో యుండాలి.**

**07**. రుకూలో **దృష్టి పాదములపై యుంచాలి.**

**08.** **శరీరపు బరువును రెండు కాళ్ళపై సమంగా యుంచాలి.** కాళ్ళ గిలకలు (మడమలు) ఒకదానికి ఒకటి ఎదురు బదురుగా యుండాలి.

## 12.5. రుకూ నుండి లేచి నిలబడు నపుడు (ఖౌమ)

**01.** రుకూ నుండి లేచి **నిటారుగా నిలబడాలి.** ఎటువంటి వంకర యుండరాదు.

**02.** కొంత మంది రుకూ నుండి పూర్తిగా లేచి నిలబడకుండానే, లేచినట్లు సైగ చేసి, శరీరం వంగి యున్న స్థితిలోనే సజ్దా లోనికి వెళ్ళెదరు. ఇటువంటివారు నమాజ్‌ను మరల ఆచరించుట వాజిబ్ (తప్పనిసరి) అవుతుంది. కాబట్టి ఇట్లు చేయుట విడిచి పెట్ట వలెను. **నిటారుగా నిలబడినామని దృఢపరచు కొనిన తరువాత సజ్దా లోకి వెళ్ళాలి.**

**03.** రూకూ నుండి లేచి నిలబడినప్పుడు **దృష్టి సజ్దా చేసే ప్రదేశంలో యుంచాలి.**

## 12.6. సజ్దా లోనికి వెళ్ళు నప్పుడు

సజ్దా లోనికి వెళ్ళు నప్పుడు ఈ పద్ధతిని గుర్తుంచుకో వలెను:

**01.** వక్షాన్ని (ఛాతీని) ముందుకు వంచకుండా, రెండు మోకాళ్ళను వంచి నేలపై

ఆనించాలి. **మోకాళ్ళు నేలపై ఆనిన తరువాత వక్షాన్ని (ఛాతీని) ముందుకు వంచాలి.**

**02. మోకాళ్ళు భూమిపై ఆనేవరకు శరీర పైభాగాన్ని కూడ వీలైనంత వరకు వంచరాదు.** ప్రస్థుతం ఈమర్యాదను మిక్కిలి నిర్లక్ష్యం చేయుచున్నారు. చాలామంది మోకాళ్ళను నేలకు ఆనించక పూర్వమే వక్షాన్ని(ఛాతీని) ముందుకు వంచి సజ్దాలోకి వెళ్ళుచున్నారు. ఇది తగదు. ఈ అలవాటును విడిచి పెట్టాలి.

**03. మోకాళ్ళు భూమి మీద ఆనించిన తరువాత క్రమంగా చేతులు, తరువాత ముక్కు, తరువాత నుదురు నేలపై ఉంచాలి.**

## 12.7. స జ్దా లో

**01.** సజ్దాలో **రెండు చేతుల మధ్య తల ఉంచినపుడు, రెండు బొటన వ్రేళ్ళ చివరలు చెవుల మొదళ్ళకు సమానంగా యుండాలి.**

**02.** సజ్దాలో **రెండు చేతుల వ్రేళ్ళు బాగుగా కలిపి ఉంచాలి.** వాటి మధ్య ఖాళీ యుండరాదు.

**03. చేతుల వ్రేళ్ళు ఖిబ్లాకు అభిముఖంగా యుండాలి.**

**04. మోచేతులు భూమిపై ఆనించకుండా, పైకి లేపి ఉంచ వలెను.** భూమిపై ఆనించి యుంచుట తగదు.

**05. మోచేతులు పక్కటెముకలకు ఆనకుండా ఎడంగా ఉంచాలి.** చేతులు పక్కటెముకలకు ఆనించి ఉంచరాదు.

**06.** మోచేతులను కుడి ఎడమ వైపుల **నమాజ్ ఆచరించే వారికి ఇబ్బంది కలిగే విధంగా మరీ ఎక్కువగా విస్తరింప చేయరాదు.**

**07. తొడలు, ఉదరం (పొట్ట) కలవకూడదు.** అవి విడివిడిగా యుంచాలి.

**08. సజ్దా చేస్తున్నంత సేపూ ముక్కు భూమిపైనే యుంచాలి.** భూమిపై నుండి లేపరాదు.

**09.** సజ్దా చేస్తునప్పుడు **రెండు పాదాల యొక్క మడమలు పైకి ఉంచి, వ్రేళ్ళన్నియు ఖిబ్లా వైపుకు వంచి యుంచవలెను.** ఏదైనా కారణంచే పాదాల వ్రేళ్ళు వంచలేనివారు, వీలైనంత వరకు వంచి కూర్చొనుటకు ప్రయత్నించ వలెను.

ఎటువంటి కారణం లేకుండా పాదపు వ్రేళ్ళు ఖిబ్లా వైపుకు వంచ కుండ, భూమిపై వుంచుట తగదు.

**10.** **సజ్దా చేస్తున్నప్పుడు, కాలివ్రేళ్ళు భూమిపై నుండి లేపరాదు.** కాలి వ్రేళ్ళను భూమిపై ఆన్చి ఉంచ వలెను. కొంతమంది పాదాల వ్రేళ్ళు కాసేపు కూడ భూమిపై ఉంచరు. ఇలా చేయుట వలన సజ్దా నెరవేరదు. దీని ఫలితంగా నమాజ్ కూడా అంగీకరించబడదు. కాబట్టి, ఈవిషయంగా జాగ్రత్త వహించాలి.

**11.** సజ్దా స్థితిలో కనీసం **మూడు సార్లు "సుబ్‌హాన రబ్బియల్ అ‌త్‌లా" స్థిమితంగా పలుకగలగాలి.** నుదురు భూమిపై పెట్టిన వెంటనే పైకి లేపడం తగదు.

## 12.8. రెండు సజ్దాల మధ్య

**01.** **ఒక సజ్దా పూర్తి చేసిన తరువాత లేచి నిటారుగా కూర్చోవాలి. తరువాత రెండవ సజ్దా చేయాలి.** చక్కగా కూర్చోకుండా కొద్దిగా తల పైకెత్తి మరల రెండవ సజ్దా చేయుట అపరాధ (పాప) మౌతుంది. అట్లు చేసిన నమాజ్‌ను మరల ఆచరించుట అనివార్య (వాజిబ్) మౌతుంది.

**02.** రెండు సజ్దాల మధ్య కూర్చొను నపుడు **ఎడమ కాలును పరచి దానిపై కూర్చోవాలి, కుడికాలి పాదపు వ్రేళ్ళు భూమిపై ఖిబ్లా వైపుకు ఉండేట్లు ఉంచి, కుడుకాలి మడమ పైకిఉంచి కూర్చోవాలి.** కొంతమంది రెండు పాదాలు నిలబెట్టి వాటి మడమలపై కూర్చొందురు. ఇది సరియైన పద్ధతి కాదు.

**03.** కూర్చున్నప్పుడు **రెండు చేతులు మోకాళ్ళకు దగ్గరగా తొడలపై ఉంచాలి.** కానీ చేతివ్రేళ్ళు మోకాళ్ళ క్రిందికి వ్రేలాడుతు యుండరాదు.

**04.** కూర్చున్నప్పుడు **దృష్టి తన ఒడిలో ఉంచాలి.**

**05.** **కనీసం ఒకసారి "సుబ్‌హానల్లాహ్" పలుక గలిగినంత సేపు కూర్చోవాలి. "అల్లాహుమ్మగ్‌ఫిర్‌లీ వర్‌హమ్‌నీ వస్‌తుర్‌నీ వజ్‌బుర్‌నీ వహ్‌దినీ వర్‌జుఖ్‌నీ"** (ఓ అల్లాహ! నన్ను క్షమించు, నాపై కరుణించు, నాలోపాలను కప్పిపుచ్చు, నన్ను సంస్కరించు, నాకు మార్గదర్శకము చేయి, జీవన భృతిని కల్గించుము) పలుక గలిగిన ఉత్తమము. కాని ఫర్జ్ నమాజ్‌లలో ఇదియంతయు చదువ నవసరం లేదు. నఫిల్ నమాజ్‌లలో చదువడం ఉత్తమము.

## 12.9. రెండవ సజ్దా చేయుట & లేచి నిలబడు నప్పుడు

**01.** రెండవ సజ్దాలో కూడ మొదటి సజ్దా వలె **మొదట రెండు చేతులను తరువాత ముక్కును, తరువాత నుదుటిని భూమిపై** ఉంచాలి.

**02. సజ్దా నుండి లేచునపుడు ముందు నుదురు, మరల ముక్కు, మరల చేతులను, తరువాత మోకాళ్ళను లేపవలెను.**

**03. లేచి నిలబడే సమయాన చేతులు భూమికి ఆనించక, భూమి సహాయం తీసుకోకుండా నిలబడుట మంచిది.** ఒకవేళ భారీకాయమున్నను, జబ్బుపడి యున్నను, లేక ముసలితనం చేత నిలబడుటకు ఇబ్బంది యున్నచో, ఆసరా తీసుకోవడం సమ్మతమే.

**04.** లేచి నిలబడిన తరువాత ప్రతి **రకాత్ ప్రారంభంలో సూరయె ఫాతిహాకు పూర్వం "బిసిల్లా హిర్రహ్మా నిర్రహీమ్"** చదవాలి.

## 12.10. ఖ అ్ దా లో

**01.** రెండు సజ్దాల మధ్య కూర్చొనే (పైన వివరించిన) విధంగానే ఖఅ్దా (ఖాయిదా అనుట సరియైనది కాదు) లో కూడ కూర్చోవాలి.

**02. అత్తహియాత్** పఠించు నపుడు **"అష్హదు అల్లా ఇలాహ"** వద్ద చూపుడు వ్రేలు పైకి లేపి సైగచేయవలెను. మరల **"ఇల్లల్లాహు"** పలుకు నపుడు లేపిన వ్రేలిని దించివేయ వలెను.

**03.** సైగ చేయు పద్ధతి ఏమనగా, కుడి చేతి బొటనవ్రేలిని మధ్యవ్రేలిని కలిపి వలయాకారంగా (గుండ్రంగా) చేయాలి. చిటికిన వ్రేలిని, దాని ప్రక్కనున్న వ్రేలిని ముడుచుకోవాలి. చూపుడు వ్రేలిని ఖిబ్లా వైపుకు పైకెత్తాలి. మరీ నిటారుగా ఆకాశం వైపుకు లేపరాదు.

**4. "ఇల్లల్లాహు"** పలికే టప్పుడు చూపుడు వ్రేలిని, క్రిందికి దించి వేయాలి. కానీ మిగిలిన వ్రేళ్ళు సైగ చేసి నప్పుడు ఉంచిన విధంగానే నమాజ్ చివరి వరకు ఉంచాలి.

## 12.11. సలామ్ పలికేటప్పుడు

**01.** కుడి, ఎడమ రెండు వైపుల **సలామ్ – "అస్సలాము అలైకుమ్ వ రహ్మాతుల్లాహ్" అని పలికేటప్పుడు వెనుక వున్న వారికి మన చెంప కనపడేంతగా మన**

మెడను త్రిప్పాలి.

**02.** సలామ్ పలికే టప్పుడు మన **చూపులు భుజముపై ఉంచాలి.**

**03.** కుడి వైపు మెడను త్రిప్పి **"అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్"** అను నప్పుడు, నాకుడి వైపు **నమాజ్ ఆచరించుచున్న వారికి, ఫరిష్తాలకు సలాం చేయుచున్నానను సంకల్పం మనసులో చేసుకోవాలి.** అలాగే ఎడమ వైపు సలామ్ పలుకు నప్పుడు, నాఎడమ వైపు నమాజ్ ఆచరించుచున్న వారికి, ఫరిష్తాలకు సలాం చేయుచున్నానను సంకల్పం మనసులో చేసుకోవాలి.

## 12.12. దుఆ చేయు పద్ధతి

**01. రెండు చేతులు వక్షానికి ఎదురుగా ఉండేట్లు ఎత్తాలి. రెండు చేతులు కలప కూడదు మరియు ఎక్కువ ఖాళీ కూడ ఉంచకూడదు.** మధ్యస్థంగా ఉంచాలి.

**02.** దుఆ చేసే సమయాన **అరచేతులను ముఖానికి అభిముఖంగా ఉంచాలి.**

## 13. నమాజ్ లోని ఫర్జ్‌లు, వాజిబ్‌లు, సున్నత్‌ల పట్టిక

**నమాజ్‌లో ఫర్జ్ విడిచి పెట్టినచో నమాజ్ భ్రష్టమగును. (చెడిపోతుంది). మరల ఆచరించ వలసి యుంటుంది.**

**నమాజ్‌లో వాజిబ్ విడిచి పెట్టినచో నమాజ్ భ్రష్టము కాదు గానీ సజ్‌దా సహూ చేసిన నమాజ్ సక్రమమగును లేనిచో మరల ఆచరించ వలసి యుంటుంది.**

**నమాజ్‌లో సున్నత్ విడిచి పెట్టినచో నమాజ్ అయిపోతుంది గానీ సున్నత్ యొక్క పుణ్యము లభించదు.**

| | | |
|---|---|---|
| **01.** | తక్‌బీరె తహ్‌రీమ (నమాజ్ ప్రారంభించుటకు పూర్వము 'అల్లాహు అక్బర్' అనిపలుకుట) | ఫర్జ్ |
| **02.** | ఖియామ్ (నమాజ్‌లో నిలబడుట) | ఫర్జ్ |
| **03.** | రెండు చేతులు చెవుల వరకు ఎత్తుట | సున్నత్ |
| **04.** | చేతులు కట్టుకొనుట | సున్నత్ |
| **05.** | సనా చదువుట | సున్నత్ |
| **06.** | తవూజ్ (అవూజు బిల్లాహి మినష్షైతా నిర్రజీం) పలుకుట | సున్నత్ |
| **07.** | తస్‌మియహ్ (బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం) పలుకుట | సున్నత్ |

| | | |
|---|---|---|
| **08.** | ఖుర్ఆన్ చదువుట (మూడు ఆయత్‌లు (సూక్తులు) చదువుట ఫర్జ్ అయి యున్నది) | ఫర్జ్ |
| **09.** | సూరహె ఫాతిహా చదువుట | వాజిబ్ |
| **10.** | రెండవ సూరహ్ చదువుట | వాజిబ్ |
| **11.** | రుకూ లోనికి వెళ్ళుచూ 'అల్లాహు అక్బర్' పలుకుట | సున్నత్ |
| **12.** | రుకుత్ చేయుట (వంగుట) | ఫర్జ్ |
| **13.** | తస్‌బీహ్ (సుబ్‌హాన రబ్బియల్ అజీం) పలుకుట | సున్నత్ |
| **14.** | తస్‌మీత్ (సమిఅల్లాహు లిమన్ హమిదహ్) పలుకుట | సున్నత్ |
| **15.** | ఖౌమ (రుకూ తరువాత నిటారుగా నిలబడుట) | వాజిబ్ |
| **16.** | తహ్‌మీద్ (రబ్బనా లకల్ హంద్) పలుకుట | సున్నత్ |
| **17.** | సజ్దా లోనికి వెళ్ళుచూ 'అల్లాహు అక్బర్' పలుకుట | సున్నత్ |
| **18.** | రెండు సజ్దాలు చేయుట | ఫర్జ్ |
| **19.** | తస్‌బీహ్ (సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా) పలుకుట | సున్నత్ |
| **20.** | మొదటి సజ్దా నుండి లేచి కూర్చొను నప్పుడు 'అల్లాహు అక్బర్' పలుకుట | సున్నత్ |
| **21.** | జల్‌స (రెండు సజ్దాల మధ్య కూర్చొనుట) | వాజిబ్ |
| **22.** | తత్‌దీల్ అనగా ప్రతీ అంశాన్ని నిదానముగా ఆచరించుట | వాజిబ్ |
| **23.** | ఖత్‌దహ్ ఊలా (రెండు రకఅత్‌ల తరువాత కూర్చొనుట) | వాజిబ్ |
| **24.** | అత్తహియ్యాత్ చదువుట | వాజిబ్ |
| **25.** | అత్తహియ్యాత్ చదువునప్పుడు చూపుడు వ్రేలిని పైకి ఎత్తుట | సున్నత్ |
| **26.** | చివరి రకఅత్ లో కూర్చొనుట | ఫర్జ్ |
| **27.** | దరూదె షరీఫ్ చదువుట | సున్నత్ |
| **28.** | దుఆ మాసూరహ్ చదువుట | సున్నత్ |
| **29.** | చివరిలో సలామ్ పలుకుట | వాజిబ్ |
| **30.** | కుడి వైపుకు మరియు ఎడమ వైపుకు ముఖము త్రిప్పుట | సున్నత్ |
| **31.** | విత్ర్ నమాజ్ లో దుఆయే ఖునూత్ చదువుట | వాజిబ్ |
| **32.** | దుఆయె ఖునూత్ చదువుటకు ముందు 'అల్లాహు అక్బర్' పలుకుట | వాజిబ్ |

## 14. స్త్రీ ల నమాజ్

స్త్రీలు కూడా పైన పేర్కొనిన విధంగానే నమాజ్‌ను ఆచరించాలి. కానీ కొన్ని విషయాలలో స్త్రీపురుషుల నమాజ్‌లలో తేడాలున్నవి. అవి:

**1. నమాజ్ ప్రారంభించక పూర్వం** తమ ముఖం, అరచేతులు, పాదాలు తప్ప మిగిలిన అన్ని అవయవాలను వస్త్రంచే కప్పుకోవాలి.

కొంతమంది స్త్రీలు వెంట్రుకలను కప్పి పుచ్చరు. కొందరు చేతులను కప్పిపుచ్చరు. కొందరు చెవులను కప్పిపుచ్చరు. కొందరు చిన్న వస్త్రంతో తలను కప్పిపుచ్చుటచే వెంట్రుకలు వ్రేలాడుతుంటాయి. ఇవన్నియు తగని పనులు.

స్త్రీలు నమాజ్ ఆచరించే సమయంలో తమ ముఖం, అరచేతులు, పాదాలు తప్ప మిగిలిన శరీరాన్ని వెంట్రుకలతో సహా మందపు వస్త్రంచే బాగుగా కప్పుకోవడం ఫర్జ్ (విధి). వీటిని తెరచి యుంచినచో, నమాజ్ అంగీకరించ బడదు. (తిర్మిజీ, 1/86)

నమాజ్ ఆచరించే సమయంలో ముఖం, అరచేతులు, పాదాలు తప్ప మిగిలిన అన్ని అవయవాలలో ఏ ఒక్క అవయవపు నాల్గవ భాగం **"సుబ్‌హాన రబ్బియల్ అజీమ్"** అని మూడు సార్లు పలుక బడు నంతటి సమయం కనబడినచో (తెరచి యుంచినచో) నమాజ్ సంపూర్ణం కాదు. దానిని మరల ఆచరించ వలసి యుంటుంది. అంతకన్నా తక్కువ సమయం కనబడిన, నమాజ్ పరిపూర్ణమవుతుంది, కానీ పాపము కలుగుతుంది.

**2.** స్త్రీలు నమాజ్‌ను **బయట ఆచరించడం** కన్నా వరండాలో ఆచరించుట శ్రేష్ఠము, వరండాలో కన్నా గదిలో ఆచరించడం శ్రేష్ఠతరం. అనగా ఎంత లోపలి భాగంలో ఆచరించిన అంత శ్రేష్ఠమగును.

**3.** స్త్రీలు నమాజ్ ప్రారంభంలో **తక్బీరె తహ్రీమా పలుకు నపుడు** చేతులను పురుషుల వలె చెవుల వరకు కాకుండా భుజాల వరకే ఎత్తాలి. అది కూడా కప్పుకున్న వస్త్రం (దుపట్టా) లోపలే. దుపట్టా నుండి బయటకు తీయరాదు. (బిహిష్తీ జేవర్)

**4.** స్త్రీలు చేతులను వక్షస్థలం పై కట్టుకోవాలి. పురుషుల వలె నాభికి క్రింది భాగంలో కట్టుకో కూడదు. పురుషుల వలె స్త్రీలు కుడిచేతి బొటన, చిటికిన వ్రేళ్ళతో ఎడమ చేతి మణికట్టును పట్టుకో కుండా, కేవలం తమ కుడి

అరచేతిని ఎడమ అరచేతి ఉపరితలంపై పెట్టాలి.

**5. రుకూలో** పురుషులు తల, వీపు, నడుము సమానంగా యుండేట్లు వంగాలి. కానీ స్త్రీలు పురుషులు వంగునంతగా కాకుండా, అంతకన్నా తక్కువగా, చేతులు మోకాళ్ళదాక వచ్చేటంతగా వంగాలి.

**6. రుకూలో** పురుషురులు మోకాళ్ళపై వ్రేళ్ళను పరచి పట్టుకో వలెను. కానీ స్త్రీలు వ్రేళ్ళను కలిపి యుంచవలెను. మధ్య ఖాళీ యుండరాదు. చేతివ్రేళ్ళతో మోకాళ్ళను పట్టుకోవడానికి బదులు ఆనించి ఉంచితే సరిపోతుంది. (దుర్రె ముఖ్తార్)

**7. రుకూలో** పురుషులు కాళ్ళను వంచరాదు, నేరుగా ఉంచాలి. కానీ స్త్రీలు మోకాళ్ళను కొద్దిగా ముందుకు వంచి నిలబడాలి. (దుర్రెముఖ్తార్)

**8. రుకూలో** పురుషుల రెండు మోచేతులు పక్కటెముకలకు తగలకూడదు. కానీ స్త్రీల మోచేతులు పక్కటెముకలతో కలపి యుంచాలి. (దుర్రెముఖ్తార్)

**9. రుకూలో** నిలబడునపుడు పురుషుల రెండు పాదాల మధ్య ఖాళీ యుండాలి. కానీ స్త్రీలు రెండు పాదాల మధ్య ఖాళీ లేకుండా కలిపి యుంచాలి. (బిహిష్తీ జేవర్)

**10. సజ్దలో వెళ్ళే సమయాన** పురుషులు ముందుగా మోకాళ్ళను ఆనించిన తరువాత వక్షస్థలాన్ని వంచాలి. కానీ స్త్రీలు ముందుగానే వక్షస్థలాన్ని వంచి సజ్దాలో వెళ్ళాలి.

**11. సజ్దా చేయునప్పుడు** పురుషుల ఉదరం (పొట్ట) తొడలకు ఆనకుండ విడిగా ఉంచాలి. మోచేతులు పక్కటెముకలకు ఆనకుండ ఎడంగా ఉంచాలి. మోచేతులను భూమిపై ఆన్చకుండా పైకి లేపి ఉంచాలి. కాలి ముని వ్రేళ్ళను ఖిబ్లా వైపుకు త్రిప్పి భూమిపై ఆన్చి పాదాలను పైకెత్తి ఉంచాలి. కానీ స్త్రీలు ఉదరాన్ని తొడలకు, బాహువుల్ని చంకలకు ఆనించి (దగ్గరగా కలిపి) ఉంచాలి. మోచేతులు పక్కటెముకలు కలసిపోయేట్లు అరచేతులతోపాటు నేలమీద ఆనించి పెట్టాలి. కాళ్ళ మడమల్ని నిలబెట్టి యుంచుటకు బదులు కుడివైపునకు పరుండ బెట్టాలి.

**12. సజ్దాలో** పురుషులు మోచేతులను భూమిపై ఆనించరాదు. కానీ స్త్రీలు మోచేతులను పార్శ్వములతో కలిపి భూమిపై ఉంచాలి. (దుర్రెముఖ్తార్)

**13. జల్సా మరియు ఖత్‌దాలో** అనగా రెండు సజ్దాల మధ్య కూర్చొను

నప్పుడు, రెండు సజ్దాల తరువాత అత్తహియ్యాత్ చదువుటకు కూర్చొను నప్పుడు, పురుషులు కుడి కాలి పాదపు వ్రేళ్ళు నేలమీద ఖిబ్లాకు అభిముఖముగా యుంచి, మడమను పైకి లేపి ఉంచాలి. ఎడమ కాలి పాదాన్ని పరచి, దాని మీద పిరుదులను మోపి నిటారుగా కూర్చోవాలి. కానీ స్త్రీలు రెండు కాళ్ళను కుడివైపుకు తీసి, రెండు తొడలను దగ్గరకు చేర్చి ఎడమ ముంగాలిపై కుడి ముంగాలు, తొడ ఉండేలా కూర్చోవాలి.

**14. పురుషులు** చేతి వ్రేళ్ళను రుకూలో విడివిడిగాను, సజ్దా చేసేటప్పుడు మిక్కిలి దగ్గరగా కలిపి, మిగిలిన సమయాలలో వాటి సహజ స్థితిలో ఉంచాలి. అనగా మిక్కిలి విడిగా కాకుండా, మిక్కిలి కలిపి కాకుండా ఉంచాలి. కానీ స్త్రీలు అన్నింటి యందును అనగా రుకూ, సజ్దా, రెండు సజ్దాల మధ్య కూర్చొను నప్పుడును వ్రేళ్ళను కలిపి ఉంచాలి, వాటి మధ్య ఖాళీ యుండరాదు.

**15.** పురుషులు సామూహికంగా (జమాఅత్‌తో) నమాజ్ చేయడం శ్రేష్ఠము. కానీ స్త్రీలు సామూహికంగా (జమాఅత్‌తో) నమాజ్‌ను ఆచరించుట మక్రూ అవుతుంది. ఒకవేళ ఇంటి మహ్రమ్ వ్యక్తులు అనగా పెండ్లి చేసుకొనుటకు నిషేధింప బడిన వారు, సామూహికంగా నమాజ్ ఆచరించేట్లు యుంటే, వారితో బాటు సామూహికంగా నమాజ్ ఆచరించడంలో ఎటువంటి తప్పు లేదు. కానీ వారితో సమానంగా వారి పంక్తిలో నిలబడకుండా, వారి వెనుక పంక్తిలో నిలబడి నమాజ్‌ను ఆచరించాలి. వారితో సమానంగా ఎటువంటి పరిస్థితులలోను నిలబడ కూడదు.

**గమనిక:** స్త్రీలు మస్జిద్‌లలో కన్న ఇంటిలో నమాజ్ ఆచరించడం శ్రేష్ఠము (ఫతావా రహీమియ, జిల్ద్ పంజమ్)

## 15. స్త్రీ పురుషులు నమాజ్ ఆచరించుటలో తేడాలు

### 1. తక్బీరె తహ్రీమా

**పురుషులు: తక్బీరె తహ్రీమా పలుకు నపుడు** చేతులను చెవుల వరకు ఎత్తాలి.

**స్త్రీలు: తక్బీరె తహ్రీమా పలుకు నపుడు** చేతులను భుజాల వరకే ఎత్తాలి. అది కూడా కప్పుకున్న వస్త్రం (దుపట్టా) లోపలే. దుపట్టా నుండి బయటకు తీయరాదు. (బిహిష్తీ జేవర్)

## 2. నిలబడుట (ఖియామ్)

**పురుషులు:** రెండు పాదాల మధ్య కనీసం నాలుగు అంగుళాల ఖాళీ ఉండాలి. గరిష్టంగా ఒక జానెడు ఖాళీ కన్నా ఎక్కువ ఉండరాదు.

**స్త్రీలు:** రెండు పాదాలు కలసి యుండాలి.

## 3. చేతులను కట్టుకోవడం

**పురుషులు:** చేతులను నాభికి క్రింది భాగంలో కట్టుకోవాలి. కుడిచేతి బొటన, చిటికిన వ్రేళ్ళతో ఎడమ చేతి మణికట్టును పట్టుకో వలెను.

**స్త్రీలు:** చేతులను వక్షస్థలం పై కట్టుకోవాలి. కుడి అరచేతిని ఎడమ అరచేతి పైన ఉంచి, ఐదు వ్రేళ్ళను పరచి ఉంచ వలెను. అదికూడా, బయట కాకుండా దుపట్టా లోపలనే.

## 4. రుకూలో

**పురుషులు:** తల వీపు, నడుము సమానంగా యుండేట్లు వంగాలి.

**స్త్రీలు:** పురుషులు వంగునంతగా కాకుండా, అంతకన్నా తక్కువగా, చేతులు మోకాళ్ళదాక వచ్చేటంతగా వంగాలి.

**పురుషులు:** మోకాళ్ళపై వ్రేళ్ళను పరచి పట్టుకో వలెను.

**స్త్రీలు:** వ్రేళ్ళను కలిపి యుంచవలెను. మధ్య ఖాళీ యుండరాదు. చేతివ్రేళ్ళతో మోకాళ్ళను పట్టుకోవడానికి బదులు ఆనించి ఉంచితే సరిపోతుంది. (దుర్రె ముఖ్తార్)

**పురుషులు:** కాళ్ళను వంచరాదు, నేరుగా ఉంచాలి

**స్త్రీలు:** మోకాళ్ళను కొద్దిగా ముందుకు వంచి నిలబడాలి. (దుర్రెముఖ్తార్)

**పురుషులు:** రెండు మోచేతులు పక్కటెముకలకు తగలకూడదు.

**స్త్రీలు:** మోచేతులు పక్కటెముకలతో కలపి యుంచాలి. (దుర్రెముఖ్తార్)

## 5. సజ్దాలో

**పురుషులు:** ముందుగా మోకాళ్ళను ఆనించిన తరువాత వక్షస్థలాన్ని వంచాలి.

**స్త్రీలు:** ముందుగానే వక్షస్థలాన్ని వంచి సజ్దాలోకి వెళ్ళాలి.

**పురుషులు:** ఉదరం (పొట్ట) తొడలకు ఆనకుండ విడిగా ఉంచాలి. మోచేతులు పక్కటెముకలకు ఆనకుండ ఎడంగా ఉంచాలి. మణికట్టును భూమిపై ఆన్చకుండా పైకి లేపి ఉంచాలి.

**స్త్రీలు:** ఉదరం (పొట్ట) తొడలను కలిపి ముద్దగా ఉంచాలి. మోచేతులు పక్కటెముకలతో కలిపి యుంచాలి. (దుర్రెముఖ్తార్)

**పురుషులు:** కాలి ముని వ్రేళ్ళను ఖిబ్లా వైపుకు త్రిప్పి భూమిపై ఆన్చి పాదాల మడమల్ని నిలబెట్టి యుంచాలి.

**స్త్రీలు:** స్త్రీలు ఉదరాన్ని తొడలకు, బాహువుల్ని చంకలకు ఆనించి (దగ్గరగా కలిపి) ఉంచాలి. మోచేతులు పక్కటెముకలు కలసిపోయేట్లు అరచేతులతో పాటు నేలమీద ఆనించి పెట్టాలి. కాళ్ళ మడమల్ని నిలబెట్టకుండ, కుడివైపునకు పరుండ బెట్టాలి.

**పురుషులు:** మోచేతులను భూమిపై ఆనించరాదు.

**స్త్రీలు:** మోచేతులను పార్శ్వములతో కలిపి భూమిపై ఉంచాలి. (దుర్రెముఖ్తార్)

### 6. జల్సా మరియు ఖఅ్దా

(రెండు సజ్దాల మధ్య మరియు రెండు సజ్దాల తరువాత కూర్చొను నప్పుదు,)

**పురుషులు:** కుడి కాలి పాదపు వ్రేళ్ళు నేలమీద ఖిబ్లాకు అభిముఖముగా యుంచి, మడమను పైకి లేపి ఉంచాలి. ఎడమ కాలి పాదాన్ని పరచి, దాని మీద పిరుదులను మోపి నిటారుగా కూర్చోవాలి.

**స్త్రీలు:** రెండు కాళ్ళను కుడివైపుకు తీసి, రెండు తొడలను దగ్గరకు చేర్చి ఎడమ ముంగాలిపై కుడి ముంగాలు, తొడ ఉండేలా కూర్చోవాలి.

**పురుషులు:** చేతి వ్రేళ్ళను రుకూలో విడివిడిగాను, సజ్దా చేసేటప్పుడు మిక్కిలి దగ్గరగా కలిపి, మిగిలిన సమయాలలో వాటి సహజ స్థితిలో ఉంచాలి. అనగా మిక్కిలి విడిగా కాకుండా, మిక్కిలి కలిపి కాకుండా ఉంచాలి.

**స్త్రీలు:** స్త్రీలు అన్నింటి యందును అనగా రుకూ, సజ్దా, రెండు సజ్దాల మధ్య కూర్చొను నప్పుదును వ్రేళ్ళను కలిపి ఉంచాలి, వాటి మధ్య ఖాళీ యుండరాదు.

## 16. స్త్రీ పురుషుల నమాజ్ లలో సమానమైన విషయాలు

ఖిరాఅత్ కొరకు నిలబడినపుడు (ఖియామ్‌లో) సజ్దా చేయు ప్రదేశములోను, రుకూ చేయునపుడు పాదాలపైన, సజ్దా చేయునపుడు ముక్కుపైన, సలామ్ చేయునపుడు భుజాలపైన చూపు నుంచవలెను.

నమాజ్‌లో ఆవలింత వస్తే, దానిని ఆపటానికి గట్టి ప్రయత్నం చేయాలి.

అప్పటికీ ఆగకపోతే, కుడి అరచేతి వెనుక భాగమును నోటికి అడ్డంగా ఉంచాలి. దగ్గు వచ్చిననూ ఇలాగే ఆపడానికి ప్రయత్నించాలి.

సిర్రి నమాజ్‌లో అనగా మెల్లగా ఖుర్ఆన్ పఠిస్తూ ఆచరించే నమాజ్‌లో తన శబ్దమును తాను వినేట్లుగా పఠించాలి.

**గమనిక:** స్త్రీలు అన్ని నమాజ్‌లలోను ఖిరాఅత్ మెల్లగానే చదవాలి.

సలామ్ చేసిన తరువాత ఒకసారి **"అల్లాహు అక్బర్"** పలికి, మూడు సార్లు **"అస్తగ్ ఫిరుల్లాహ్"** పలకాలి. మూడవసారి పలుకు నపుడు కొంచెం సాగదీసి పలకాలి. (రసూలుల్లాహ్ స కి సున్నతేఁ)

## 17. విత్ర్ నమాజ్

విత్ర్ అనగా బేసి అని అర్థం. బేసి సంఖ్య రకాతులు గల నమాజ్, గనుక దీనిని విత్ర్ నమాజ్ అని అందురు. ఇషా నమాజ్ తరువాత ఆచరించబడే ప్రత్యేకమైన మూడు రకాతుల నమాజ్‌ను విత్ర్ నమాజ్ అందురు. ఇది మూడు రకాతులు ఒక సలామ్‌తో పూర్తిచేయ బడును. మూడవ రకాత్‌లో "దుఆయె ఖునూత్" పఠింపబడును.

విత్ర్ నమాజ్ ఆచరించుట వాజిబ్ (తప్పనిసరి). బద్ధకము వల్లగానీ మరే ఇతర కారణం వల్ల గానీ దీనిని ఆచరించనివారు మహా పాపులగుదురు. ఈ నమాజ్ యొక్క సమయము ఇషా నమాజ్ తరువాత ప్రారంభమై సుబహ్‌సాదిఖ్ (ఉషోదయము) వరకు యుంటుంది. (బిహిష్తీ జేవర్, స. 28, దీనియాత్ 5 బిజి స. 99)

### 17.1. విత్ర్ నమాజ్ ఆచరించే పద్ధతి

మగ్రిబ్ నమాజ్ వలెనే విత్ర్ నమాజ్‌లో కూడా మూడు రకాతులు ఆచరింప బడుతాయి. కానీ ఈ రెండు నమాజ్‌లలో కొన్ని తేడాలు ఉన్నాయి. అవి యేమనగా: విత్ర్ నమాజ్‌లో మూడవ రాకాత్‌లో సూరయె ఫాతిహా పఠించిన తరువాత ఇంకొక సూరా కూడా పఠించాలి. తరువాత (రుకూ లోనికి వెళ్ళకుండ) "అల్లాహు అక్బర్" అని పలుకుచూ రెండు చేతులు చెవుల వరకు ఎత్తి, మరల నాభి (బొడ్డు) క్రింద కట్టుకోవాలి. తరువాత "దుఆయె ఖునూత్" పఠించాలి. అటు తరువాత రుకూ, సజ్దాలు మొదలగునవి మిగిలిన నమాజ్‌లలో వలె పూర్తిచేసి, సలాం చేసి, నమాజ్‌ను పూర్తి చేయాలి.

## 17.2. దుఆయె ఖునూత్

**"అల్లాహుమ్మ ఇన్నా నస్తఈనుక వ నస్తగ్ఫిరుక వనుత్మినుబిక వనతవక్కలు అలైక వనుస్నీ అలైకల్ఖైర్, వనష్కురుక వలా నక్ఫురుక వనఖ్లవు వనత్రుకు మంయ్యఫ్జురుక్. అల్లాహుమ్మ ఇయ్యాక నఅ్బుదు వలకనుసల్లీ వనస్జుదు వ ఇలైక నస్ఆ వ నహ్ఫిదు వ నర్జూ రహ్మతక వనఖ్షా అజాబక ఇన్న అజాబక బిల్ కుఫ్ఫారిముల్ హిఖ్."** (బిహిష్తీ జేవర్,స.28, దీనియాత్5బిజి స.100)

ఒకవేళ దుఆయె ఖునూత్ జ్ఞాపకము లేనిచో ఈ దుఆను చదవాలి:

(2) **رَبَّنَآ اٰتِنَا فِى الدُّنۡيَا حَسَنَةً وَّفِى الۡاٰخِرَةِ حَسَنَةً وَّقِنَا عَذَابَ النَّارِ** (ఆలెఇమ్రాన్,ఆ. 201)

లేదా మూడు సార్లు ఈ దుఆను చదవాలి: **"అల్లాహుమ్మగ్ఫిర్లీ".** మరియు దుఆయె ఖునూత్ నేర్చుకొనే ప్రయత్నము చేయాలి. కానీ సున్నత్ యొక్క శ్రేయో శుభాలు పూర్తిగా పొందుటకు దుఆయె ఖునూత్ నేర్చుకోవడం చాలా అవసరం. (దీనియాత్ 5 బిజి స. 100)

విత్ర్ నమాజ్‌కు చెందిన మూడు రకాత్‌లలో సూరయె ఫాతిహా తరువాత ఇతర సూరాలు పఠించు నపుడు యే సూరా నయిననూ పఠించ వచ్చును. కానీ మొదటి రకాత్‌లో "సూరయె అఅ్‌లా" (సబ్బిహిస్మరబ్బికల్ అఅ్‌లా), రెండవ రకాత్‌లో "సూరయె కాఫిరూన్" (ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్), మూడవ రకాత్‌లో "సురయె ఇఖ్‌లాస్" (ఖుల్‌హు వల్లాహు అహద్) పఠించడం ముస్తహబ్ (అభిలషణీయం). దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ విత్ర్ నమాజ్‌లో ఈ మూడు సూరాలు పఠించేవారని హజ్రత్ ఇబ్నెకాబ్ రజియల్లాహు అన్హు తెలియ జేసారు. (అబూదావూద్, నసాయి) (బిహిష్తీ జేవర్, స. 28)

### సిద్ధాంతాలు

**01.** విత్ర్ నమాజ్‌లో తప్ప మరియే ఇతర నమాజ్ లోను దుఆయె ఖునూత్ చదువబడదు.

**02.** పవిత్ర రమజాన్ మాసములో విత్ర్ నమాజ్ జమాఅత్‌తో ఆచరించడము శ్రేష్ఠము. ఇతర రోజులలో విత్ర్ నమాజ్ వ్యక్తిగతముగా ఆచరించాలి.

**03.** ఒకవేళ విత్ర్ నమాజ్ ఆచరించడము తప్పిపోతే, దాని ఖజా చేయడము వాజిబ్ అవుతుంది. ఖజా ఆచరించు నప్పుడు విత్ర్ నమాజ్ యొక్క ఖజా ఆచరించు చున్నాను" అని సంకల్పము చేయుట మరచిపోరాదు.

## 18. జుముఅ నమాజ్

శుక్రవారము ప్రతి ముస్లిమ్‌కు పండుగరోజు. "జుముఅ నమాజ్" ప్రతి ముస్లిమ్ కొరకు "ఫరజె ఐన్" అనగా స్వేచ్ఛా పరులు, తెలివిగలిగిన వారు, పెద్దవారు (బాలిగ్), స్థానికులు, ఆరోగ్యవంతులైన ప్రతి పురుషుడు తప్పనిసరిగా ఆచరించ వలయును. (బానిసలకు, పిచ్చివారికి, చిన్న పిల్లలకు, ముసాఫిర్ అనగా బాటసారులకు, స్త్రీలకు ఈ నమాజ్ లేదు)

**గమనిక:** 'జుమ్మా, జుమా' కు మనము అలవాటు పడి యున్నాము. కానీ "జుముఅ" అనునది సరియైన ఉచ్చారణ. దీనిని అలవాటు చేసుకో వలసినదిగా మనవి చేయుచున్నాను.

ఈ నమాజ్‌ను నిరాకరించేవాడు కాఫిర్ (అవిశ్వాసి)గా పరిగణింప బడుతాడు. సమర్థనీయమైన కారణము లేకుండా ఈ నమాజ్‌ను విడిచి పెట్టువాడు పాపాత్ముడవుతాడు.

ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు తఆలా అన్‌హు గారు తెలిపిన ప్రకారం "హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ విధముగా సెలవిచ్చిరి: **"ఏ వ్యక్తి అయితే సరియైన కారణము లేకుండా జుముఅ నమాజ్‌ను విడిచి పెట్టాడో, ఆ వ్యక్తి మునాఫిఖ్ అనగా కపట విశ్వాసిగా లిఖింప బడుతాడు. మరియు అతనిపై కపటత్వపు (నిఫాఖ్) ఆజ్ఞ సదా యుంటుంది".**

శుక్రవారము ప్రతి ముస్లిమ్ గోళ్ళు కత్తిరించుకోవాలి. గుస్ల్ (స్నానము) చేయాలి. తనవద్ద ఉన్న దుస్తులలో శ్రేష్ఠమైన వాటిని ధరించాలి. వీలైతే సువాసనా ద్రవ్యమును (అత్తరు) పూసుకోవాలి. జుముఅ నమాజ్ కొరకు జామిత్ మసీదుకు త్వరగా వెళ్ళాలి. ఎంత త్వరగా వెళ్ళితే అంత అధిక పుణ్యము లభిస్తుంది. (బిహిష్తీ సమర్, హిస్స అవ్వల్, స. 120)

జొహ్ర్ నమాజ్ యొక్క సమయమలోనే జుముఅ నమాజ్ ఆచరింప బడును. జుముఅలో రెండు రకాతులు ఫర్జ్ నమాజ్ చదవాలి. జుముఅ నమాజ్ కు ముందు రెండు ఖుద్బాలు (ఉపన్యాసాలు) ఇవ్వబడును. (దీనియాత్ 5 బిజి స. 99)

### 18.1. జుముఅ నమాజ్ కొరకు నియమములు (షరాయిత్)

జుముఅ నమాజ్ ఆచరించుట కొరకు ధర్మశాస్త్రము ఐదు షరతులను

(నియమాలను) నిర్దేశించినది. అవి:

**01.** పట్టణము గానీ లేక పెద్ద గ్రామము గానీ అయి వుండాలి.

**02.** జొహ్రా నమాజ్ వేళ అయి వుండాలి.

**03.** జుముఅ నమాజ్‌కు పూర్వము, ఖుద్బా ప్రసంగము(ఉపన్యాసము) ఇవ్వబడాలి.

**04.** ఇమామ్ కాకుండా కనీసము ముగ్గురు వ్యక్తులైనా యుండాలి.

**05.** ఆ ప్రదేశములో అందరు నమాజ్ ఆచరించుటకు అనుమతి యుండాలి.

(దీనియాత్ 1 యం స. 100)

## సిద్ధాంతాలు

**01.** జుముఅ నమాజ్ కొరకు అజ్జాన్ వినిన వెంటనే అన్ని పనులు విడిచి పెట్టి నమాజ్ కొరకు వెళ్ళుట వాజిబ్ (అనివార్యము).

**02.** జుముఅ నమాజ్ లో జొహ్రా యొక్క ఫర్జ్ నమాజ్ గానీ లేక సున్నత్ నమాజ్ గానీ ఆచరించబడదు. (దీనియాత్ 1 యం స 100)

## 18.2. జుముఅ ప్రసంగము (ఖుత్బా)

జుముఅ నమాజ్‌కు పూర్వము ఖుత్బా (ధార్మిక ప్రసంగము) వాజిబ్ (అనివార్యము) అయి యున్నది. ఇమామ్ గారు ఖుత్బా ప్రారంభించగానే అక్కడ ఉన్నవారందరూ దానిని శ్రద్ధగా వినడం వాజిబ్ అయి యున్నది. ఖుత్బా ('ఖుద్బా' అని ఉచ్చరించుట తప్పు) వినుటకు ఆటంకము కలిగించు పని కూడా "మక్రూహె తహ్రీమీ" (నిషిద్ధము) అవుతుంది. నమాజ్ ఆచరించే సమయాన దానికి ఆటంకము కలిగించు పని ఏ విధముగా నిషిద్ధమో, అట్లే జుముఅ నమాజ్‌కు ముందు ప్రసంగించే ఖుత్బాకు ఆటంకము కలిగించు పనులు కూడ నిషిద్ధమై యున్నవి.

ఇమామ్‌గారు ఖుత్బా ప్రసంగము ప్రారంభించినచో, నమాజ్ ఆచరించుట, మాట్లాడుట, ఎవరైనా పలుకరించిన వారికి బదులు పలుకుట, తినుట, త్రాగుట, పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథము చదువుట మొదలగునవి అన్నియు నిషిద్ధము.

ఖుత్బా అరబీ భాషలో చేయుట సున్నత్ (సాంప్రదాయము). ఇతర భాషలలో చేయుట మక్రూ అవుతుంది. ఒకవేళ ప్రసంగము చేయకుండానే జుముఅ నమాజ్ ఆచరించుట తగదు. (బిహిష్తీ సమర్, హిస్స అవ్వల్, స.126)

జుముఅ రెండు ఖుత్బాల మధ్య కూర్చున్న సమయములో ఇమామ్

గానీ ముఖ్తదీలు గానీ చేతులు ఎత్తి "దుఆ" చేయుట మక్రూహె తహ్రీమీ అవుతుంది. కానీ చేతులు ఎత్తకుండా దుఆ చేసుకొన వచ్చును. అలా చేయుట సరియైనదే. (బిహిష్తీ సమర్, హిస్స అవ్వల్, స.126)

మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారి పేరు ఖుత్బాలో ప్రస్తావించబడి నప్పుడు, ముఖ్తదీలు (ఇమామ్‌ను అనుసరించువారు) తమతమ మనస్సులోనే దరూదె షరీఫ్ పఠించాలి.

ఖుత్బా పూర్తి అయిన వెంటనే ఇఖామత్ చెప్పి నమాజ్ ఆచరించుట సాంప్రదాయము. ఖుత్బా మరియు నమాజ్‌ల మధ్య ప్రాపంచిక కార్యకలాపాలు ఆచరించుట మక్రూహె తహ్‌రీమి(నిషిద్ధము). (బిహిష్తీ సమర్, హిస్స అవ్వల్, స.127)

జుముఅ నమాజ్ తప్పిపోయినచో, వారు విడివిడిగా జొహ్ర్ నమాజ్ ఆచరించ వలయును.

ఎవరైనా చివరి ఖఅ్‌దలో అత్తహియ్యాత్ చదువు తున్నప్పుడు గానీ లేక సజ్దయె సహూ తరువాత గానీ వచ్చి నమాజ్‌లో కలిస్తే, అతను ఇతర నమాజ్‌లలో వలె తప్పిపోయిన రకాతులు పూర్తి చేసుకొనిన, అతని నమాజ్ సరిపోతుంది. అతడు జొహ్ర్ నమాజ్ చదువ వలసిన అవసరము లేదు.

## 19. ఖ జా నమాజ్

నిర్ణీతవేళ యందు (నిర్దేశిత) నమాజ్‌ను ఆచరిస్తే అది నెరవేరినట్లు అవుతుంది. అట్లుకాక, నిర్ణీతవేళ దాటిపోయిన తరువాత ఆచరించిన, అది "ఖజా నమాజ్" అవుతుంది. ఉదాహరణకు ఫజ్ర్ నమాజ్ సూర్యోదయము తరువాత ఆచరించిన, ఆ నమాజ్ 'ఖజా' అవుతుంది.

ఫర్జ్ నమాజ్ యొక్క ఖజా ఫర్జ్, మరియు వాజిబ్ నమాజ్ యొక్క ఖజా వాజిబ్ అవుతుంది. కావున వీటి ఖజా తప్పక ఆచరించాలి. సున్నత్ నమాజ్, నఫిల్ నమాజ్, జుముఅ నమాజ్, ఈద్ నమాజ్ లకు ఖజా లేదు. నజర్, మన్నత్ (మొక్కుబడి) లకు సంబంధించిన నమాజ్‌లను నెరవేర్చడము వాజిబ్ గనుక, అవి సరిగా ఆచరించకపోతే, వాటి ఖజా తప్పని సరిగా ఆచరించాలి. నఫిల్ నమాజ్ ఒకసారి ప్రారంభిస్తే, దానిని పూర్తిచేయడము వాజిబ్ అవుతుంది. గనుక, నఫిల్ నమాజ్ మొదలు పెట్టిన తరువాత, ఏదైనా కారణము చేత అది ఫాసిద్

అయిపోతే (చెడిపోతే), దాని ఖజా నమాజ్ ఆచరించడము వాజిబ్ అవుతుంది, కావున దీని ఖజా తప్పక ఆచరించాలి. (బిహిష్తీ జేవర్, స. 34, దీనియాత్ 5 బిజి స. 103)

## 19.1. ఖజా నమాజ్ ఆచరణా విధానము

ఖజా నమాజ్ ఆచరించే విధానము ఏమనగా, ఏ నమాజ్ అయితే తప్పిపోయినదో, ఆ సమయమందలి ఖజా నమాజ్‌ను ఆచరించే సంకల్పము చేయాలి. ఉదాహరణకు "నేను నిన్నటి లేక ఆదివారపు ఫజ్ర్ యొక్క ఫరజ్ నమాజ్ రెండు రకాతులు ఖజా ఆచరిస్తున్నాను" అని సంకల్పము చేసుకోవాలి. తరువాత మామూలు నమాజ్ ఆచరించే విధంగానే, దీనిని కూడ ఆచరించాలి. (దీనియాత్ 5 బిజి స. 103)

ఒకవేళ ఎవరివైనా అనేక నమాజ్‌లు తప్పిపోయి యుండి, ఆ నమాజ్ తేదీలు, సమయము గుర్తుండిన యెడల, "నేను ఫలానా తేది తప్పిపోయిన ఫజర్ నమాజ్/జొహర్ నమాజ్ ఖజా ఆచరిస్తున్నాను" అని సంకల్పం చేసుకోవాలి.

ఒకవేళ ఎవరివైనా అనేక నమాజ్‌లు తప్పిపోయి యుండి, ఆ నమాజ్ తేదీలు, సమయము గుర్తులేని యెడల ఈ విధముగా సంకల్పము చేసుకోవాలి: "నా జీవితములో తప్పిపోయిన ఫజ్ర్ నమాజ్‌లలో మొదటి ఫజ్ర్ నమాజ్ యొక్క ఖజా ఆచరిస్తున్నాను". ఇదే విధముగా జొహ్ర్, అస్ర్ మొదలగు నమాజ్‌ల సంకల్పము చేసి, వాటిని ఆచరిస్తూ ఒకరోజు నమాజ్‌లు పూర్తి చేయాలి. ఇలాగే ఒక్కొక్క రోజుకు సంబంధించిన నమాజ్‌లను పూర్తి చేయాలి. తప్పిపోయిన నమాజ్ లన్నింటి ఖజా ఆచరించినానని మనసునందు సంతృప్తి కలుగేంత వరకు వీటిని ఆచరించాలి. (బిహిష్తీ జేవర్, స. 34, దీనియాత్ 5 బిజి స.103)

**గమనిక:** ఒకే సమయములో అనేక ఖజా నమాజ్‌లు ఆచరించ వచ్చును.

## 20. ప్రయాణికుని (ముసాఫిర్ కీ) నమాజ్

ఎవరైన 48 మైళ్ళ (77.232 కి.మీ) దూరం ప్రయాణించే సంకల్పంతో బయలుదేరి తమ గ్రామ లేక పట్టణ పొలిమేర దాటినచో, ఆవ్యక్తి ఇస్లామ్ ధర్మశాస్త్రం ప్రకారం ముసాఫిర్ అనగా ప్రయాణీకుడగును, అతను ప్రయాణించే కాలము కొన్ని గంటలైనా సరే లేక కొన్ని నిమిషాలైనా సరే. (బిహిష్తీ జేవర్/47, దీనియాత్ 1 యం/102)

## ప్రయాణీకుని కొరకు నమాజ్‌లో ఖస్ర్ (సంగ్రహం) ఆదేశాలు

ప్రయాణీకులు జొహ్ర్, అస్ర్ మరియు ఇషా ఫర్జ్ నమాజ్‌లలో ఖస్ర్ ఆచరించాలి. అనగా నాలుగు రకాతులకు బదులుగా రెండు రకాతులు మాత్రమే ఆచరించాలి. ఫజ్ర్, మగ్రిబ్ మరియు విత్ర్ నమాజ్‌లు మాత్రం యధావిధంగానే ఆచరించాలి. అవకాశముంటే సున్నత్ నమాజ్‌లు యధావిధిగా ఆచరించాలి. వీనిలో ఖస్ర్ (తగ్గించి ఆచరించుట) లేదు. అవకాశం లభించనిచో విడిచిపెట్ట వచ్చును. కానీ వీలైనంత వరకు, ఫజ్ర్ నమాజ్ యొక్క 2 రకాత్‌ల సున్నత్ ఆచరించాలి. ((బిహిష్తీ జేవర్, స. 47, దీనియాత్ 5 బిజి స. 103)

## మసాయిల్ (సిద్ధాంతాలు)

**01.** ప్రయాణీకుడు జొహ్ర్, అస్ర్ మరియు ఇషా నమాజ్‌లలో ఖస్ర్ పాటించాలని తెలిసి కూడా నాలుగు రకాత్‌లు ఆచరించినచో, అతడు అపరాధి అగును.

**02.** ఒకవేళ ప్రయాణీకుడు మరచిపోయి నాలుగు రకాత్‌లు ఆచరించినచో, రెండవ రకాత్ చివర తషహ్హుద్ పఠించి యుండిన యెడల, మొదటి రెండు రకాత్‌లు ఫర్జ్ నమాజ్ గాను, మిగిలిన రెండు రకాత్‌లు నఫిల్ గాను పరిగణింప బడతాయి. అయితే, చివర సహూసజ్దా చేయుట వాజిబ్ (తప్పనిసరి) అవుతుంది.

**03.** ప్రయాణీకుడు ఒకే ప్రదేశంలో 15 రోజులు గానీ అంతకన్నా ఎక్కువ రోజులు గానీ విడిదిచేసే ఉద్దేశ్యం లేని యెడల, ఖస్ర్ నమాజే ఆచరించాలి. ఒక వేళ 15 రోజులు విడిదిచేసే ఉద్దేశ్యమున్నచో, ఆ ప్రదేశం అతని తాత్కాలిక స్వస్థలమౌతుంది. కాబట్టి అతను అక్కడ ఖస్ర్ చేయకూడదు. పూర్తి నమాజ్ చదవాలి.

**04.** ప్రయాణీకుడు తన స్వస్థలం యొక్క పొలిమేర దాటిన తరువాత ఖస్ర్ ప్రారంభ మౌతుంది.

**05.** ప్రయాణంలో నమాజ్‌లు ఖజా అయినచో, ఇంటికి వచ్చిన తరువాత వాటిని ఆచరించిననూ జొహ్ర్, అస్ర్, ఇషా పర్జ్ నమాజ్‌లలో రెండు రకాతులే ఖజా ఆచరించ వలెను.

**06.** ఒకవేళ ప్రయాణ సమయంలో స్వస్థలంలో ఖజా అయిన నమాజ్‌లు ఆచరించ

దలచినచో, జొహ్ర్, అస్ర్, ఇషా ఫర్జ్ నమాజ్‌లలో నాలుగు రకాతులు ఖజా ఆచరించ వలెను.

**07.** ప్రయాణీకుడు తన ప్రయాణ సమయంలో, స్థానిక ఇమామ్ వెనుక నమాజ్ ఆచరించినచో, ఇమామ్‌తో పాటు నాలుగు రకాతులు ఆచరించ వలెను. ఖసర్ చేయకూడదు. (బిహిష్తీ జేవర్, స. 47, దీనియాత్ 5 బిజి స. 103)

## 21. నఫిల్ నమాజ్‌లు (అదనపు నమాజ్‌లు)

ఐదు పూటల నమాజ్‌లే కాకుండా మరికొన్ని సాంప్రదాయిక నమాజ్‌లు కూడ ఉన్నాయి. వీటికి కూడ అత్యధిక ప్రాముఖ్యమున్నది. వీటిని ఆచరించుట ఫర్జ్ గానీ వాజిబ్ కానీ కాదు. ఇవి కేవలం నఫిల్ నమాజ్‌లు, అనగా అదనపు నమాజ్‌లు.

విశ్వాసులైన అల్లాహ్ దాసులు తీర్పుదినాన సాఫల్యం పొందడానికి వీలైనంత అధికంగా నఫిల్ నమాజ్‌లు ఆచరించాలి. ఫర్జ్ నమాజ్‌కు ముందు, ఫర్జ్ నమాజ్‌ల తరువాత, ఆచరించబడే సున్నత్‌లు(ముఅక్కద మరియు గైర్ ముఅక్కద), నఫిల్‌లు అన్నింటిని విడిచిపెట్టక ఆచరించాలి. వీలైనంత అధికంగా నఫిల్ నామాజ్‌లను సంపాదించుకొని, ప్రళయ దినం వైపు పయనించాలి. (ముస్లిం ఖవాతీన్ కే లియే 20 సబఖ్,స.12)

### 21.1. తహియ్యతుల్ వుజూ

చక్కగా వుజూ చేసిన తరువాత రెండు రకాత్‌లు నఫిల్ నమాజ్ ఆచరించడం ముస్తహబ్ (అభిలషణీయం). హజ్రత్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఇట్లు తెలిపిరి: “చక్కగా వుజూ చేసి, సంపూర్ణ వినయ విధేయతలతో మనస్సును అల్లాహు తఆలా యందే లగ్నంచేసి (ఖుషూ వ ఖుజూ), రెండు రకాత్‌లు నమాజ్ ఆచరించిన విశ్వాసి కొరకు స్వర్గం వాజిబ్ (తప్పనిసరి) అవుతుంది.” (ముస్లిం ఖవాతీన్ కే లియే 20 సబఖ్,స.12)

### 21.2. తహియ్యతుల్ మస్జిద్

మసీదు లోనికి ప్రవేశించు విశ్వాసి రెండు రకాత్‌ల నమాజ్ ఆచరించుట సున్నత్ (సాంప్రదాయం) అయి యున్నది. ఈ నమాజ్ యొక్క ఉద్దేశ్యం మసీదును

గౌరవించడం, వాస్తవానికి ఆ గౌరవం అల్లాహు తఆలాకే చెందుతుంది. (దుర్రెముఖ్తార్) ఈ నమాజ్ నే తహియ్యతుల్ మస్జిద్ అందురు.

నబీ కరీమ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఇట్లు తెలిపిరి: "మీలో ఎవరైనా మసీదుకు మక్రూ (నిషిద్ధ) సమయం కానప్పుడు వెళ్ళినచో, రెండు రకాత్‌ల నమాజ్ ఆచరించే వరకు కూర్చోకండి." (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్) మక్రూ సమయమైనచో, నాలుగు సార్లు **సుబ్‌హానల్లాహి వల్‌హమ్‌దు లిల్లాహి వ లాఇలాహ ఇల్లల్లాహ్** పఠించండి. తరువాత దరూదె షరీఫ్ చదవండి. (దుర్రెముఖ్తార్)

ఒకవేళ మసీదు లోనికి ప్రవేశించి వెంటనే ఫర్జ్ నమాజ్ కానీ నఫిల్ నమాజ్ కానీ ఆచరించినచో, అది "తహియ్యతుల్ మస్జిద్" కు ప్రత్యామ్నాయం (బదులు) గా సరిపోతుంది. అనగా "తహియ్యతుల్ మస్జిద్" యొక్క సంకల్పం చేయక పోయినను, అది చదివితే కలిగే పుణ్యఫలం లభిస్తుంది. (దుర్రెముఖ్తార్)

## 21.3. ఇష్రాఖ్ నమాజ్

సూర్యోదయమైన తరువాత, సూర్యకిరణాలు స్పష్టంగా, తెల్లబడిన తరువాత రెండు లేక నాలుగు రకాత్‌లు నఫిల్ నమాజ్ ఆచరిస్తారు. దీనినే ఇష్రాఖ్ నమాజ్ అందురు. (ముస్లిం ఖవాతీన్ కే లియే 20 సబఖ్,స.12)

హజ్రత్ అనస్ ఇబ్నె మాలిక్ రజి యల్లాహు అన్‌హు తెలిపిన ప్రకారం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఇట్లు సెలవిచ్చిరి: "ఎవరైతే ఫర్జ్ నమాజ్ జమాత్ తో చదివి, సూర్యోదయం వరకు అల్లాహు తఆలా యొక్క ధ్యానం (జిక్ర్) లో లీనమై ఉండి, పిమ్మట రెండు రకాత్‌లు నఫిల్ నమాజ్ ఆచరించినచో, అతనికి హజ్ మరియు ఉమ్రా యొక్క పుణ్య ఫలం లభిస్తుంది."

నబీ కరీమ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు లోపరహిత, సంపూర్ణ (కామిల్) హజ్ మరియు ఉమ్రా పుణ్యఫలం లభించునని మూడు సార్లు పలికిరని హజ్రత్ అనస్ రజియల్లాహు అన్‌హు గారు తెలిపిరి. (తిర్మిజీ)

## 21. 4. చాష్త్ నమాజ్

సూర్యుడు ఉదయించిన మూడు గంటల తరువాత రెండు లేక నాలుగు లేక ఎనిమిది రకాత్‌లు నఫిల్ నమాజ్‌ను ఆచరిస్తారు. దీనినే "చాష్త్ నమాజ్" అంటారు. ఇది మిక్కిలి విశిష్ఠమైనది. హజ్రత్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్

గారు ఇట్లు సెలవిచ్చారు: ఎవరైతే ఈ నమాజ్‌ను అలవాటు చేసుకొని సక్రమంగా ఆచరిస్తారో, అతని సమస్త పాపాలు క్షమించ బడుతాయి, ఒకవేళ అవి సముద్రపు నురుగుతో సమానంగా ఉన్ననూ. అనగా ఎంత అధికంగా ఉన్నను, క్షమించ బడుతాయని అర్థం. (ముస్లిం ఖవాతీన్ కే లియే 20 సబఖ్,స.13)

హజ్రత్ అబూజర్ రజియల్లాహు అన్హు తెలిపిన ప్రకారం నబీ కరీమ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఇట్లు సెలవిచ్చిరి: ప్రతి మనిషి తన శరీరంలోని కీళ్ళు సక్రమంగా యున్నందున అల్లాహు తఆలాకు కృతజ్ఞత తెలుపుటకు ప్రతి కీలుకు బదులు ప్రతి రోజు ఉదయాన ఒక సదఖ (దానం) చేయాలి. "సుబ్‌హానల్లాహ్" అనిన ప్రతిసారీ, అది సద్‌ఖ అగును. అట్లే "అల్‌హమ్‌దు లిల్లాహ్" అనిన ప్రతిసారీ, అది సద్‌ఖ అగును. అట్లే "అల్లాహు అక్బర్" అనిన ప్రతిసారీ, అది సద్‌ఖ అగును. మంచి పని చేయుటకు ఆజ్ఞాపించుట సద్‌ఖ, చెడ్డపనిని వారించుట సద్‌ఖ అగును. ప్రతి కీలుకు బదులు (అనగా 360 కీళ్ళకు బదులు) అల్లాహు తఆలాకు కృతజ్ఞత తెలుపుటకు రెండు రకాతుల చాష్త్ నమాజ్ ఆచరించిన సరిపోతుంది. (ముస్లిం) దీనిని బట్టి చాష్త్ నమాజ్ యొక్క విశిష్ఠత ఊహించ వచ్చును.

## 21.5. అవ్వాబీన్ నమాజ్

మగ్రిబ్ నమాజ్ తరువాత ఆచరించే 6 లేక 20 రకాత్‌ల నఫిల్ నమాజ్‌ను "అవ్వాబీన్ నమాజ్" అని అంటారు. హదీస్ షరీఫ్‌లో ఈ విధంగా పేర్కొనబడి ఉన్నది: మగ్రిబ్ నమాజ్ తరువాత, ఎటువంటి వృధా పలుకులు పలుకకుండా ఆరు రకాత్‌ల నఫిల్ నమాజ్ ఆచరించిన వ్యక్తి కొరకు, ఈ ఆరు రకాత్‌లు 12 సంవత్సరాల ఆరాధనతో సమానమగును. హదీసులో ఈ విధముగా కూడ పేర్కొన బడి ఉన్నది: మగ్రిబ్ నమాజ్ తరువాత, ఇరువది రకాత్‌ల నఫిల్ నమాజ్ ఆచరించిన వ్యక్తి కొరకు, ఆల్లాహు తఆలా స్వర్గం లో ఒక ఇల్లు నిర్మిస్తారు. (ముస్లిం ఖవాతీన్ కే లియే 20 సబఖ్,స.13)

## 21.6. తహజ్జుద్ నమాజ్

తహజ్జుద్ నమాజ్ యొక్క సమయం అర్థరాత్రి నుండి ఉషోదయానికి పూర్వం వరకు ఉంటుంది. తహజ్జుద్ సమయంలో ప్రత్యేకించి దుఆలు అంగీకరింప బడుతాయి. ఫజ్ర్ నమాజ్ అజాన్‌కు పూర్వం ఒకటి రెండు గంటలు ముందుగా

లేచి, చక్కగా వుజు చేసి రెండు రకాత్‌ల నుండి పండ్రెండు రకాతుల వరకు నఫిల్ నమాజ్ ఆచరించ వలయును. హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఇలా సెలవిచ్చిరి: ప్రతి రోజు రాత్రిలో మూడవ భాగం మిగిలి ఉండగా అల్లాహు తఆలా ఇట్లు పలికెదరు: ఎవరున్నారు నన్ను అర్థించువారు? వారి అభ్యర్థనను అంగీకరిస్తాను. ఎవరున్నారు నన్ను పాప క్షమాపణ కోరువారు? నేను వారి పాపాలను క్షమిస్తాను. ఎటువంటి అక్కరలు లేనివాడు, క్రూరుడు కానివాడై సర్వ సంపదలు కల్గిన వానికి (అల్లాహ్‌కు) అప్పు ఇచ్చువారు ఎవరున్నారు?" ఉదయం వరకు అల్లాహు తఆలా ఇవే పలుకులు పలుకుతూ ఉంటాడు. (ముస్లిం ఖవాతీన్ కే లియే 20 సబఖ్,స.13)

హజ్రత్ అబూ ఉమామా బాహిలీ రజియల్లాహు అన్హు తెలిపిన ప్రకారం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఇట్లు సెలవిచ్చిరి: మీరు తహజ్జుద్ నమాజ్ తప్పకుండా చదవండి. అది మీ పూర్వపు పుణ్యాత్ముల పద్ధతి. దీనిని ఆచరించుటచే మీకు మీ పోషకుడైన అల్లాహు తఆలా యొక్క సామీప్యం లభిస్తుంది. మీ పాపాలు క్షమించబడతాయి. పాపాల నుండి రక్షింపబడుదురు. (ముస్తదరక్ హాకిమ్)

## 21.7. తస్‌బీహ్ నమాజ్ (సలాతె తస్‌బీహ్)

ఈ నమాజ్ యొక్క విశిష్ఠతను గూర్చి హదీసు గ్రంథాలలో చాలా గొప్పగా పేర్కొన బడినది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ఇట్లు సెలవిచ్చిరి: "మీరు ఈ నమాజ్‌ను శ్రద్ధగా ఆచరించిన మీరు చేసిన పది రకాల పాపాలు తుడిచి వేయ బడతాయి. అనగా క్షమించబడతాయి. అవి: 1. మీరు ఇంతకు పూర్వం చేసినవి, 2. ఇక మీదట చేయబోవునవి, 3. క్రొత్తవి, 4. పాతవి, 5. ఉద్దేశ పూర్వకంగా చేసినవి, 6. నిరుద్దేశముతో (అనుకోకుండా) చేసినవి, 7. చిన్నవి, 8. పెద్దవి, 9. బహిరంగంగా చేసినవి, 10. రహస్యంగా చేసినవి."

### 1. తస్‌బీహ్ నమాజ్ ఆచరించు పద్ధతి

"సలాతె తస్‌బీహ్ నాలుగు రకాత్‌లు ఆచరించు చున్నానని సంకల్పం (నియ్యత్) చేయాలి. తరువాత సనా చదవాలి. తరువాత **సూరయె ఫాతిహా (అల్‌హంద్ లిల్లాహ్) ను పఠించక ముందు15 సార్లు తస్‌బీహ్– "సుబ్‌హానల్లాహి వల్‌హమ్‌దు లిల్లాహి వ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్"** చదవాలి.

తరువాత "అఊజుబిల్లాహ్" మరియు "బిస్మిల్లాహ్" చదవాలి. తరువాత అల్‌హమ్‌ద్ షరీఫ్ మరియు ఏదైనా ఒక సూరహ్ చదవాలి. తరువాత **రుకూకు పూర్వం పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి. మరల **రుకూలో** "సుబ్‌హాన రబ్బియల్ అజీమ్" చదివిన తరువాత **పది (10) సార్లు** మరల అదే తస్‌బీహ్ చదవాలి. మరల **రుకూ నుండి లేచి నిలబడి పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి. మరల **మొదటి సజ్దాలో** "సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా" చదివిన తరువాత **పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి, **సజ్దా తరువాత కూర్చొని పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి. తరువాత **రెండవ సజ్దాలో** "సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా" చదివిన తరువాత **పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి. ఇప్పుడు **ఒక రకాత్‌లో 75 సార్లు తస్‌బీహ్ చదువబడినది.** (కాబట్టి రెండవ సజ్దా తరువాత కూర్చొని తస్‌బీహ్ చదవ వలసిన అవసరం లేదు) ఇట్లే మిగిలిన రకాత్‌ల నమాజ్‌ను పూర్తి చేయాలి. **మొత్తం నమాజ్‌లో 300 సార్లు తస్‌బీహ్ చదవాలి.**

## 2. తస్‌బీహ్ నమాజ్ ఆచరించు వేరొక పద్ధతి

"సలాతె తస్‌బీహ్ నాలుగు రకాత్‌లు ఆచరించు చున్నానని సంకల్పం (నియ్యత్) చేయాలి. తరువాత సనా చదవాలి. తరువాత "అఊజుబిల్లాహ్" మరియు "బిస్మిల్లాహ్" చదవాలి. అల్‌హమ్‌ద్ షరీఫ్ మరియు ఏదైనా సూరహ్ చదవాలి. తరువాత **రుకూకు పూర్వం (15) సార్లు** తస్‌బీహ్ – **"సుబ్‌హానల్లాహి వల్‌హమ్‌దు లిల్లాహి వ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్"** చదవాలి. మరల **రుకూలో** "సుబ్‌హాన రబ్బియల్ అజీమ్" చదివిన తరువాత **పది (10) సార్లు** మరల అదే తస్‌బీహ్ చదవాలి. మరల **రుకూ నుండి లేచి నిలబడి పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి. మరల **మొదటి సజ్దాలో** "సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా" చదివిన తరువాత **పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి, **సజ్దా తరువాత కూర్చొని పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి. తరువాత **రెండవ సజ్దాలో** "సుబ్‌హాన రబ్బియల్ అత్‌లా" చదివిన తరువాత **పది (10) సార్లు** తస్‌బీహ్ చదవాలి. **రెండవ సజ్దా తరువాత** కూర్చొని **10 సార్లు తస్‌బీహ్** చదవాలి. ఇప్పుడు **ఒక రకాత్‌లో 75 సార్లు తస్‌బీహ్ చదువబడినది.** ఇట్లే మిగిలిన మూడు రకాత్‌ల నమాజ్ పూర్తి చేయాలి. **మొత్తం నమాజ్‌లో 300 సార్లు తస్‌బీహ్ చదవాలి.**

పైన పేర్కొనిన తస్‌బీహ్‌కు అదనంగా చేర్చి ఈ విధంగా కూడ చదువ వచ్చును: **"సుబ్‌హానల్లాహి వల్‌హమ్‌దు లిల్లాహి వ లాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వ లాహౌల వ లాఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్ అజీమ్."**

ఈ కలిమాలు శాశ్వతమైన పుణ్యఫలాలు. ఇవి చెట్టు నుండి ఎండిన ఆకులు ఏ విధంగా రాలిపోతాయో, ఆ విధంగా పాపాలను నిర్మూలిస్తాయి. ఈ కలిమాలు స్వర్గ సంపద నుండి గ్రహింప బడినవి. ఖుర్‌ఆన్ పారాయణము చేయలేని వారి కొరకు ఇవి ఖుర్‌ఆన్ పారాయణముతో సమానము, అనగా అంతటి పుణ్యఫలం కలుగుతుంది. (హిస్నె హసీన్)

మీకు వీలైతే రోజుకొకసారి ఈ నమాజ్‌ను ఆచరించండి. అట్లు కానిచో ప్రతి శుక్రవారం, జుముఅ నమాజ్‌కు పూర్వం ఒకసారి, ఇది కూడ వీలుకానిచో సంవత్సరంలో ఒకసారి, ఇది కూడ వీలుకానిచో కనీసం జీవితంలో ఒకసారైనా ఆచరించమని ప్రవక్తగారు ఉపదేశించిరి. (తిర్మిజీ)

## 21.8. సలాతె హాజత్ (అవసరాలు నెరవేర్చుకొనుటకు చేయు నమాజ్)

హాజత్ అనగా అవసరం, అక్కర. మన అవసరాలను నెరవేర్చుకొనుటకు ఆచరించు నమాజ్‌ను "సలాతె హాజత్" (హాజత్ కీ నమాజ్) అంటారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఈ విధంగా సెలవిచ్చిరి: మీకు అల్లాహు తఆలాతో గాని లేక ఇతరులతో గాని అవసరమున్నప్పుడు, ఆ అవసరాన్ని పూర్తి చేయుట కొరకు చక్కగా వుజు చేసి మనస్సును అల్లాహు తఆలాపై నిలిపి, రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ "సలాతె హాజత్" సంకల్పంతో ఆచరించాలి. తరువాత అల్లాహు తఆలా యొక్క గొప్పతనాన్ని కీర్తిని స్తుతించాలి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారి పై దరూద్ పంపాలి. పిమ్మట మనస్సును లగ్నంచేసి ఈ క్రింది దుఆతో అల్లాహు తఆలాను వేడుకోవాలి. ఇన్షా అల్లాహ్, మన అవసరం పూర్తవుతుంది.

**లాఇలాహ ఇల్లల్లాహుల్ హలీముల్ కరీమ్, సుబ్‌హానల్లాహి రబ్బిల్ అర్‌షిల్ అజీమ్, అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, అస్‌అలుక మూజిబాతి రహ్మతిక వ అజాయిమ మగ్ఫిరతిక వల్ ఇస్‌మత మిన్ కుల్లి జమ్‌బిన్, వల్‌గనీమత మిన్ కుల్లి బిర్రిన్, వస్సలామత మిన్ కుల్లి ఇస్మిన్ లా తదత్‌లీ జమ్‌బన్ ఇల్లా గఫర్‌తహూ వ లా హమ్మన్ ఇల్లా ఫర్రజ్‌తహూ వ లా కర్‌బన్ ఇల్లా నఫ్ఫస్‌తహూ, వలాజుర్రన్ ఇల్లా కషఫ్‌తహూ వ లా హాజతన్ హియ లక రిజన్ ఇల్లా ఖజయ్‌తహా యా అర్‌హమ ర్రాహిమీన్.** (తిర్మిజీ, ముస్‌తదరకె హాకిమ్)

**అర్థం:** అల్లాహ్ తప్ప మరొకరు ఆరాధనకు అర్హులు లేరు. ఆయన గొప్ప ఉదారుడు. అపార కరుణామయుడు. సమస్త లోపాలకు అతీతుడు. పరిశుద్ధుడు. మహోన్నతమైన విశ్వ సింహాసనానికి యజమాని. సర్వలోకాల పాలకుడు, పోషకుడైన అల్లాహ్ యే సమస్త స్తోత్రములకు అర్హుడు.

ఓ అల్లాహ్! నీ కారుణ్య కటాక్షాలు, నీ మన్నింపు, క్షమాబిక్ష కొరకు అవసరమైన సమస్త సాధనాలను ప్రసాదించుము. ప్రతి పుణ్యకార్యంలోను నాకు భాగాన్ని ప్రసాదించుము. నా సమస్త పాపాలను క్షమించి శాంతిని ప్రసాదించమని ప్రార్థించు చున్నాను. నా పాపాలను క్షమించకుండా విడిచి పెట్టకు.

ఓ అల్లాహ్! దయామయులలో కెల్లా అత్యధిక దయ కలవాడా! నీవు నా పాపాలను క్షమించకుండ, నా కష్టాలను, నా దుఃఖాన్ని దూరం చేయకుండా విడిచి పెట్టకు. నా అవసరం నీకిష్టమైనదైతే, తీర్చకుండా విడిచిపెట్టకు.

**విశిష్ఠత:** ఇది సలాతుల్ హాజత్ యొక్క సాంప్రదాయికమైన దుఆ. అవసరాలు తీర్చుకొనుటకు చేసే దుఆ. అనుభవపూర్వకముగా రుజువైన దుఆ. దాసుడు ఎల్లప్పుడూ అవసరాలు కల్గి యుంటాడు. కావున తన అవసరాలు, చిన్నవైనా, పెద్దవైనా, నెరవేర్చు కొనుటకు అల్లాహు తఆలాను పైవిధంగా ప్రార్థించాలి.

## 21.9. ఇస్తిఖారహ్ నమాజ్

**ఇస్తిఖారహ్** అనగా అల్లాహు తఆలాను మార్గదర్శనము చేయమని కోరుట, మంచిని ప్రసాదించమని ప్రార్థించుట. ఇస్లామ్ ధర్మశాస్త్రం – షరీఅత్ ప్రకారం ఏదైనా విషయం ఆచరించాలా లేదా అనే ధర్మసందేహం కలిగినచో, తనకు మార్గదర్శకం చేయవలసినదిగా అల్లాహు తఆలాను అర్థించుచు చేయు నమాజ్‌ను ఇస్తిఖారహ్ నమాజ్ అందురు.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు తన సహచరులకు ఖుర్ఆన్ సూక్తులను ఎట్లు నేర్పిరో, అట్లు ఇస్తిఖారహ్‌ను నేర్పిరి. అనగా ఖుర్ఆన్‌కు ఇచ్చినంతటి ప్రాముఖ్యాన్ని దీనికి కూడా ఇచ్చిరి. ఇస్తిఖారహ్ చేసి ఆచరించిన కార్యంలో అల్లాహు తఆలా, సాఫల్యాన్ని కల్గించును. ఆటంకములు కలుగవు. ఏదైనా కార్యం, ఉదాహరణకు పెండ్లి, వ్యాపారము, ప్రయాణము మొదలగునవి చేయ వలసి వచ్చినప్పుడు, తప్పక ఇస్తిఖారహ్ చేసి ప్రారంభించ వలెను. శుభం కలుగును, ఇన్‌షాఅల్లాహ్.

హ(జత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ గారు ఇలా సెలవిచ్చిరి: ఏదైనా ముఖ్య కార్యాన్ని ఆచరించవలసి నప్పుడు, నిద్రించుటకు పూర్వం, వుజూచేసి, ఇస్తిఖారహ్ నమాజ్ సంకల్పంతో రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ ఆచరించి మనస్సును లగ్నంచేసి ఈ దుఆను చదవాలి:

**అల్లాహుమ్మ ఇన్నీ అస్తఖీరుక బిఇల్మిక వ అస్తఖ్‌దిరుక బిఖుద్‌రతిక వ అస్‌అలుక మిన్ ఫజ్‌లికల్‌అజీమి ఫ ఇన్నక తఖ్‌దిరు వ లా అఖ్‌దిరు వ తఅ్‌లము వ లా అఅ్‌లము వ అన్‌త అల్లాముల్‌గుయూబ్. అల్లాహుమ్మ ఇన్ కున్‌త తఅ్‌లము అన్న హాజల్ అమ్ర ఖైరుల్లీ ఫీ దీనీ వ మఆషీ వ ఆఖిబతి అమ్రీ ఫఖ్‌దిర్‌హులీ వ యస్సిర్‌హులీ సుమ్మ బారిక్‌లీ ఫీహి వ ఇన్‌కున్‌త తఅ్‌లము అన్న హాజల్‌అమ్ర షర్రుల్లీ ఫీ దీనీ వ మఆషీ వ ఆఖిబతి అమ్రీ ఫస్‌రిఫ్‌హూ అన్నీ వస్‌రిఫ్‌నీ అన్‌హు వఖ్‌దిర్‌లియల్ ఖైర హైసు కాన సుమ్మ అర్‌జినీ బిహీ.**

(దీనియాత్ 1వ సం.45)

**అర్థం:** ఓ అల్లాహ్! నీ జ్ఞాన సౌభాగ్యంతో మేలును, సౌభాగ్యాన్ని ప్రసాదించమని వేడుకొను చున్నాను. నీ శక్తి సామర్థ్యాల ద్వారా నాకు శక్తిని ప్రసాదించమని ప్రార్థించు చున్నాను. నీ మహోన్నతమైన అనుగ్రహాన్ని ప్రసాదించమని అర్థించు చున్నాను. ఎందువలననగా, నిస్సందేహంగా నీవే సమస్త శక్తి సామర్థ్యాలు, సర్వాధికారాలు గలవాడవు. నేను అసహాయుడను. ఎటువంటి శక్తి, సామర్థ్యాలు లేనివాడను. నీవుమహాజ్ఞానివి, సమస్తము ఎరిగినవాడవు, నేను అజ్ఞానిని, ఏమియు ఎరుంగని వాడిని. అగోచరాలను కూడ బాగుగా ఎరింగిన మహాజ్ఞానివి నీవే.

ఓ అల్లాహ్! నీ జ్ఞానం ప్రకారం ఈ కార్యం నా ధార్మిక జీవితానికి, ప్రాపంచిక జీవితానికి, పరలోక జీవితానికి మేలును చేకూర్చునదైనచో, దీనిని నాకు ప్రసాదించు. నాకు దీనిని ఆచరించుట శులభతరం చేయుము. దీనిని నా కొరకు శుభప్రదమైనదిగా చేయుము. ఒకవేళ ఈ కార్యం, నీ జ్ఞానం ప్రకారం, నా ధార్మిక జీవితానికి, ప్రాపంచిక జీవితానికి, పరలోక జీవితానికి నష్టదాయకమైతే, దీనిని నా నుండి, నన్ను దీని నుండి దూరంగా ఉంచుము. దానిబారి నుండి నన్ను రక్షించు. మేలు, సాఫల్యం ఎక్కడున్నాసరే, నేను దానిని అంగీకరించునట్లు చేయుము.

## గమనిక

**హాజల్ అమ్ర(ఈపని)** – అన్న పదం రెండు ప్రదేశాలలో వచ్చి యున్నది.

ఈ పదాలకు బదులు, మనం ఏ కార్యం కొరకు ఇస్తిఖారహ్ చేయు చున్నామో, ఆకార్యాన్ని పలకాలి లేదా ఆకార్యాన్ని మనసు నందు స్మరించాలి. (దీనియాత్ 1 యం/46)

ఇస్తిఖారహ్‌కు **జవాబుగా** మనకు కలలో ఏ విషయాన్నైనా చూడటం గానీ, లేదా మన మనస్సులో ఆ విషయాన్ని గూర్చి దృఢనిశ్చయం కలుగుట గానీ, మనం ఏ విషయంగా ఇస్తిఖారహ్ చేయుచున్నామో, ఆ కార్యసాధన సులభమగుటగానీ, లేదా ఆ కార్యాచరణ యందు ఆటంకం కలుగుట గానీ సంభవించును. (దీనియాత్ 1 యం స.46)

ఏదైనా కార్యాచరణ విషయంగా ఆచరించాలా లేదా అనే ధర్మసందేహం కలిగినచో, తనకు మార్గదర్శం చేయవలసినదిగా అల్లాహు తఆలాను అర్థించుచు పైన తెలిపిన విధంగా ఇస్తిఖారహ్ చేయాలి. ఒకవేళ పైవిధంగా ఇస్తిఖారహ్ చేయు అవకాశం, సమయం లేనిచో, త్వరగా నిర్ణయించ వలసి యున్నచో, ఈ క్రింది దుఆలను అనేక పర్యాయాలు పఠించాలి:

**1. అల్లాహుమ్మ ఖిర్ లీ వఖ్తర్ లీ.**

**అర్థం:** ఓ అల్లాహ్! నాకొరకు (ఋజు మార్గమును) ఎన్నుము. నా కొరకు నీవే ఇష్టపడుము.

**2. అల్లాహుమ్మహ్‌దినీ వ సద్దిద్‌నీ వ ఖినీ షర్ర నఫ్సీ.**

**అర్థం:** ఓ అల్లాహ్! నాకు సద్బుద్ధిని ప్రసాదించు. నన్ను ఋజుమార్గంలో నడిపించు. నన్ను నా ఆత్మ దుష్టత్వము, మనోవాంఛల (నఫ్సకే షర్) నుండి రక్షించు.

**3. అల్లాహుమ్మ అల్‌హిమ్‌నీ రుష్‌దీ వత్‌జిమ్ లీ అలా రుష్‌దీ అమ్రీ.**

**అర్థం:** ఓ అల్లాహ్! నాకు మేలును చేకూర్చు ఆలోచనలను నా మనసులో అంకురింప (కలుగ) చేయుము. నా కార్యసాధనకు అనువైన మార్గాన్ని నా కొరకు నిర్ణయించు. (పుర్‌నూర్ దుఆయేఁ స.102)

## 21.10. తౌబా నమాజ్ (క్షమాబిక్ష కొరకు చేయు నమాజ్)

ఇస్లామ్ ధర్మశాస్త్రం, షరీఅత్‌కు విరుద్ధంగా ఏదైనా పొరబాటు జరిగిపోయి నప్పుడు, అనగా ఏదైనా పాపం లేదా తప్పు చేసినప్పుడు, రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ చదివి, తాను చేసిన పొరబాటుకు సిగ్గుపడుచు, బాధపడుచు, పశ్చాత్తాప పడుచు, ఇకమీదట అటువంటి సిగ్గుమాలిన కార్యం చేయనని వాగ్దానం చేసి, తాను చేసిన పొరబాటుని క్షమించమని అల్లాహు తఆలాను వేడుకొని, ఆ పాపమును

క్షమించునట్లు చేసుకొనుటయే తౌబా నమాజ్. ఇట్లు చేయుటచే, అపార కృపా శీలుడైన అల్లాహుతఆలా తన కరుణా కటాక్షములతో క్షమించి వేయును(బిహిష్తీ జేవర్)

## 21.11. కుసూఫ్ నమాజ్ (సూర్యగ్రహణపు వేళ చేయు నమాజ్)

కుసూఫ్ అంటే సూర్యగ్రహణం. సూర్యగ్రహణపు వేళ ఆచరించు నమాజ్‌ను కుసూఫ్ నమాజ్ అందురు. సూర్యగ్రహణపు వేళ సామూహికంగా (జమాత్‌తో) రెండు రకాత్‌ల నమాజ్ ఆచరించుట సున్నత్ (సాంప్రదాయం).

ఈ నమాజ్‌లో ఇమామ్ గారు మెల్లగా ఖుర్ఆన్ పారాయణం చేయాలి. సుదీర్ఘ ఖుర్ఆన్ పారాయణం శ్రేష్ఠతరము. నమాజ్ తరువాత సూర్యగ్రహణం వీడేవరకు దుఆ, ఇస్తిగ్‌ఫార్ (పాప క్షమాపణ) లో నిమగ్నులై యుండాలి. ఈ లోపు ఫర్జ్ నమాజ్‌ల సమయమైతే, దుఆ చేయుట ఆపి, ఆ నమాజ్‌లను ఆచరించాలి. (ఇల్ముల్ ఫిఖా, 2/62)

## 21.12. ఖుసూఫ్ నమాజ్ (చంద్రగ్రహణపు వేళ చేయు నమాజ్)

ఖుసూఫ్ అంటే చంద్రగ్రహణం. చంద్రగ్రహణపు వేళ ఆచరించు నమాజ్‌ను ఖుసూఫ్ నమాజ్ అందురు. చంద్రగ్రహణపు వేళ వ్యక్తిగతంగా (జమాత్‌తో కాకుండ) రెండు రకాత్‌ల నమాజ్ ఆచరించుట సున్నత్ (సాంప్రదాయం). నమాజ్ తరువాత చంద్రగ్రహణం వీడేవరకు దుఆ, ఇస్తిగ్‌ఫార్ (పాప క్షమాపణ) లో నిమగ్నులై యుండాలి. (ముస్లిమ్,1/296)

## 21.13. ఖౌఫ్ నమాజ్

ప్రజలందరిపై సామూహికంగా ఏదైనా ఉపద్రవం (కష్టం, యుద్ధం, అంటువ్యాధులు ప్రబలుట) కలిగినపుడు, రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ ఆచరించి, ఆ ఉపద్రవాల నుండి రక్షించమని అల్లాహు తఆలాను వేడుకొనుట సాంప్రదాయం. దీనినే నమాజె ఖౌఫ్ / ఖౌఫ్‌కీ నమాజ్ అందురు. ఈ నమాజ్‌ను ఇండ్లలో ఆచరించుటయే సాంప్రదాయం.

## 23.14. ఇస్తిస్‌ఖా నమాజ్ (వర్షం కొరకు చేయు నమాజ్)

వర్షం కోసం చేసే నమాజ్‌ను ఇస్తిస్‌ఖా నమాజ్ అంటారు. కరువు కాటకాలు సంభవించి నపుడు, రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ శ్రద్ధాభక్తులతో

ఆచరించి, వర్షం కురిపించమని అల్లాహును వేడుకొనుటయే ఇస్తిస్ఖా నమాజ్.

వర్షాకాలంలో వర్షం పడక పోవుటచే, ప్రాణులన్నియు నీరులేక మిక్కిలి ఇబ్బందులకు గురియైనప్పుడు, వరుసగా మూడు రోజులు చినిగిన వస్త్రములు ధరించి, శిరస్సును కప్పుకో కుండ, చిందరవందరగా వ్యాకులము చెందిన స్థితిలో, జనావాసానికి దూరంగా వెళ్ళి రెండు రకాత్‌ల నమాజ్ సామూహికముగా, ఖుర్ఆన్ పారాయణం బిగ్గరగా చేయుచు ఆచరించ వలెను. తరువాత ఇమామ్‌గారు ఒక ఖుత్బా (ఉపన్యాసం) ఇవ్వవలెను. తరువాత దుఆ, ఇస్తిగ్‌ఫార్ (పాప క్షమాపణ) లలో నిమగ్నులు కావలెను. ఇన్షా అల్లాహ్, మూడు రోజులలోపు వర్షం కురియును.

(అమలియాతె ముజర్రబ, ఈజాహుల్‌మసాయిల్, స.46)

### ఇస్తిస్ఖా యొక్క దుఆ

**"అల్లాహుమ్మస్‌ఖి ఇబాదక వ బహాఇమక వన్‌షుర్ రహ్మతక వ అహ్‌యి బల్‌దకల్ మయ్‌తహ్"**

**అర్థం:** ఓ అల్లాహ్! నీ దాసులకు, (నీరులేని) జంతువులకు నీళ్ళు త్రాగించు. నీ కారుణ్య వర్షాన్ని మా అందరిపై కురిపించు. మృతభూమిని సస్యశ్యామలంగా మార్చుము.

### గమనిక

**01.** ఇందులోని అరబీ సూక్తులు, దుఆలు మొదలగువాటి సరియైన ఉచ్చారణను నేర్చుకొనుటకు ఇస్లామ్ పండితుల (ఆలిమ్‌ల) సహాయాన్ని పొందండి.

**02.** నమాజ్‌కు సంబంధించిన సిద్ధాంతాలు ఈ పుస్తకంలో పేర్కొన్నవే కాక ఇంకను అనేకమున్నాయి. అవసరాన్నిబట్టి ఇస్లామ్ పండితుల (ఆలిమ్‌ల) ద్వార నేర్చుకోండి.

**********

హజ్రత్ జుబైర్ (రహ్మ.) గారు ప్రవక్త (స) గారి హదీసును ఇట్లు ఉల్లేఖించిరి: అల్లాహు తఆలా నన్ను ధనము సంపాదించి గొప్ప ధనవంతుడు కమ్మని ఆజ్ఞాపించ లేదు. కానీ, మరణము సంభవించు వరకు ఆయన నామమును జపించవలెననియు, ఆయన గొప్పతనమును కీర్తించ వలెననియు, నమాజ్‌ను ఆచరించ వలెననియు, మరియు అల్లాహుత ఆలా యొక్క ప్రార్థనలో నిమగ్నమై యుండ వలెననియు ఆజ్ఞాపించెను. (షర్‌హుస్సున్నహ్,మిష్కాతుల్ మసాబీహ్)